తర తరాల పిల్లల కథలు
రూ॥ 70/-
పేజీలు: 64



నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


న్యాయపోరాట ధీర జాకియా జాఫ్రీ

ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థ


మైనింగ్ తవ్వకాలు నిలిపివేయాలి

లోపలి పేజీల్లో


సంపుటి 27, సంచిక: 230 | శనివారం | 08-02-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00




## మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో లేనట్లే!



- ఎవరు ఉండాలనే విషయంపై అధిష్ఠానానిదే తుది నిర్ణయం
- నేను ఎవరినీ ప్రతిపాదించను
- ప్రతిపక్షనాయకుల కేసుల విషయంలో చట్టప్రకారమే ముందుకు
- కులగణన ఆషామాషీగా చేసింది కాదు
- ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం
- రెండురోజుల్లో టిపిసిసి కార్యవర్గం కొలిక్కి
- పార్టీ, పార్టీనేతల మనోభావాలకు అనుగుణంగా ఉంటా
- ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టిలో సిఎం రేవంత్‌రెడ్డి
- ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గేతో భేటీ
- కేబినేట్ విస్తరణ, నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో లేనట్టేనని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ''మంత్రివర్గంలో ఎవరు ఉండాలనేది అధిష్టానానిదే తుది నిర్ణయం. నేను ఎవరి పేరు ప్రతిపాదించట్లేదు. ప్రతిపక్ష నేతలపై కేసుల విషయంలో చట్ట ప్రకారమే ముందుకు వెళతాం. త్వరగా అరెస్టు చేయించి జైలులో వేయాలనే ఆలోచన మాకు లేదు. నాకు ఉన్న అవకాశం మేరకు అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా పనిచేస్తున్నాం. కులగణన ఆషామాషీగా చేసింది కాదు.. ఎంతో పకడ్బందీగా చేశాం. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని కులగణన సర్వే చేశాం. కులగణనతో ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం లభించినట్లు అయింది. టిపిసిసి కార్యవర్గ కూర్పు కొలిక్కి వచ్చింది. దీనిపై ఒకటి రెండు రోజుల్లో ప్రకటన ఉంటుంది'' అని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. 'రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ తాను కోరలేదు. రాహుల్‌గాంధీతో నా అనుబంధంపై తెలియనివాళ్లు మాట్లాడితే నాకేంటి. ప్రభుత్వం, పార్టీలో కీలక నిర్ణయాలు అధిష్ఠానం దృష్టిలో ఉంటాయి. పార్టీ, పార్టీ నేతల మనోభావాలకు అనుగుణంగానే ఉంటాను. వ్యక్తిగత నిర్ణయాలు ఎప్పుడూ ఉండవు. పార్టీ ఇచ్చిన పని పూర్తి చేయడమే నా లక్ష్యం. పని చేసుకుంటూ పోవడమే నాకు తెలుసు. ప్రతి ఒక్క విమర్శకు స్పందించాల్సిన అవసరం లేదు' అని రేవంత్‌రెడ్డి అన్నారు. కులగణనలో బిసిలు ఐదున్నర శాతం పెరిగారని, బిసిలు పెరిగిన విషయాన్ని లెక్కలతో సహా చూశాక బిజెపి ఎంఎల్‌ఎ పాయల్ శంకర్ అసెంబ్లీలో అంగీకరించారని అని సిఎం చెప్పారు. కాగా అంతకు ముందు పార్లమెంట్‌లో ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిశారు. మంత్రివర్గ విస్తరణ,

తరువాయి 2లో




## ఢిల్లీలో గెలుపెవరిదో?

- నేడే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
- 60.54 శాతం ఓట్లు పోలైనట్లు ఇసి స్పష్టీకరణ
- కౌంటింగ్‌కు 5వేల మంది సిబ్బంది మోహరింపు

**న్యూఢిల్లీ :** ఢిల్లీ పాలనాధికారం ఎవరిదో మరికొన్ని గంటల్లో తేలనుంది. ఈనెల 5వ తేదీన జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు శనివారం వెల్లడి కానున్నాయి. ఫలితాల అనంతరం అధికార పార్టీ అయిన ఆప్ నాలుగోసారి అధికారంలోకి వస్తుందా లేదా 27 సంవత్సరాల తర్వాత దేశ రాజధానిలో ప్రభుత్వాన్ని బిజెపి ఏర్పాటు చేస్తుందా అనేది తేలనుంది. అయితే గత రెండుసార్లు నుంచి కాంగ్రెస్ కూడా అధికారం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. 2015 నుండి ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆప్ కంటే బిజెపికి అనేక ఎగ్జిట్ పోల్స్ ఆధిక్యాన్ని ఇచ్చాయి. కాగా, ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రారంభం నుంచే ముందస్తు ట్రెండ్‌లు వచ్చే అవకాశం ఉంది. ఎన్నికల కమిషన్ ప్రకారం, బుధవారం 60.54 శాతం ఓట్లు పోలయ్యాయి. ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా తమ పార్టీ దాదాపు 50 సీట్లు గెలుచుకుంటుందని పేర్కొన్నారు. ఆప్ ఎగ్జిట్ పోల్ అంచనాలను తిరస్కరించింది. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నాలుగోసారి ముఖ్యమంత్రి అవుతారని, తాము మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొంది. ఢిల్లీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (ఇసిఒ) అలిస్ వాజ్ మాట్లాడుతూ కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రోఅబ్జర్వర్లు, ఈ ప్రక్రియ కోసం శిక్షణ పొందిన సహాయక సిబ్బందితో సహా మొత్తం 5,000 మంది సిబ్బందిని

తరువాయి 2లో

### పన్నురేట్లు తగ్గించిన ఆర్‌బిఐ 05

- రెపో రేటును 25 బేస్ పాయింట్ల ఆధారంగా 6.25 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం
- ఐదేళ్లలో ఇదే మొదటిసారి




### మార్చిలో బ్యాంకుల సమ్మె 05

- తమ డిమాండ్ల సాధనకు రెండురోజుల సమ్మెకు పిలుపు

### కేజ్రీవాల్‌కు ఎసిబి నోటీసు 05

- ఎమ్మెల్యేలకు బిజెపి లంచం ఆరోపణలపై విచారణకు ఎల్‌జి ఆదేశం

### హన్మకొండ డిటిసి ఇళ్లలో ఎసిబి సోదాలు 03

## 10న చర్చలకు రండి

ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసికి కార్మికశాఖ పిలుపు



ప్రజాపక్షం / హైదరాబాద్

సమ్మె నోటీసు ఇచ్చిన టిజిఆర్‌టిసి జెఎసిని కార్మిక శాఖ చర్చలకు ఆహ్వానించిది. ఈ నెల 10న చర్చలకు రావాలని జెఎసి నేతలకు కార్మిక శాఖ నోటీసు ఇచ్చింది. జెఎసి నేతలతో పాటు ఆర్‌టిసి యాజమాన్యానికి సైతం కార్మిక శాఖ

తరువాయి 2లో

## ఇక రేషన్ కార్డులకు మీసేవలోనూ దరఖాస్తులు

మీసేవ కమిషనర్‌కు పౌరసరఫరాల శాఖ ఆదేశాలు

**హైదరాబాద్:** కొత్త రేషన్ కార్డుల కోసం మీ–సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని మీ సేవ కమిషనర్‌ను పౌరసరఫరాలశాఖ ఆదేశించింది. ఇప్పటివరకు సుమారు లక్ష కార్డులను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఇటీవల వార్డు, గ్రామ సభలు, ప్రజా పాలనలో భాగంగా సుమారు 10 లక్షల దరఖాస్తులు వచ్చాయి. దీంతో రేషన్ కార్డులకు సంబంధించిన డేటా బేస్‌ను మీ సేవతో అనుసంధానం చేయాలని ఎన్‌ఐసిని ప్రభుత్వం ఆదేశించింది. లబ్ధిదారులు ఇప్పటికే ఇచ్చిన దరఖాస్తులన్నీ ప్రభుత్వం వద్ద ఉన్నాయని, దరఖాస్తు చేయని వారు మాత్రమే మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

## రాష్ట్రంలో హెచ్‌పి రోబోటిక్స్ రూ.500 కోట్ల పెట్టుబడి

- 500 మందికి ఉద్యోగ అవకాశాలు
- వచ్చే మూడేళ్లలో మరో 2000 ఉద్యోగాలు
- ఐటిశాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- పరిశ్రమలకు కేటాయించిన భూములను మరోలా వాడుకుంటే చర్యలని హెచ్చరిక




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మరో రూ.500ల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు సెంటిలియాన్ నెట్ వర్క్స్‌కు చెందిన హెచ్‌సి రోబోటిక్స్ ముందుకొచ్చిందని, తద్వారా ఏడాదికి 500ల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయని, ఈ సంఖ్య మూడేళ్ల కాలంలో మరో 2వేలకు చేరుతుందని పరిశ్రమలు,

తరువాయి 2లో



- భారత విద్యార్థులపై వేధింపు చర్యలు సరికాదు
- గుడిసెవాసులకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలి
- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్

## అమెరికా దుశ్చర్యలపై ప్రధాని నోరు విప్పాలి

ప్రజాపక్షం/నర్సంపేట

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంపు ఉన్నత విద్య కోసం వెళ్లిన భారత విద్యార్థులపై అక్రమ వలసలు అంటూ చేస్తున్న దుశ్చర్యలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ నోరు విప్పాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని మేరు సంఘం భవన్‌లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉన్నత విద్య కోసం భారత దేశం అమెరికాతో స్నేహ సంబంధాలు కలిగి ఉందని కానీ డోనాల్డ్ ట్రంపు వచ్చినంక అక్రమ వసలు

తరువాయి 12లో


## గ్రేటర్‌లో 'కులగణన' సరిగా ఎందుకు చేయలేదు?

కారణాలు చెప్పాలని జిహెచ్‌ఎంసికి కమిషనర్‌కు బిసి కమిషన్ లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సమగ్ర కుటుంబ కులగణన సర్వే(ఆర్థిక, సామాజిక, రాజకీయ, ఉద్యోగ, విద్య సర్వే) తక్కువగా జరగడం పట్ల తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ తీవ్రంగా పరిగణించింది. సర్వే తక్కువగా కావడానికి కారణాలను తెలియజేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ కె.ఇలంబర్తి కి బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ శుక్రవారం లేఖ పంపించారు. కారణాలను తెలుసుకునేందుకు నామూన సర్వేను చేపట్టాలని కమిషన్ ఆ లేఖలో ప్రతిపాదించింది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ప్రణాళిక విభాగం సర్వే చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 1,15,71,457 గృహాలను గుర్తించగా, ఇందులో 1,12,15,134 గృహాలు (96.9 శాతం)

తరువాయి 2లో



అభివృద్ధి, మౌలిక వసతులకు

## బడ్జెట్‌లో పెద్దపీట

- కేరళ అసెంబ్లీలో పద్దును ప్రవేశపెట్టిన విజయన్ సర్కారు
- హైదరాబాద్‌లో కేరళ హౌస్‌కు రూ.5 కోట్లు
- వయనాడ్‌కు రూ.750 కోట్లు



**తిరువనంతపురం :** కేరళలోని రెండవ పినరయి విజయన్ ప్రభుత్వం అసెంబ్లీలో తన 5వ, చివరిబడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టింది. అయితే ఈ సారి సంక్షేమ పెన్షన్ల పెంపు వంటి ఎలాంటి ప్రధాన ప్రజాదరణ పొందిన పెన్షన్ల ప్రకటనలు చేయకుండా ఎక్కువగా అభివృద్ధి, మౌలికవసతుల కల్పనపై దృష్టి సారించింది. 2025–2026 సంవత్సరానికి చెందిన బడ్జెట్‌ను ఆర్థికశాఖమంత్రి కెఎన్.బాలగోపాల్

తరువాయి 12లో

మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో

## భారీ అవకతవకలు

- ఐదు నెలల్లో 30 లక్షల మంది ఎలా పెరిగారు?
- ఇసి స్పందించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం : రాహుల్‌గాంధీ
- లిఖితపూర్వకంగా స్పందిస్తాం : ఇసి



**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘంపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అనేక అవకతవకలు జరిగాయన్నారు. రాష్ట్ర వయోజన జనాభాకంటే ఓటు కోసం నమోదుచేసుకున్న వారి సంఖ్య అధికంగా ఉందన్నారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల మధ్య ఐదు నెలల కాలంలో గత ఐదు సంవత్సరాల కంటే ఎక్కువ మంది ఓటర్లను చేర్చారని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికలు 2024,

తరువాయి 2లో





# గృహదహనాలు.. విధ్వంసాలు..

బంగ్లాదేశ్‌లో మరోసారి హింస భగ్గుమంది. గృహదహనాలు, విధ్వంసాలతో దేశం అట్టుడుకుతున్నది. బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రెహ్మాన్, ఆయన కుమార్తె, మాజీ ప్రధాని షేక్ హసీనా, మాజీ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్‌తోపాటు అవామీ లీగ్ పార్టీ కీలక నాయకుల ఇళ్లను లక్ష్యంగా చేసుకొని వేలాది మంది ప్రజలు దాడులకు పాల్పడుతున్నారు. హసీనా ప్రసంగమే ఈ దాడులకు కారణమని అంటున్నారు. గత ఏడాది ఆగస్టు ఉద్యమం తర్వాత, హసీనా పదవీచ్యుతురాలై దేశం నుంచి పరారుకాగా, ఆమె పార్టీ అవామీ లీగ్ నాయకులు చాలాకాలంగా అజ్ఞాతంలోనే ఉంటున్నారు. కాగా, నాటి ఉద్యమంలోనే ముజిబుర్ రెహ్మాన్ విగ్రహాలు, కటౌట్లను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. తాజాగా వారు అవామీ లీగ్ నాయకుల ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగారు. ముజిబుర్ రెహ్మాన్, హసీనా, హమీద్ తదితరుల గృహాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి భద్రతా సిబ్బంది శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. కానీ, ఆందోళనలు గత రెండు రోజులుగా కొనసాగుతునే ఉన్నాయి.

## మార్చి 7 నుంచి 24 వరకు హెచ్-1బి రిజిస్ట్రేషన్లు




**న్యూయార్క్:** అమెరికా సిటిజెన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) 2025–26 ఆర్థిక సంవత్సరానికి హెచ్1బి వీసాల ప్రాథమిక రిజిస్ట్రేషన్ తేదీలను ప్రకటించింది. ఈ ప్రక్రియ మార్చి 7న ప్రారంభమై, 24తో ముగుస్తుంది. యుఎస్‌సిఐఎస్ ప్రకటనను అనుసరించి, అధికారిక ఆన్‌లైన్ ఖాతా ద్వారా అర్హతలు కలిగిన కంపెనీలు ఇనిషియల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ వీసా అవసరమున్న వారి సమాచారాన్ని డిజిటల్‌గా నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కంపెనీలు ప్రతి దరఖాస్తుదారుడి తరఫున 215 అమెరికన్ డాలర్లు (సుమారు 18,801 రూపాయలు) రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించాలి. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన లబ్ధిదారుడి కేంద్రీకృత ఎంపిక ప్రక్రియ ప్రాతిపదికన 2026 ఆర్థిక సంవత్సరంలోనూ హెచ్1బి వీసాలపై పరిమితిని అమలు చేస్తారు. గడువు ముగిసిన తర్వాత, అందిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారిని ఎంపిక చేసి, వారికి సంబంధించిన యుఎస్‌సిఐఎస్ ఆన్‌లైన్ ఖాతాలకు సమాచారాన్ని అందిస్తారు. భారత్ సహా అత్యధిక దేశాల్లో ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతుండగా, అమెరికాలో ఆర్థిక సంవత్సరం అక్టోబర్ 1న మొదలవుతుంది. అంటే, ప్రస్తుతం 2025 ఆర్థిక సంవత్సరం నడుస్తున్నది. 2026 ఆర్థిక సంవత్సరం ఈ ఏడాది అక్టోబర్ 1న ప్రారంభమవుతుంది. అందుకే, అధికారులు నాన్ ఇమ్మిగ్రెంట్ రకానికి చెందిన ఈ హెచ్1బి వీసా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించారు. సాధారణంగా సాంకేతిక నిపుణులు, నిష్ణాతులుగా ఉన్న వారికి అమెరికా ఈ వీసాలను అమెరికా జారీ చేస్తుంది. అమెరికాలో హెచ్1బి వీసా ద్వారా లబ్ధిపొందుతున్న దేశాల్లో భారత్, చైనా ముందు వరసలో ఉన్నాయి. అమెరికాలోని టెక్ కంపెనీలు హెచ్1బి వీసాలతోనే భారత్, చైనాకు చెందిన వేలాది మంది టెక్ నిపుణులను ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయి. కాగా, అమెరికా ఏటా 6.50 లక్షల హెచ్1బి వీసాలు జారీ చేస్తుంది. అదే విధంగా, అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించిన విదేశీయులకు 20000 వీసాలను జారీ చేస్తుంది.

## అమెరికా ఆంక్షలకు వ్యతిరేకంగా.. ప్రపంచ దేశాలు ఏకంకావాలి

### అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు పిలుపు




**ది హేగ్ (నెదర్లాండ్స్):** అమెరికా ఆంక్షలు విధించంపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) తీవ్రంగా స్పందించింది. నిష్పాక్షిక, పాదర్శకమైన విధానాల అమలుకు, స్వేచ్ఛకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం గొడ్డలిపెట్టని వ్యాఖ్యానించింది. ఈ ఆంక్షలకు వ్యతిరేకంగా ఏకమై నిరసనలు తెలపాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. అమెరికాతోపాటు తమ సన్నిహిత మిత్రదేశమైన ఇజ్రాయెల్‌పైన కూడా ఐసిసి ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తూ, వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నదని ఆరోపిస్తున్న అమెరికా అధ్యక్షుడు ఆంక్షల ఉత్తర్వులపై సంతకం చేయడం వివాదాస్పదంగా మారింది. ఈ ఆంక్షవ నేపథ్యంలో 9700 మంది ఉద్యోగులు తొలగించాలని కూడా ట్రంప్ సర్కారు నిర్ణయించింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూపై అరెస్టు వారెంట్ జారీ చేసి ఐసిసి తన అధికారాలను దుర్వినియోగం చేసిందని ట్రంప్ ఆరోపణ. అందుకే, ఐసిసి అధికారులు అమెరికాలో ప్రవేశించకుండా వారిపై నిషేధాజ్ఞలు అమలవుతాయని ఆయన ప్రకటించారు. కాగా, ఈ ఆరోపణలను ఐసిసి తోసిపుచ్చింది. రాజకీయాలతో తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. నేరం చేసిన వారిపై వారెంటు జారీ చేయడం, శిక్ష వేయడం తమ ప్రధాన కర్తవ్యమని, దీనిని అడ్డుకోవడానికి అమెరికా ప్రయత్నిస్తున్నదని ఐసిసి తన ప్రకటనలో ధ్వజమెత్తింది. తమకు మద్దతుగా 125 సభ్యదేశాలు నిలబడాలని కోరింది. అమెరికా వ్యవహార శైలిని ఐసిసి ఖండించింది.

ప్రపంచం

## పాక్ భద్రతా దళాల దాడిలో.. 12 మంది ఉగ్రవాదులు హతం



**పెషావర్ :** పాకిస్తాన్ భద్రతా బలగాలు జరిపిన దాడిలో 12 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. పాకిస్తాన్ వాయువ్య ప్రాంతంలోని ఖైబర్ ఫక్తున్‌క్వా ప్రావీన్స్‌లో భద్రతా దళాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఉగ్రవాదుల స్థావరాలను లక్ష్యంగా చేసుకొని తనిఖీలు కొనసాగిస్తున్నట్టు ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) ఒక ప్రకటనలో తెలిపింది. ఉత్తర వజిరిస్తాన్‌లోని హసన్ ఖేల్‌లో ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక జవాను మృతి చెందినట్టు ఆ ప్రకటనలో పేర్కొంది. ఉగ్రదాడులు సమర్థంగా తిప్పికొట్టామని, ఆ ప్రాంతంలో ఇప్పుడు భద్రతా దళాలు పట్టు సాధించాయని వివరించింది. అఫ్గానిస్థాన్ సరిహద్దులోని ఈ ప్రాంతంలో గిరిజన సమూహాలు ఎక్కువ. తాలిబన్ల ప్రభావం కూడా అధికం. అందుకే, తరచు అక్కడ ఉగ్రదాడులు, కార్యకలాపాలు జరుగుతుంటాయి.

# పనామాపై అమెరికా ఒత్తిడి

### చైనా ఆరోపణ.. ఒప్పందాల పునరుద్ధరణ అవసరమని వ్యాఖ్య




**బీజింగ్ :** రోడ్డు, నౌకాయాన రంగాల్లో పెట్టుబడుల ఒప్పందాన్ని పనామా పునరుద్ధరించకపోవడంపై చైనా తీవ్రంగా స్పందించింది. అమెరికా ఒత్తిడి కారణంగానే పనామా ఈ నిర్ణయం తీసుకుందని వ్యాఖ్యానించింది. చైనా అధికార వర్గాలను ఉటంకించిన పిటిఐ కథనాన్ని అనుసరించి 'ది బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్' (బిఆర్ఐ) ప్రాజెక్టును వివిధ దేశాల్లో అమలు చేస్తున్నారు. చైనా అధ్యక్షుడు క్సీజిన్‌పింగ్ సంతకం చేసిన విదేశాంగ విధాన ఉత్తర్వుల ప్రకారం అమలవుతున్న ఈ ప్రాజెక్టు కింద వివిధ ప్రాంతాల్లో రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో చైనా భారీగా పెట్టుబడులు పెడుతున్నది. ఆ క్రమంలోనే పనామాతోనూ ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే కొన్ని ప్రాజెక్టులు పూర్తికాగా, మరికొన్ని మధ్యస్తంగా ఉన్నాయి. కాంట్రాక్టు గడువు ముగియడంతో, దానిని ఇరు దేశాలు పునరుద్ధరించాల్సి ఉంది. అయితే, ఇందుకు పనామా ససేమిరా అనడంపై బీజింగ్ మండిపడుతున్నది. అమెరికా ఒత్తిడి తేవడంతో పనామా భయపడుతున్నదని ఆరోపిస్తున్నది. ఒప్పందాల పునరుద్ధరణ అత్యవసరమని వ్యాఖ్యానించింది. పనామా కెనాల్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యలు, అనంతరం పనామాతో చేసుకున్న ఒప్పందం పలు అనుమానాలకు తావిస్తున్నది. చైనా పెట్టుబడులను తక్షణమే నిలిపివేయాలని, లేకపోతే పనామా కాలువను స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించడాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. అంతేగాక, పనామా కాలువ మీదుగా అమెరికా యుద్ధ నౌకలు ప్రయాణించినప్పుడు, ఎలాంటి ఫీజు వసూలు చేయాల్సిన అవసరం లేదని అంగీకరిస్తూ పనామా ఒక ఒప్పందంపై సంతకం చేయడం కూడా చర్చనీయాంశమవుతున్నది.

పనామాను బెదిరించి, భయపెట్టి తనకు అనుకూలంగామార్చుకున్న అమెరికా, ఆ తర్వాత చైనా అభివృద్ధిని అడ్డుకోవాలన్న ప్రయత్నాల్లో భాగంగానే ఒత్తిడి తీసుకొచ్చిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికాకు చెందిన 40 శాతం కంటైనర్లు పనామా నుంచే ప్రయాణిస్తాయి. అందుకే, పనామాలో చైనా పెట్టుబడులను అమెరికా సహించలేకపోతున్నది. ఈ నేపథ్యంలోనే చైనాకు చెందిన బిఆర్ఐ ప్రాజెక్టులోని కాంట్రాక్టులను పునరుద్ధరించుకోవడం లేదని పనామా అధ్యక్షుడు జాన్ రౌల్ మోలినో ప్రకటించారన్న వాదన బలంగా వినిపిస్తున్నది. అట్లాంటిక్–పసిఫిక్ మహాసముద్రాలను కలుపుతూ అమెరికా 1914లో పనామా కాలువను నిర్మించింది. కొన్ని దశాబ్దాలు ఈ కాలువ నిర్వహణను తన గుప్పిట్లో ఉంచుకుంది. అయితే, తీవ్ర నిరసనల నేపథ్యంలో, 1977లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్డర్ దానిని పనామాకు అప్పగించారు. అయితే, తమ ప్రయోజనాలకు అనుగుణంగానే రాకపోకలు ఉండాలనే షరతు విధించింది. అంటే, పరోక్షంగా ఇప్పటికే పనామా కాలువపై అమెరికా పెత్తనం కొనసాగుతున్నది. ఇప్పుడు ఏకంగా పనామా దేశంపైన కూడా అజమాయిషీ చెలాయించే ప్రయత్నం జరుగుతున్నది. దీనిని చైనా ఖండిస్తున్నది.

అంతర్జాతీయ ఒప్పందాలు, ఒడంబడికలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నదని చైనా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. పనామాలో తమ ప్రాజెక్టులు కొనసాగేలా, ఒప్పందాల పునరుద్ధరణ జరగాలని కోరుతున్నది.

## కందిమళ్ల గ్రంథాల ఆవిష్కరణ నేడు




**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి రచించిన 'భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉద్యమ ప్రస్థానం', 'విప్లవాల విప్లవం' గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్ నారాయణగూడలోని తాజ్‌మహల్ హోటల్ (పావన హాల్)లో శనివారం సాయంత్రం 5.30 గంటలకు జరుగుతుంది. ప్రముఖ విప్లవ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నిఖిలేశ్వర్ సభకు అధ్యక్షత వహిస్తారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విశ్రాంత ఆచార్యుడు, మానవ హక్కుల కార్యకర్త ప్రొఫెసర్ జి. హరగోపాల్, విశిష్ట అతిథిగా సుప్రసిద్ధ సాహిత్య పరిశోధకుడు, 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక పూర్వ సంపాదకుడు డాక్టర్ కె.శ్రీనివాస్ హాజరవుతారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారిణి, ప్రజా గాయకురాలు కామ్రేడ్ విమలక్క ఆతీత్మయ అతిథిగా ఈ ఆవిష్కరణ సభలో పాల్గొంటారు. తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ సభా నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తారు. సాహితీప్రియులందరికీ కార్యక్రమ నిర్వాహకులు సాదర ఆహ్వానం పలుకుతున్నారు.

## ఢిల్లీలో గెలుపెవరిదో?

(మొదటి పేజీ తరువాయి)

శనివారం నాటి ఓట్ల లెక్కింపులో మోహరించామని చెప్పారు. ఇదిలా ఉండగా, ఎగ్జిట్ పోల్స్ అంచనాల ఆధారంగా బిజెపి తమకు అనుకూలంగా భ్రమను సృష్టించడానికి ప్రయత్నిస్తోందని, కానీ విజయావకాశాలతో ఆప్ అభ్యర్థులను వేటాడేందుకు ప్రయత్నిస్తోందని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. ఆప్ తన ఆరోపణలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని, లేదా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిజెపి డిమాండ్ చేసింది. ఢిల్లీ బిజెపి ప్రధాన కార్యదర్శి విష్ణు మిట్టల్ కూడా ఆప్ ఆరోపణలపై ఎసిబి దర్యాప్తు కోరుతూ లెఫ్టినెంట్ గవర్నర్‌కు లేఖ రాశారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశం వెలువడిన వెంటనే, ఈ విషయంపై ఎసిబి బృందం కేజ్రీవాల్‌ను సందర్శించింది. శుక్రవారం ముందుగా, కేజ్రీవాల్ అన్ని పార్టీల అభ్యర్థులతో సమావేశం నిర్వహించి, ఆప్ తన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని నొక్కిచెప్పారు, ప్రతిపక్షాలు 'మానసిక ఒత్తిడి' సృష్టించడానికి ఎగ్జిట్ పోల్స్‌ను ఉపయోగిస్తున్నాయని, 'ఆపరేషన్ లోటస్' అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. సమావేశం తర్వాత విలేకరులతో ఆప్ సీనియర్ నాయకుడు గోపాల్‌రాయ్ మాట్లాడుతూ, కేజ్రీవాల్ మార్గదర్శకత్వంలో, అన్ని అభ్యర్థులు తమ గ్రౌండ్ రిపోర్టులను సమర్పించారని, ఇది ఆప్ 78 సీట్లపై గట్టి పోటీతో నిర్ణయాత్మకంగా 50 సీట్లను గెలుచుకుంటుందని సూచించిందని అన్నారు. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ రెండింటినీ ఓడించి, 70 అసెంబ్లీ సీట్లలో 67 సీట్లను గెలుచుకుని ఢిల్లీ రాజకీయపటంలో ఆప్ తన ఆధిపత్యాన్ని స్థాపించింది. 2020లో పార్టీ మళ్ళీ తన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, 62 సీట్లను గెలుచుకుని, ప్రతిపక్ష బిజెపి, కాంగ్రెస్‌ను మట్టికరిపించింది. ఆప్ విజయం ఢిల్లీలో కేజ్రీవాల్ ఆధిపత్యాన్ని ప్రదర్శించడంతో పాటు జాతీయ స్థాయిలో ఆయన రాజకీయ ప్రతిష్ఠను పెంచింది. అయితే, బిజెపి ఎన్నికల్లో గెలిస్తే, 27 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత ఢిల్లీలో తిరిగి అధికారంలోకి రావడమే కాకుండా, దశాబ్ద కాలంగా పోటీ పడుతున్న ఆప్, కేజ్రీవాల్ మంత్రాన్ని బద్దలు కొట్టడంలో కూడా విజయం సాధిస్తుంది. 2013 వరకు వరుసగా 15 సంవత్సరాలు ఢిల్లీని పాలించిన కాంగ్రెస్, గత రెండు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవకపోవడంతో తిరిగి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తోంది.

## జన్మతః పౌరసత్వ వివాదం

### బోస్టన్‌లో మరో కేసు..

#### రద్దు చేయాలని అభ్యర్థన

**బోస్టన్:** అమెరికాలో జన్మించిన వారికి రాజ్యాంగం ద్వారా లభించిన పౌరసత్వ హక్కును నిషేధిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న వివాదాస్పద నిర్ణయానికి వ్యతిరేకంగా బోస్టన్‌లో మరో కేసు దాఖలైంది. ట్రంప్ ఆర్డర్‌ను వ్యతిరేకిస్తున్న అమెరికా రాష్ట్రాల జాబితాలో సీటిల్, మేరీలాండ్ జాబితాలో మాసెచూసెట్స్ కూడా చేరింది. సీటిల్ ఫెడరల్ జడ్జి గురువారం ఇచ్చిన తీర్పులో, ట్రంప్ ఆర్డర్‌ను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా మేరీలాండ్ న్యాయమూర్తి కూడా జన్మతః పౌరసత్వ హక్కు రద్దు ఆర్డర్‌ను వ్యతిరేకించారు. ట్రంప్ చర్య రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారు. కాగా, బోస్టన్‌కు చెందిన అటార్నీ జనరల్స్ కూడా ఇదే అంశంపై కోర్టులో పిటిషన్ వేశారు. రాజ్యాంగం ద్వారా లభించిన హక్కును ఒక ఉత్తర్వుతో ట్రంప్ ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. ట్రంప్ చర్యను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోర్టును కోరారు.

ఒకవేళ ట్రంప్ నిర్ణయాన్ని అమలు చేస్తే, చిన్నపిల్లలు, దివ్యాంగులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారి బాధ్యత నేరుగా ప్రభుత్వాలపై పడతాయని హెచ్చరించారు. అమెరికా ఖజానాపై విపరీతమైన భారం తప్పదని స్పష్టం చేశారు. కాగా, ఈ పిటిషన్‌ను విచారించడానికి బోస్టన్ కోర్టు అంగీకరించింది. సీటిల్, మేరీలాండ్ మాదిరిగానే బోస్టన్ కోర్టు కూడా ట్రంప్ ఉత్తర్వు అమలును నిలిపివేస్తూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు.

## భారీ అవకతవకలు

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికలు 2024కు సంబంధించిన కేంద్రీకృత ఓటర్ల జాబితాను రాష్ట్ర ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, శివసేవ (యుబిటి), ఎన్‌సిపి (ఎస్‌పి)లు ఎన్నిసార్లు ఎలక్షన్ కమిషన్‌ను డిమాండ్ చేసినా ఫలితం శూన్యమని, ఇక న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు. శివసేన నేత సంజయ్ రౌత్, ఎన్‌సిపి సుప్రియ సూలేతో కలిసి శుక్రవారం రాహుల్‌గాంధీ మీడియా సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అనేకమంది ఓటర్లను తొలగించడం గానీ, బదిలీ చేయడం గానీ చేశారని ఆరోపించారు. అందులో అత్యధికంగా దళిత, గిరిజన, మైనారిటీకలు చెందిన వారే ఉన్నారన్నారు. కొత్తగా చేరిన ఓటర్ల కంటే తొలగించిన వారి సంఖ్యే ఎక్కువగా ఉందని మహారాష్ట్ర ప్రతిపక్ష పార్టీలు అనుమానిస్తున్నాయని చెప్పారు. 2019 విధానసభ ఎన్నికల తర్వాత నుంచి 2024 లోక్‌సభ ఎన్నికల వరకు 32 లక్షల మంది ఓటర్లు కొత్తగా నమోదుకాగా.. కేవలం ఐదు నెలల్లో 39 లక్షల మంది ఓటర్లు నమోదు కావడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సంఖ్య హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర మొత్తం జనాభాతో సమానంగా ఉందన్నారు. కేవలం ఐదు నెలల్లోనే మహారాష్ట్రలో ఎక్కువ ఓటర్లను ఇసి ఎందుకు చేర్చిందని ప్రశ్నించారు. మహారాష్ట్ర వయోజన జనాభా 9.54 కోట్లు ఉండగా, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు జనాభా మాత్రం 9.7 కోట్లుగా ఉందని రాహుల్ పేర్కొన్నారు. మహారాష్ట్ర మొత్తం వయోజన జనాభా కంటే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ ఓటర్లు ఎలా పెరిగారని రాహుల్ నిలదీశారు. దీనిపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. మహారాష్ట్రలోని కంతి నియోజకవర్గాన్ని రాహుల్‌గాంధీ ఉదహరిస్తూ బిజెపికి వచ్చిన మెజారిటీ కొత్తగా చేరిన ఓటర్లతో దాదాపు సమానంగా ఉందని చెప్పారు. లోక్‌సభ, విధానసభ ఎన్నికల మధ్య మూడు ప్రతిపక్ష పార్టీలకు ఓటు వేసిన ఓటర్ల సంఖ్య తగ్గలేదని రాహుల్ గుర్తుచేశారు. లోక్‌సభ, విధాన్‌సభ ఓటర్ల జాబితా ఇవ్వాలని తాము ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశామని, అయినా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఇప్పటికి కూడా ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పలేదన్నారు. తప్పు జరిగింది కాబట్టే స్పందించడం లేదని ఆరోపించారు. పారదర్శకతను నెలకొల్పడం ఇసి బాధ్యత అని, మహారాష్ట్ర ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన ప్రతిపక్ష పార్టీలు ఓటర్ల జాబితా కావాలని డిమాండ్ చేస్తున్నాయని, దానిని తప్పనిసరిగా ఇసి సమకూర్చాలన్నారు. అయితే ఎన్నికల కమిషన్ స్పందించకుంటే ఎలా వ్యవహరిస్తారని అడిగిన ప్రశ్నకు రాహుల్ సమాధానమిస్తూ తాము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని బుదులిచ్చారు. ఓటర్ల జాబితా గురించి మాట్లాడుతూ, ఈ డైనమిక్ జాబితా నిరంతరం మారుతూ ఉంటుందని, ఎవరైనా దానిని మార్చవచ్చని గాంధీ అన్నారు. జాబితాపై ఇసి నియంత్రణ కోల్పోయిందని, ఏం జరిగిందో చెప్పడం ఇసి బాధ్యత అని రాహుల్ వ్యాఖ్యానించారు.

సంజయ్ రౌత్ మాట్లాడుతూ ఇసి సజీవంగా ఉంటే, దాని మనస్సాక్షి చనిపోకపోతే రాహుల్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇసి ప్రభుత్వానికి బానిస అని అర్థం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం వేసిన ముసుగును ఇసి తొలగించాలని చెప్పారు.

**రాతపూర్వకంగా స్పందిస్తాం.. రాహుల్ ఆరోపణలపై ఇసి**

మహారాష్ట్రలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) వెంటనే స్పందించింది. రాజకీయ పార్టీలు లేవనెత్తిన ప్రశ్నలు, సూచనలను తాము గౌరవిస్తామని, దేశవ్యాప్తంగా ఒకేలా తామూ అనుసరించిన విధానపరమైన అంశాలతో త్వరలోనే లిఖితపూర్వకంగా సమాధానం ఇస్తామని తెలిపింది.

## ఇప్పట్లో లేనట్లే!

(మొదటి పేజీ తరువాయి)

నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం, పార్టీ పని తీరు, తాజా రాజకీయ పరిస్థితులపై ఖర్గేకు ముఖ్యమంత్రి వివరించినట్లు సమాచారం. సిఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తం కుమామార్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ చర్చల్లో పాల్గొన్నారు. ఎస్‌సి వర్గీకరణ, కుల గణన అంశాలపై కూడా వారు చర్చించినట్లు సమాచారం. తెలంగాణలో ఎస్‌సి వర్గీకరణను అమలు చేయాలని నిర్ణయించినట్లు ఖర్గేకు వారు తెలిపారు. సూర్యాపేటలో ఈనెలలో నిర్వహించనున్న కులగణన బహిరంగ సభకు రాహుల్ గాంధీని ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎస్‌సి వర్గీకరణకు సంబంధించి ఏప్రిల్‌లో గజ్వేల్‌లో సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు రావాలని ఖర్గేను ముఖ్యమంత్రి కోరారు.

**టిపిసిసి కార్యవర్గానికి గ్రీన్ సిగ్నల్?**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) కార్యవర్గం ప్రకటించేందుకు కాంగ్రెస్ అధిష్టానం ఆమోదముద్ర వేసింది. ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా టిపిసిసి కార్యవర్గం ప్రకటించనున్నారు. అందులో సామాజిక సమీకరణాలు బేరీజు వేసుకుని ఒక మాదిగ, ఒక ముస్లిం, ఒక లంబాడా, ఒక రెడ్డి వర్గాలతో నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులు ఉండనున్నట్లు తెలుస్తోంది. టిపిసిసి కార్యవర్గంలో 15 నుంచి 20 మంది వరకు ఉపాధ్యక్షులు ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం. పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులపై కూడా కెసి వేణుగోపాల్‌తో జరిగిన చర్చల్లో కసరత్తు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## రూ.500కోట్ల పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఇప్పటి వరకు హైదరాబాద్‌కు పరిమితమైన ఐటి రంగాన్ని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించాలని సంకల్పించామన్నారు. సహేతుకమైన కారణాలు చూపకపోతే గతంలో పరిశ్రమల నిమిత్తం కేటాయించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని, ఆ భూములను ఇతర అవసరాలకు వినియోగిస్తున్న వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంపెనీ ప్రతినిధులతో కలిసి హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా సెంటిలియాన్ నెట్ వర్క్స్, హెచ్‌సి రోబోటిక్స్ తొమ్మిది దేశాల్లో డ్రోన్ టెక్నాలజీ, డ్రోన్ సాఫ్ట్‌వేర్, టెలికమ్యూనికేషన్, రోబోటిక్స్, విమాన రక్షణకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అభివృద్ధితో పాటు, పలు రంగాల్లో సేవలను అందిస్తుందని వివరించారు. ఈ కంపెనీ ఇప్పటికే తమ కార్యకలాపాలను కరీంనగర్‌లో ప్రారంభించిందన్నారు. రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అండగా ఉంటామని, వీరికి రావాల్సిన రూ.4500ల కోట్ల ప్రోత్సాహకాల నిధులు 2016 నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, తాము అధికారంలోకి రాగానే బకాయిలు చెల్లించేందుకు చొరవ తీసుకున్నామన్నారు. పరిశ్రమల పునరుద్ధరణకు గతంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్‌పై ప్రత్యేకమైన అధ్యయనం చేస్తున్నామని, దీని వల్ల పరిశ్రమలకు మేలు జరుగుతుందని భావిస్తే అధిక నిధులు కేటాయించి, వాటిని యథావిధిగా కొనసాగిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వాతావరణం ఉన్నదని, గత ఏడాది దావోస్‌లో చేసుకున్న 18 ఒప్పందాల్లో 17 పట్టాలెక్కాయని, 10 ఒప్పందాల పురోగతి 50 శాతం కంటే ఎక్కువగా ఉన్నదని, కేవలం ఒప్పందాలు చేసుకుని రావడమే కాదని, వాటిని కార్యరూపంలోకి తెచ్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని చెప్పారు.

**పారిశ్రామిక వేత్తలను భయపెట్టేందుకు యత్నిస్తున్న ప్రతిపక్షాలు :** దావోస్‌లో తాము రూ.1.8లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు చేసుకున్నామని, నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించేందుకు తాము పాటుపడుతుంటే, ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాన్ని చేస్తూ, పారిశ్రామికవేత్తలను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నడూ భూసేకరణ పనులను అడ్డుకోలేదని, రాష్ట్రం అభివృద్ధి జరగాలని ఆలోచించామన్నారు. ప్రతిపక్షాలు ప్రజలను రెచ్చగొడుతూ అభివృద్ధికి అడ్డుపడే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సెంటిలియాన్ నెట్‌వర్క్స్ చైర్మన్, ఎండి వెంకట్, డైరెక్టర్‌రాధాకిషోర్, ఆ సంస్థ ఇండియా ఆపరేషన్స్ హెడ్ సుధాకర్ పాల్గొన్నారు.

## సరిగా ఎందుకు చేయలేదు?

(మొదటి పేజీ తరువాయి)

సర్వేలో పాల్గొన్నాయి. 3,56,323 గృహాలు వివిధ కారణాలతో సర్వేలో పాల్గొనలేదని ప్రణాళిక విభాగం వెల్లడించింది. ఇందులో పట్టణాలు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చాలా తక్కువగా సర్వేలో పాల్గొన్నారని తెలిపింది. కాగా గ్రేటర్ పరిధిలో చాలా తమ ప్రాంతంలో కులగణన సర్వే చేపట్టలేదనే ఆరోపణలు వచ్చాయి. చాలా ప్రాంతాల్లో సర్వే చేసే సిబ్బంది రాలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై పలువురు బిసి కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపైన స్పందించిన బిసి కమిషన్ వెంటనే జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు లేఖ రాసింది. గ్రేటర్‌పరిధిలో మొత్తం జనాభా ఎంత, సర్వేలో పాల్గొన్నవారు ఎంత?, మొత్తం ఎన్ని గృహాలు ఉన్నాయి?, సర్వేలో ఎన్ని గృహాలు పాల్గొన్నాయి...? అనే కోణంలో బిసి కమిషన్ ఆరా తీసింది. గ్రేటర్‌లో మొత్తం ఎన్ని బ్లాకులుగా విభజించారు.?, ఇందులో ఎంత మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించారనే పలు విషయాలను వెల్లడించాలని బిసి కమిషన్ జిహెచ్‌ఎంసిని ఆదేశించింది.

## చర్చలకు రండి

(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానం పలికింది. తమ డిమాండ్లను పరిష్కరించకుంటే సమ్మెబాట పడుతామని ఇటీవల యాజమాన్యానికి ఆర్‌టిసి కార్మికుల జెఎసి గత నెల 27న సమ్మె నోటీసు ఇచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా స్పందించిన కార్మిక శాఖ కార్మికులతో పాటు ఆర్‌టిసి యాజమాన్యాన్ని చర్చలకు పిలిచింది. ఇదిలా ఉండగా మొత్తం 21 డిమాండ్లను యాజమాన్యం ముందుంచిన ఆర్‌టిసి జెఎసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సమ్మె నోటీసుల్లో కోరింది. తమ డిమాండ్లకు పరిష్కారం చూపకపోతే ఈనెల 9వ తేదీన లేదా ఆ తరువాత మొదటి డ్యూటీ నుంచి సమ్మె మొదలవుతుందని నోటీసులలో జెఎసి పేర్కొన్నది. కానీ, కార్మికులు ఇచ్చిన సమ్మె నోటీసు కంటే తర్వాత రోజున చర్చలకు రావాలని కార్మిక శాఖ ఆహ్వానించడం ఇప్పుడు జెఎసి వర్గాల్లో చర్చనీయాశంగా మారింది.

## వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికత..

# వినూత్న ఆవిష్కరణలు అవసరం

మంత్రి తుమ్మల నాగేశ్వరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికత, వినూత్న ఆవిష్కరణలు ఎంతో అవసరమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఉద్యాన వన శాఖ సహకారంతో తెలంగాణ హర్టికల్చర్‌ఆఫీసర్స్ అసోసియేషన్, కిసాన్ టిమ్ సంయుక్త ఆధ్వర్యంలో హైటెక్స్‌లో ఏర్పాటు చేసినకిషన్ అగ్రి షోను మంత్రి తుమ్మల నాగేశ్వరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతాంగాన్ని, వ్యవసాయ పరిశ్రమలు, నూతన సాంకేతికతలను ఒకే వేదికపైకి తెచ్చేవిధంగా ఏర్పాటు చేసిన కిసాన్ అగ్రి షో కార్యక్రమ నిర్వహకులను అభినందించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్ర రైతుల అభివృద్ధి కోసం అనేక రకాల సబ్సిడీలను, మరెన్నో అవకాశాలను కల్పిస్తోందని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ యాంత్రీకరణ, సన్నధాన్యానికి బోనస్, రుణమాఫీ, రైతు భరోసా, నిరంతర శిక్షణ తదితర అనేక కార్యక్రమాలు నిర్వహిస్తు, దాదాపు రూ.40 వేల కోట్ల నిధులను రైతులకు నేరుగా చెల్లించామని వెల్లడించారు. వ్యవసాయ ఉత్పాదకతను, ఆదాయాన్ని పెంచేందుకు తమ ప్రభుత్వం కూడా వ్యవసాయరంగంలో నూతన సాంకేతికతను పరిచయం చేయాలనే ఆలోచనతో పనిచేస్తుందని చెప్పారు. దానికనుగుణంగానే సబ్సిడీలపై నూతన యంత్రాలను అందిస్తున్నామని మంత్రి తెలిపారు. అలాగే వ్యవసాయరంగంలో డ్రోన్లు, రోబోల ఉపయోగాలను పెంచడానికి కృషి చేస్తున్నామని, అందుకోసం ఇలాంటి కిసాన్ అగ్రి షో కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కిసాన్ అగ్రి షోలు కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా, ఉమ్మడి జిల్లా కేంద్రాలలో కూడా నిర్వహించే విధంగా చూడాలన్నారు. తద్వారా చాలా మంది రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని, ఇందుకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో 3 రోజుల పాటు నిర్వహించిన అగ్రి ఎగ్జిబిషన్ ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ విభాగాలను కలిపి రైతులకు సేవలు త్వరితగతిన అందేలా చర్యలను తీసుకోవాలని, వెదురు పథకం ద్వారా గిరిజన రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా పని చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.అగ్రిషోలో భాగంగా ఏర్పాటు చేసిన ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ ఇన్ హర్టికల్చర్ క్రాప్స్ ప్రొడక్షన్ అండ్ వాల్యూఅడిషన్ (ఉద్యాన పంటల ఉత్పత్తి, ఆదాయ పెంపుకు వినూత్న సాంకేతికతలు )అనే అంశంపై మంత్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఉద్యాన శాఖ అడిషనల్ డైరెక్టర్ సరోజినీ, జాయింట్ డైరెక్టర్ బాబు, తెలంగాణ ఉద్యాన అధికారుల సంఘం అధ్యక్షులు చక్రపాణి, ఉపాధ్యక్షులు సాయిబాబా, కిసాన్ అగ్రి షో నిర్వాహకులు, అధికారులు, వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

# మైనింగ్ తవ్వకాలు నిలిపివేయాలి

సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** మైలారం గ్రామంలో మైనింగ్ తవ్వకాలను నిలిపివేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం బల్మూర్ మండలం మైలారం గ్రామంలో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మైలారం గ్రామాన్ని సందర్శించి మైనింగ్ జరుగుతున్న గుట్టను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైలారం గ్రామంలో మైనింగ్ తవ్వకాలను గ్రామసభ నిర్వహించకుండా తప్పుడు తీర్మానంతో మైనింగ్ తవ్వకాలు చేపట్టడం సరైన విధానం కాదని ఉమ్మడి గ్రామపంచాయతీ ఉన్నప్పుడు తీర్మానం జరిగిందని అనంతరం గ్రామంలో గ్రామసభ నిర్వహిస్తే మైనింగ్ జరిగేది మైలారం గ్రామంలో కదా నష్టపోయేది, అందుకు తప్పుడు విధానాలతో మైనింగ్‌పనులు చేపట్టడం సరైన విధానం కాదన్నారు. మైలారం గ్రామంలో మేకలు, గొర్రెలు, బర్రెలు, ఆవులు మొత్తం మూగజీవాలు దాదాపుగా 2000–2500 ఉంటాయి. నాలుగు గ్రామాల పశువులు, మేకలు, గేదెలు, పశుగ్రాసం మేపడానికి అనువుగా ఉన్నది. ప్రజలు జీవించడానికి కట్టెలు, పండ్లు, ఫలహారాలు ఉపయోగించుకోవడానికి అన్ని వసతులు ఉన్నాయి. కాని మైనింగ్ కొరకు జరిగే బ్లాస్టింగ్‌తో గ్రామంలోని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మైలారంగుట్టపైకి పశువులను మేపడానికి వెళితే రానివ్వడంలేదు. ఇప్పటికైనా మైలారం గ్రామం దగ్గర మైనింగ్ తవ్వకాలను వెంటనే ఆపాలని మైనింగ్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని అధికారులను కోరారు. ఈవిషయంపై ప్రజాప్రతినిధులను ఉన్నతాధికారులను కలిసి గ్రామంలో జరుగుతున్న నష్టాన్ని వారికి తెలియజేసి తవ్వకాలను నిలుపుదల చేయడానికి కృషి చేస్తామన్నారు. మైనింగ్ బ్లాస్టింగ్ వలన ఇండ్లకు పగుళ్లు వచ్చి కూలిపోయే ప్రమాదం ఉంది ఇండ్ల పైకిరాళ్లు పడుతుండటం వలన ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు స్పందించి మైలారం గ్రామాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. మైనింగ్ నిలిపివేయించడానికి సిపిఐపార్టీ ప్రజలపక్షాన ఉండి పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు వార్లవెంకటయ్య, కేశవులుగౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు నర్సింహ, సిపిఐ జిల్లా నాయకులు తిరుమలగోపాల్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసులు, ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, జిల్లా సమితి సభ్యులు పులిజాల పరుషరాములు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, సిపిఐ నాయకులు పరంధాములు, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కేశముల శివకృష్ణ, శివకృష్ణ, మైలారం గ్రామ ప్రజలు నరేందర్‌గౌడ్, దేవస్వామి, శివ, అనిల్, పెద్దలింగయ్యగౌడ్, బక్కమ్మ, చంద్రమౌళి, హరీష్, పర్వతాలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.



## హన్మకొండ డిటిసి ఇళ్లలో ఎసిబి సోదాలు

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** హనుమకొండ డిటిసి పుప్పాల శ్రీనివాస్ స్వస్థలం జగిత్యాలలో శుక్రవారం ఎసిబి అధికారుల సోదాలు నిర్వహించారు. ఆదాయాన్ని మించి ఆస్తులు ఉన్నాయని ఆరోపణల నేపథ్యంలో సోదాలు నిర్వహించారు. అయితే లెక్కకు మించిన ఆస్తులున్నట్లు ఎసిబి సోదాల్లో తేలింది. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో సుమారు 50 కోట్ల రూపాయల మేరకు పైగా ఆస్తులను శ్రీనివాస్ కూడబెట్టినట్లు ఎసిబి విచారణలో వెల్లడయినట్లు తెలిసింది. పక్కా సమాచారంతో హైదరాబాద్, కరీంనగర్, జగిత్యాల తదితర ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లల్లో కూడా ఏక కాలంలో నిర్వహించిన సోదాల సందర్భంగా నగదుతో పాటు బంగారం, వెండి ఆభరణాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అందులో భాగంగానే కరీంనగర్ ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి తన సిబ్బందితో కలిసి జగిత్యాలలోని శ్రీనివాస్ ఇంట్లో సోదాలు నిర్వహించారని సమాచారం.

## త్వరలోనే యుజిసి నిబంధనలు వ్యతిరేకిస్తూ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉన్నత విద్య విషయంలో రాష్ట్ర అధికారాలను నియంత్రించే 'యుజిసి నిబంధనల ముసాయిదాను 2025' వ్యతిరేకిస్తూ ఆరు రాష్ట్రాల సంయుక్త సమావేశాన్ని త్వరలోనే కేరళలో మరోసారి సమావేశం నిర్వహిస్తామని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఇటీవల బెంగళూరులో జరిగిన ఆరు రాష్ట్రాల విద్యామంత్రుల సమావేశంలో యుజిసి ముసాయిదాను ఉపసంహరించుకోవాలని సంయుక్తంగా తీర్మానం చేసి, కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు పంపించామని వివరించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఢిల్లీలో డిఎంకె నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి, ముసాయిదాలో మార్పులు చేయాలని, లేదా ఉపసంహరించుకునేంత వరకూ తాము ఉద్యమిస్తూనే ఉంటామని తెలిపారు. ఉన్నత విద్యపై రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తోందని, అయినప్పటికీ కేంద్రం తమ అధికారాలను లాక్కోవాలని చూడటం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. జమ్మూ కశ్మీర్ కూడా తమతో కలిసి రావడానికి సంసిద్ధత వ్యక్తం చేశారన్నారు. డిగ్రీ ప్రవేశాలకు జాతీయ స్థాయిలో ఎంట్రన్స్ నిర్వహించాలనుకోవడం విద్యార్థులను కళాశాల విద్యకు దూరం చేసే ప్రయత్నమన్నారు. డిగ్రీ చదివే వయసున్న యువతలో జాతీయ సరాసరి ప్రకారం నూటికి 28 మంది మాత్రమే కళాశాలల్లో చేరుతున్నారని, రాష్ట్రంలో ఇది 40 శాతం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవేశ పరీక్షలాంటి నిబంధనతో ఉత్తీర్ణులు కాలేమనే ఆందోళనతో యువతో మరింత ఎక్కువగా ఉంటుందని, తద్వారా వారు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వైస్‌ఛాన్స్‌లర్ల నియామకంలో రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండా అధికారాలను పూర్తిగా తమ చేతిలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. ఈ అంశంపైన తెలంగాణ రాష్ట్ర తరపున తమ నిరసనను తెలియజేస్తూ, ముసాయిదాను ఉపసంహరించుకోవాలని సిఎం ఇప్పటికే కేంద్ర విద్యామంత్రికి లేఖ రాసిన విషయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

## భారత్‌ను అవమానించిన ట్రంప్ ప్రభుత్వం

సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ట్రంప్ ప్రభుత్వం భారత్‌ను, భారతీయులను బహిష్కరించి తీవ్రంగా అవమానించిందని, ఇది అమెరికా అహంకారానికి నిదర్శనమని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా విమర్శించారు. ఆ దేశ అభివృద్ధిలో భాగస్వాములైన భారతీయులకు సంకెళ్లు, గొలుసులు వేసి తరలించిన తీరు భారత్ దేశాన్ని అగౌరపరిచిందని, ఇది ఫాసిస్ట్ చర్యల్లో భాగమేనని, డోనాల్డ్ ట్రంప్ పరిపాలనలో భారతీయుల పట్ల అమానుషంగా ప్రవర్తించిన నేపథ్యంలో మోడీ ప్రభుత్వ వైఖరి ప్రజలకు తలవంపులు తీసుకువచ్చేలా ఉందని పేర్కొన్నారు. ఈ విషయంపై పార్లమెంట్‌లో మోదీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ట్రంప్ అమెరికా వైపు నిలబడుతుందా లేదా మన దేశ ప్రజలకు అండగా నిలుస్తుం దా అనేది స్పష్టం చేయాలని ఆయన కోరారు.

# గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్

16 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత



**ప్రజాపక్షం/గూడూరు :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కలకలం రేపింది. శుక్రవారం రాత్రి 7 గంటలకు సాంబార్‌తో భోజనం చేసిన విద్యార్థులు ఒక్కసారిగా వాంతులు విరోచనాలు చేసుకోవడంతో గురుకుల యాజమాన్యం భయాందోళనకు గురై హుటాహుటిన గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ముగురు విద్యార్థులు 9 వ తరగతి చదువుతున్న గుగులోత్ సాయి ప్రసాద్, 7వ తరగతికి చెందిన లకావత రాహుల్, 6వ తరగతికి చెందిన యాకుబ్, రోజు వారి మెనూ ప్రకారం శుక్రవారం రాత్రి 7 గంటలకు సాంబార్‌తో భోజనం చేసిన తర్వాత ఒక్కసారిగా విద్యార్థులకు మోషన్స్‌తో పాటు వాంతులు కాగా వారిలో కొంతమందికి గురుకులంలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలు టాబ్లెట్ లు ఇవ్వడంతో తగ్గగా అందులో ముగ్గురికి తీవ్రంగా వాంతులు, విరోచనాలతో అవస్థ పడుతుండగా వారిని రాత్రి 9 గంటల సమయంలో గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

**పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి : ఎమ్మెల్యే**

పిల్లల ఆరోగ్యం పట్ల గురుకుల పాఠశాల యాజమాన్యం జాగ్రత్తగా వహించాలని విద్యార్థులకు పెట్టే ఆహారం నాణ్యతతో కూడినదై ఏ పూట భోజనం ఆ పూటకే పెట్టేలా చర్యలు తీసుకోవాలని దామరవంచ గురుకుల పాఠశాల యాజమాన్యాన్ని మానుకోట ఎమ్మెల్యే మురళినాయక్ హెచ్చరించారు. ఫుడ్ పాయిజన్ కారణంతో ముగ్గురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురికాగా వారిని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తుండగా ఎమ్మెల్యే వారిని పరామర్శించి మంచి చెడులు తెలుసుకున్నారు.

గురుకుల పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ప్రభుత్వానికి సిగ్గుచేటని ఇప్పటివరకు ఫుడ్ పాయిజన్ కారణంగా సుమారు 40 నుండి 50 మంది విద్యార్థులు చనిపోతున్నా ప్రభుత్వానికి ఏమాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మానుకోట మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం ఫుడ్ పాయిజన్ విషయం తెలుసుకొని గూడూరు మండల కేంద్రంలోని ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆయన పరామర్శించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వం విద్యార్థులను పట్టించుకోకుండా గురుకుల పాఠశాలలో పలుమార్లు ఫుడ్ పాయిజన్ జరిగే విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోవడంలేదని ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే అని మానుకోట మాజీ ఎంపి మాలోత్ కవిత ఆరోపించారు.

విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురికావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ఆసుపత్రిలో చేరిన గురుకుల విద్యార్థులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని, ఫుడ్ పాయిజన్ కాకుండా ఉండేలా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు కల్తీ ఆహారాన్ని పెడితే అరెస్టు చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.



## కేంద్ర వైఖరిపై గాంధీభవన్‌లో నిరసన

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అమెరికా నుంచి భారత పౌరులను నిర్దాక్షిణ్యంగా బేడీలు వేసి బలవంతంగా తరలిస్తుండడంలో విదేశాంగ మంత్రిత్వశాఖ వైఫల్యం కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ప్రాంగణంలో తెలిపారు. చేతులకు బేడీలు వేసుకుని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. 'అమెరికాకో గులాంగిరి బంద్ ఖరో' అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ ఆలీ, మాజీ ఎంపి వి.హనుమంతరావు, టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు టి.కుమార్‌రావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ ఫిరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. భారత పౌరులకు బేడీలు వేసి అమెరికా నుంచి పంపిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వానికి చలనం లేకుండా వ్యవహరిస్తుందని, ఇందుకు ప్రధాని మోదీ సిగ్గు పడాలని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ అమెరికా నుంచి 104 భారత పౌరులను టెర్రరిస్టుల మాదిరిగా, నిర్దాక్షిణ్యంగా బేడీలు వేసి బలవంతంగా తరలించిందని, ఈ విషయంలో భారత పౌరుల హక్కులను కాపాడడంలో భారత విదేశాంగ మంత్రి పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశాంగ మంత్రి జై శంకర్‌కు ధైర్యం లేదని, అమెరికా అధ్యక్షులు ట్రంప్‌కు ప్రధాని మోదీ భయపడుతున్నారని విమర్శించారు.

'విశ్వ గురువులు భయపడుతారా?. రష్యా, ఉక్రెయిన్ దాడులను ఆపే వాళ్ళు అమెరికాలో ఉన్న మనవాళ్ళని తీసుకురాలేరా? ట్రంప్ అమెరికా ప్రెసిడెంట్ అయ్యాక ఇండియాకు ఇబ్బంది ఉండదని ప్రచారం చేసారు. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి' అన్నారు.

# ప్రజాసామ్యబద్ధంగా సర్వే

బీసీ రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** దేశంలో ఎక్కడ లేని విధంగా మొదటిసారిగా తెలంగాణలో చేపట్టిన కుల గణన సర్వే ప్రజాసామ్యబద్ధంగా జరిగిందని దీన్ని ఎవ్వరు తప్పు పట్టనవసరం లేని కులగణనకు సహకరించని నాయకులకు ప్రశ్నించే హక్కు లేదని తెలంగాణ బీసీ రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రమైన మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా మిత్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఒక రోల్ మాడల్‌గా ఉండే విధంగా కుల గణన సర్వే జరిగిందని అన్నారు. 1931 ఆంగ్లేయుల కాలంలో జరిగిన కుల గణన నేడు భారత దేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో మా నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కుల గణన సర్వే చేసినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభ కమిటీ చైర్మెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు సహచర మంత్రి మండలి సభ్యులు పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ను పార్టీ పక్షాన తీసుకుని 2024 ఫిబ్రవరి 16న బీసీ బిడ్డగా బలహీన వర్గాల నేతగా బిల్లును ప్రవేశపెట్టామని అన్నారు. అనంతరం ఏడాది కాలంలోనే పూర్తి వివరాలు తీసుకుందని పేర్కొన్నారు. ఈ సర్వేకు లక్ష మంది ఉద్యోగులతో కోటి 12 లక్షల ఇండ్లను సర్వే చేసినట్లు తెలిపారు. దీనిపై శాసనసభలో చర్చ పెడితే కుల సర్వేకు వారు మాట్లాడితే దానికి అర్థం ఉంటుందని అన్నారు. ఒక బీసీ బిడ్డగా నేను కూడ తెలంగాణలో ఒక వాటాదారున్ని అన్న పాపానికి ఈటల రాజేందర్‌ను పార్టీ నుండి బైటికి పంపలేదా అని ప్రశ్నించారు. తెలంగాణలో కనీసం శాసన సభలో బిజెపి నాయకుడికి బీసి ప్రతిపక్ష నేతగా కూడ ఇవ్వని పార్టీ కూడా నేడు విమర్శించే స్థాయికి చేరిందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం చైర్మన్ బి.శివయ, ఫ్లోర్ లిడర్ చిత్తారి పద్మ రవిందర్, మార్కెట్ చైర్మెన్, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, బంక చందుతో పాటు నాయకులు పాల్గొన్నారు.

## ఫామ్‌హౌస్‌లో ఉంటూ సర్వేలో పాల్గొనని వారికి మాట్లాడే హక్కు లేదు

రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఫామ్ హౌస్‌లో ఉంటూ కులగణనలో పాల్గొనకుండా ఉన్నవాళ్లకు మాట్లాడే హక్కు లేదని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. భువనగిరిలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. తీన్మార్ మల్లన్న విషయంలో నాకు మాట్లాడేంత టైమ్ లేదు మాట్లాడం వేస్ట్ అన్నారు. టీపీసీసీ, ఏఐసీసీ, క్రమశిక్షణ చైర్మన్ చిన్నారెడ్డి నోటీసులు ఇచ్చినట్లు పేపర్లో చూశానన్నారు. మేము చేసిన సర్వేలో 56.6 శాతం బిసిలు ఉన్నట్లుగా తేల్చినట్లు చెప్పారు. పన్నెండు గంటల దొంగ కుటుంబం సర్వేలో 51 శాతం తేల్చిందు దాని గురించి మాట్లాడడం లేదన్నారు. రాజకీయంగా నేను ఉన్నాను అనే ఉనికి కోసం మాట్లాడుతున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే ఖచ్చితంగా 42 శాతం పార్టీ పరంగా రిజర్వేషన్లు కలిస్తాం అన్నారు. వర్గీకరణ విషయంలో కూడా వెనకడుగు వేసే ప్రసక్తి లేదన్నారు. 90 శాతం ఉన్న జనాభా కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. దొరలు భూస్వాములు, ఫామ్ హౌస్‌లో ఉండేందుకు కాదని అన్నారు. కవిత మాత్రమే ప్రేమతో చేసిందా లేక రాజకీయంగా చేసిందా అన్నారు. మండలిలో అందరూ బైకాట్ కవిత మండలి ఉండడంతో అందరూ మళ్ళీ వచ్చి కూర్చున్నారన్నారు. దీన్నిబట్టి అర్థం అవుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి.అవేస్ చిస్తీ, మాజీ మున్సిపల్ చైర్మన్లు బర్రె జహంగీర్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ ఎస్సి విభాగం అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద్, డిసిసి ప్రధాన కార్యదర్శి ఎండి. మజర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్, ఇటుకల దేవేందర్, పిట్టల బాలరాజు, శివాలయం చైర్మన్ కొల్లూరి రాజు, మాజీ కౌన్సిలర్లు పడిగల ప్రదీప్, ఈరపాక నరసింహ, ఎండి.సలావుద్దీన్, కాల్య నాగరాజు, ఏడు మేకల మహేష్, పల్లెర్ల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ బౌద్ధ భిక్షువులతో త్రిపిటక పఠనోత్సవం

ఇది దక్షిణాదిలోనే తొలిసారి... పాల్గొన్న 115 మంది అంతర్జాతీయ బౌద్ధ భిక్షువులు



**ప్రజాపక్షం/నందికొండ :** నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో సికింద్రాబాద్‌కు చెందిన మహా బోధి బుద్ధ విహార, లైఫ్ ఆఫ్ బుద్ధ దమ్మ ఫౌండేషన్ ఇంటర్నేషనల్, తెలంగాణ పర్యాటక శాఖ సహకారంతో శుక్రవారం దక్షిణ భారతదేశపు తొలి అంతర్జాతీయ త్రిపిటక పఠనోత్సవం ప్రారంభమైందని మహా బోధి బుద్ధ విహార సీనియర్ బౌద్ధాచార్యుడు ఆనంద బంతే తెలిపారు. బుద్ధవనం ప్రవేశద్వారం వద్దకు చేరుకున్న వివిధ దేశాల బౌద్ధ భిక్షువులకు తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ సంప్రదాయ ఒగ్గు కళాకారుల నృత్యాలతో, డప్పుల వాయిద్యాలతో బుద్ధుని ప్రతిమలతో అలంకరించిన పల్లకితో అశోక ధర్మచక్రం నుండి సాగిన ధర్మ యాత్రలో భారత దేశం నుండి 27 మంది, దక్షిణాసియా దేశాలైన శ్రీలంక ,కంబోడియా ,వియత్నాం, థాయిలాండ్‌ల నుండి 88 మంది బౌద్ధ భిక్షువులు పాల్గొని స్థూపవనములో నిర్మించిన బౌద్ధ స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. ఇటువంటి కార్యక్రమాలను గత 20 ఏళ్లుగా ప్రోత్సహిస్తున్న అంతర్జాతీయ త్రిపిటకాపఠణ మండలి వ్యవస్థాపకురాలు వాంగ్ మేడిక్సీ ఈ కార్యక్రమానికి హాజరైన బౌద్ధ భిక్షువులకు బుద్ధ వందనాలతో శుభాకాంక్షలు తెలుపగా అనంతరం బుద్ధుని ధర్మ చక్ర పరివర్తన సూత్రాన్ని, బుద్ధ వచనాలను వివిధ దేశాల బౌద్ధ భిక్షువులు గానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌ను మహాబోధి బుద్ధ విహార అధ్యక్షులు కశ్యప బంతే బుద్ధ ప్రతిమను బహూకరించి సత్కరించి మాట్లాడుతూ బుద్ధ వనంలో ఇటువంటి గొప్ప కార్యక్రమం జరగడం సంతోషకరమైన విషయమని ఇటువంటి కార్యక్రమాలకు తెలంగాణ పర్యాటక శాఖ తగు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహాబోధి బుద్ధ విహార భిక్షువులు బుద్ధ పాల, సంఘ పాల, థాయిలాండ్‌కు చెందిన ప్రసుబన్ ఖసియాంగు, ప్రపలాద అమూల్ పోల్మన్, కంబోడియాకు చెందిన ధర్మసిరి, వియత్నాంకు చెందిన హూ యన్ మిన్‌దాన్, లావోసుకు చెందిన ఎనాయ్ భౌలాఫిం భిక్షువులు, బ్రెజిల్‌కు చెందిన ఉపాసక నెల్సన్ చమ్మ ఫిలో, బుద్ధ వనం అధికారులు సుధన్ రెడ్డి, ఈమని శివనాగిరెడ్డి, శాసన, రవిచంద్ర, శ్యాంసుందర్‌రావు వీరితోపాటు బౌద్ధాభిమానులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్గీకరణలో 11శాతం వాటా మాదిగల హక్కు

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ




**ప్రజాపక్షం/ ఖైరతాబాద్ :** జనాభా ప్రాతిపదికన, వెనుకబాటు ఆధారంగా చూసినట్టయితే ఎస్‌సి వర్గీకరణలో 11శాతం వాటా మాదిగల న్యాయమైన హక్కు అని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. మాదిగలకు 11శాతం రాకపోతే ఏ లెక్క ప్రకారం 9శాతం ఇచ్చారో చెప్పాల్సిన అవసరం ఉన్నదన్నారు. దళితుల జనాభా నాల్గొవ అతిపెద్ద బుడగ జంగాలకు అన్యాయం జరిగిందన్నారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ దళిత జనాభాలో మొదటి వరుసలో మాదిగలున్నారని, ఆ తర్వాత మాల, నేతకానిలున్నారని తెలిపారు. వివిధ గ్రూప్‌లలో కులాలను చేర్చడంలో తలెత్తిన కొన్ని లోపాలను సవరిస్తే ఎస్‌సి వర్గీకరణ ప్రక్రియ సంపూర్ణంగా పూర్తవుతుందని తెలిపారు. దళితుల్లో మూడవ అతిపెద్ద కులం నేతకానిలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పనకు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. అలాగే పంబాల మన్నే కులాలను గ్రూప్3లోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. వర్గీకరణను వ్యతిరేకించే ఏరాజకీయ పార్టీకి కూడా తెలంగాణలో మనుగడ ఉండదని తెలిపారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేశ్ మాదిగ, లక్షల డప్పులు వేల గొంతుల స్టేట్ కో–ఆర్డినేటర్లు దరువు ఎల్లన్న, గిద్దె రాంనరసయ్య, నల్లిగంటి శరత్ చమర్, మచ్చ దేవేందర్ డప్పు స్వామి, అందే భాస్కర్, మల్లికా, అమూల్య అమంచ భరత్, డప్పోల రమేష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో 4,901 దరఖాస్తులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 4,901 దరఖాస్తులు అందాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్.జి. చిన్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 157, విద్యుత్ శాఖ 105, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 30, ఇందిరమ్మ ఇండ్ల కోసం 2,865 దరఖాస్తులు రాగా, కొత్త రేషన్ కార్డులకు సంబంధించి పౌర సరఫరా శాఖకు 1640, ఇతర శాఖలకు సంబంధించి 109 మొత్తం 4,901 దరఖాస్తులు అందినట్లు ఆయన వెల్లడించారు. ప్రజావాణి సందర్భంగా ప్రజల నుంచి స్వయంగా దరఖాస్తులను స్వీకరించిన చిన్నారెడ్డి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: సర్కిల్-2, ఉప్పల్**

NIT No. 27/EEC-2/UPL/GHMC/2024-25 టెండర్ నోటీస్ తేది: 06.02.2025

**పని పేరు:** 1 పని కొరకు ''షబ్-ఇ-బరాత్-2025'' దృష్ట్యా హబ్సిగూడ, వార్డు నెం.8లో పి&టి కాలనీలో ముస్లిం కబరిస్థాన్ ప్రహరీ గోడకు రంగులు వేయడం మరియు చెత్తాచెదారం తొలగింపునకు కార్మికులకు నిమఘ్నం చేయడం. **అంచనా వ్యయం:** రూ.1.65 లక్షలు. **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 10.02.2025న మ.12.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.హరిలాల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్ నెం.2, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-2, ఉప్పల్, జిహెచ్‌ఎంసి

DIPR R.O. No. : 10038-PP/CL/ADVT/1/2024-25, Date: 07-02-2025

ప్రజాపక్షం
శనివారం, ఫిబ్రవరి 08

# అవమానాన్ని దిగమింగటమేనా?

ట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదారులను గుర్తించి, స్వదేశానికి తిప్పి పంపటంలో వారిపట్ల ఎంతో అమానుషంగా వ్యవహరిస్తున్నా కనీసం నిరసన తెలియజేయలేని పరిస్థితిలో ఉంది భారత ప్రభుత్వం. గురువారం అమెరికా అసాధారణంగా తమ మిలటరీ విమానం ద్వారా అమృత్‌సర్‌లో దించిన 104మంది భారతీయులకు హింసాత్మక నేరాలకు పాల్పడిన నేరస్థుల్లాగా చేతులకు బేడీలు, కాళ్లకు సంకెళ్లు వేసిన దృశ్యాలు సగటు భారతీయుల హృదయాలను కలచివేశాయి. వారు ఏజెంట్ల చేతిలో మోసపోయిన అభాగ్యులు, డాలర్ల ఆర్జన ఆకర్షణతో కొంపగోడు అమ్ముకుని, పదులలక్షలు అప్పులు చేసి ఇప్పుడు రెంటికీ చెడ్డ రేవడిగా రిక్తహస్తాలతో తిరిగి వచ్చిన బికారులు. అక్రమ వసలదారులను తిప్పిపంపటాన్ని ఏ దేశమూ నిరాకరించజాలదు. అయితే వారిపట్ల కనీస మర్యాదను ఆశిస్తాయి. భారతీయులను బేడీలు, సంకెళ్లతో వెనక్కు పంపుతున్నారన్న వార్తలపట్ల ప్రతిపక్షాలు పార్లమెంటులో, వెలుపల తీవ్ర నిరసన తెలియజేశాయి. విదేశీ వ్యవహారాల మంత్రి సుబ్రమణియన్ జైశంకర్ – అది అమెరికా స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ అని, మనం చేయగలిగిందేమీ లేదని చేతులెత్తేసిన తీరు బాధాకరం. మున్ముందు తిప్పి పంపేవారిపట్ల మర్యాద చూపమని ట్రంప్ ప్రభుత్వాన్ని కోరతామన్నారు. అమెరికా ఎస్ఒపి ముందే తెలుసుకదా, 'అత్యంత మిత్రదేశం' 'ప్రియమిత్రుడైన అధ్యక్షుడు' అని గొప్పలకుపోయే ప్రధాని నరేంద్రమోదీ ఈ విషయమై ముందే ఎందుకు అమెరికన్‌లతో మాట్లాడలేదు? ట్రంప్ తమ ప్రమాణ స్వీకారం రోజే అక్రమ వలసదారులపై విధాన ప్రకటన చేశారు కదా? కనీసం తన అమెరికా పర్యటన వరకైనా భారత అక్రమ వలసదారులను వెనక్కు పంపటాన్ని నిలుపు చేయమని ఎందుకు కోరలేకపోయారు? మరో 487మందిని వెనక్కి పంపేందుకు అమెరికా సిద్ధమైంది.

> **భారతీయులను బేడీలు, సంకెళ్లతో వెనక్కు పంపుతున్నారన్న వార్తలపట్ల ప్రతిపక్షాలు పార్లమెంటులో, వెలుపల తీవ్ర నిరసన తెలియజేశాయి. విదేశీ వ్యవహారాల మంత్రి సుబ్రమణియన్ జైశంకర్ – అది అమెరికా స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ అని, మనం చేయ గలిగిందేమీ లేదని చేతులెత్తేసిన తీరు బాధాకరం.**

అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) వెబ్‌సైట్ తాజా గణాంకాల ప్రకారం, క్రిమినల్ ఆరోపణలు, ఇమ్మిగ్రేషన్ చట్టం ఉల్లంఘనలకింద ప్రస్తుతం 24,974 మంది భారతీయులు ఐసిఇ కస్టడీలో – భారత్‌కు తిరిగి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. అమెరికాలో మొత్తం 7,25,000 మంది అన్‌డాక్యుమెంటెడ్ (అధికార అనుమతి పత్రాలు లేనివారు) భారతీయులున్నట్లు అంచనా. మెక్సికో, ఎల్‌సాల్వడార్ నుండి వచ్చిన అక్రమ వలసదారుల సంఖ్య తదుపరి స్థానం భారతీయులదేనట! అమెరికా నుండి భారత అక్రమ వలసదారులను వెనక్కిపంపటం ఇదే మొదటిసారి కాదు. 2009 నుండి ఫిబ్రవరి 2025 వరకు మొత్తం 15,688 మంది అక్రమ వలసదారులు భారత్ తిరిగి వచ్చినట్లు మంత్రి జై శంకర్ గురువారం రాజ్యసభలో చెప్పారు. చట్టవిరుద్ధ మైగ్రేషన్ పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకోవటం, చట్టబద్ధమైన ప్రయాణీకులు సులభంగా వీసాలు పొందేటట్లు చేయటంపై దృష్టిపెడుతున్నామని, కొత్త చట్టం తెచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.

అక్రమ వలసదారులను వెనక్కు పంపటానికి అమెరికా తొలిసారి మిలటరీ రవాణా విమానాలు ఉపయోగిస్తోంది. దీంతో అమెరికా పట్ల గౌరవం పెరిగిందంటున్నారు ట్రంప్. భారత్‌తో పాటు గౌతమాల, పెరూ, హోండూరస్, ఈక్వెడార్, కొలంబియా దేశాలకు అమెరికా మిలటరీ విమానాలు ఉపయోగించారు.

ఇరాన్‌పై 'గరిష్ట ఒత్తిడి' తెచ్చేందుకు ట్రంప్ తాజాగా విధించిన ఆంక్షల కు భారత్ కూడా గురైంది. వాటిలో భారత్ అభివృద్ధి చేసిన చాబహార్ రేవు ప్రాజెక్టు కూడా ఉంది. 2016లో ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్‌తో త్రైపాక్షిక ఒప్పందం ద్వారా భారత్ చాబహార్ రేవులో షాహిద్ బెహెస్థి టెర్మినల్ అభివృద్ధి చేసింది. ట్రంప్ తమ మొదటి అధ్యక్ష పదవీకాలంలో ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిరోధిస్తూ కుదిరిన అంతర్జాతీయ ఒప్పందం నుండి అమెరికాను ఉపసంహరించుకున్నాడు. ఇరాన్ నుంచి ఆయిలు ఎగుమతులను నిలుపు చేయాలన్న ట్రంప్ డిమాండ్‌ను నాడు భారత్ అంగీకరించింది. మోదీ అమెరికా పర్యటన వల్ల ఏదో ఒనగూరుతుందనే ఆశలు నిష్ప్రయోజనం.

# న్యాయపోరాట ధీర జాకియా జాఫ్రీ



మిహిర్ దేశాయ్

అహ్మదాబాద్ నగరంలోని తన సోదరి నివాసంలో ఫిబ్రవరి 1వ తేదీన జాకియా జాఫ్రీ (86) కన్నుమూశారు. ఆ నగరం ఆమె జీవితాన్ని సమూలంగా మార్చేసింది. ఆమెను నేను జాకియా అప్పా అని పిలుస్తాను. మెజిస్ట్రేట్ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు నేను ఆమె న్యాయవాదిని.

ఒకటి తరువాత మరొకటి వరుసగా న్యాయపోరాటాలు చేసిన ఆమెను నేను అనేక సందర్భాలలో కలిసాను. వాటిలో చాలా కేసులను మేము ఓడిపోయాము. ఓడిపోయిన ప్రతీసారి నేను ఆమె కళ్ళలో ఏదో కోల్పోయాననే బేలతనాన్ని లేదా చిన్న కన్నీటి చారికను చూడలేదు. కానీ, న్యాయంకోసం మొండి పట్టుదల, దృఢసంకల్పం కనిపించేది. ఒక కోర్టు నుంచి మరో కోర్టుకు ఉరుకులు పరుగులు. చివరికి సుప్రీంకోర్టులో ఆగిపోయాయి. 2022న సుప్రీం కోర్టు అన్నిటికీ ముగింపు పలుకుతూ గుజరాత్ అల్లర్లలో భారీ కుట్రపై పక్షపాతంలో కూడిన దర్యాప్తు సాగుతుందని ఆమె చేసిన ఫిర్యాదును జస్టిస్ ఎ.ఎం.ఖన్విల్కర్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం కొట్టేసింది. అది జరిగిన మూడేళ్ళ తరువాత కూడా ఆమె పోరాట స్ఫూర్తి కోల్పోలేదని నేను విశ్వాసంతో చెప్పగలను.

2002 ఫిబ్రవరిలో గుజరాత్ అల్లర్లు ప్రారంభమైన సమయంలో 63 ఏళ్ళ సీనియర్ సిటిజన్ జాకియా ఒక గృహిణి. అహ్మదాబాద్‌లోని ముస్లింలు ఉండే గుల్బర్గ్ సొసైటీలో ఆమె భర్త, గుజరాత్ శాసనసభ మాజీ సభ్యులు ఎహ్సాన్ జాఫ్రీతో కలిసి నివాసం ఉండేది. యాదృచ్ఛికంగా ఆ రాష్ట్రంలో ఆయనే చివరి ముస్లిం ఎంఎల్‌ఏ కావడం గమనార్హం.

2002 ఫిబ్రవరి 28న సబర్మతి ఎక్స్‌ప్రెస్‌లో దురదృష్టవశాత్తు హిందువులు అగ్నికి ఆహుతైన తరువాత ఆ సొసైటీపై భారీ సంఖ్యలో అల్లరిమూక దాడి చేసింది. పోలీసులు అక్కడే ఉన్నప్పటికీ, తమ పొరుగున ఉండే వారిని కాపాడమని పౌర సమాజ కార్యకర్తలు రాష్ట్ర అత్యున్నత వర్గాలకు పదే పదే విజ్ఞప్తి చేసినప్పటికీ, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అల్లరిమూకలు లోపలికి చొచ్చుకువెళ్ళాయి. ఇది దాదాపుగా నేర పూరిత నిర్లక్ష్యం, కుట్ర. గుల్బర్గ్‌పై దాడి సమయంలో జాకియా ఇంట్లోనే ఉన్నారు. అదృష్టవశాత్తు ఆమె బతికిపోయినప్పటికీ, ఆమె భర్త మిగతా 68 మంది ఇరుగుపొరుగు మాదిరిగానే దారుణంగా, హేయంగా హత్యకు గురయ్యారు. గుల్బర్గ్ సొసైటీని తగులబెట్టారు. అనేకమందిని కాపాడే ప్రయత్నంలో ఎహ్సాన్ జాఫ్రీ తన స్వంత ప్రాణాన్నే కోల్పోయారు. అందుకు జాకియా ప్రత్యక్ష సాక్షి.

ఆమె ఎంతటి అఘాతానికి లోనయ్యారనేది ఊహించలేము. దీంతో తన కుమారుడు నివాసం ఉంటున్న సూరత్‌కు మారడం తప్ప ఆమెకు మరో మార్గం లేకుండాపోయింది. కానీ, ఆమె ఎహ్సాన్‌తో పాటు అనూహ్య గుజరాత్ అల్లర్ల బారినపడిన అనేక మంది గుల్బర్గ్ సొసైటీవాసులకు న్యాయం జరగాలని పట్టుదలతో ఉండేది. గుజరాత్‌లో జరిగింది ఆకస్మికంగా తలెత్తింది కాదని, అది పోలీసు, అధికార యంత్రాంగం, ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తుల సహకారంతో హిందూ మితవాద సంస్థల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రణాళిక బద్ధంగా జరిగిన కుట్ర అని జాకియా మొదట్లోనే గ్రహించింది. ఆమె ఫిర్యాదులో పేర్కొన్న వారిలో అనేకమంది పేర్లను కావాల్సిన సాక్ష్యాలు లేవనే కారణంతో తొలగించారు. వాటిలో నాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర దామోదర్‌దాస్ మోదీ పేరు కూడా ఉంది. జాకియాకు తీస్తా సెతల్వాద్‌తో పాటు, సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్, మరికొందరు వ్యక్తులు, పౌర సమాజ సంస్థలు అండగా నిలిచాయి.

మానవ హక్కుల కార్యకర్తల నిరంతర సహకారం లేకుండా రాజ్యానికి వ్యతిరేకంగా జాకియా లాగా ఒక సామాన్య పౌరురాలు న్యాయపోరాటం చేయడం చాలా కష్టం. దురదృష్టవశాత్తు రాజ్యాంగపరంగా మానవ హక్కుల సంస్థలు క్రియాశీలకంగా ఉండడంపై ఇటీవల కాలంలో న్యాయస్థానాలు అయిష్టత వ్యక్తం చేస్తున్నాయి. బూటకపు ఎన్‌కౌంటర్‌లకు బలైన అణగారిన గిరిజన పౌరుల తరుపున ఎన్నడూ న్యాయవాదులను కలవని, కోర్టు మెట్లెక్కని, న్యాయ పరిష్కారం అందుబాటులో లేని వారి కుటుంబసభ్యులకు హక్కుల కార్యకర్తలు సహకరిస్తే కోర్టులు కోప్పడుతున్నాయి. రాజ్యపు తప్పుడు వృత్తాంతాలను క్షేత్రస్థాయి వాస్తవ నిర్ధారణ ద్వారా వారు బైటపెడితే వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నాయి. కోర్టులు కూడా పౌర సమాజ సంస్థలు లేదా కార్యకర్తలకు వ్యతిరేకంగా ప్రత్యక్ష చర్యకు వేగంగా చర్యలు తీసుకుంటున్నాయి. సామూహిక హత్యాకాండగా చెప్పబడుతున్న ఘటనలో రాష్ట్ర అత్యున్నత కార్యనిర్వాహకుని భాగస్వామ్యం, పాత్రను బోనులో నిలబెట్టేందుకు జాకియా సాక్ష్యాల కోసం చేస్తున్న



ప్రయత్నాలు వారికి దైవదూషణ మాదిరిగా అగుపించింది.

2022లో సుప్రీంకోర్టు కూడా అదే మాదిరిగా చూసింది. సుదీర్ఘ న్యాయ ప్రయాణంలో ఆమె అందజేసిన విస్తృత సాక్ష్యాలను విస్మరించి, తీస్తా, గుజరాత్ మాజీ డైరెక్టర్ జనరల్ ఆర్.బి.శ్రీకుమార్, మాజీ ఐపిఎస్ అధికారి సంజీవ్ భట్‌లను అరెస్టు చేయడమే కాకుండా, వారంతా అత్యంత జాగ్రత్తగా కుట్ర పన్నారని ఆరోపించబడ్డారు.

కేసు వివిధ స్థాయిలలో ఉన్న సమయంలో జాకియాకు అనేక నష్టాలు ఎదురైనప్పటికీ ఎన్నడూ కూడా వెనకడుగు ఆలోచనే చేయలేదు. మొదట్లో ఆమె దోషులకు వ్యతిరేకంగా నమోదైన ఎఫ్ఐఆర్ కోసం హైకోర్టుకు వెళ్ళగా, బలమైన ఆధారాలు, సాక్ష్యాలు ఉన్నప్పటికీ ఆమె పిటిషన్‌ను కోర్టు తిరస్కరించి మెజిస్ట్రేట్ వద్దకు వెళ్ళమని ఆదేశించింది. అప్పుడు ఆమె సుప్రీం కోర్టుకు వెళ్ళింది. అప్పటికే నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్నే (సిట్) విస్తృత కుట్రపై దర్యాప్తు చేయమని సుప్రీం కోర్టు ధర్మాసనం కోరింది. కానీ, కేసులో కీలకంగా ఉన్న రాజకీయ బలశాలులను కాపాడాలనే ఆశయంతోనే పని చేసిందని సిట్‌పై సందేహాలు వెల్లువెత్తాయి.

చివరకు సుప్రీం కోర్టు ఆదేశాలతో మెజిస్ట్రేట్ ఎదుట సిట్ ఫైల్ చేసిన తుది నివేదిక నిందితులకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొంది. దీంతో ముఖ్యమంత్రి సహా నిందితులకు వ్యతిరేకంగా జాకియా వేల పేజీలతో కూడిన సాక్ష్యాలను ప్రొటెస్ట్ పిటిషన్ రూపంలో దాఖలు చేసింది. ఆమె నిరసనను పట్టించుకోకుండా పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. అయినా ఆమె చలించలేదు. తిరిగి హైకోర్టును ఆశ్రయించినా అదే ఫలితం ఎదురైంది. సుప్రీం కోర్టుకు వెళ్ళింది. అక్కడ సామూహిక హత్యాకాండకు మొత్తం రాష్ట్ర యంత్రాంగాన్ని జవాబుదారీ చేస్తారనే ఆశతో ఆమె వెళ్ళగా, న్యాయ వ్యవస్థ చరిత్రలోనే అదొక చీకటి ఘట్టంగా మిగిలిపోయింది.

ఈ కేసు దోషుల నిర్ధారణ కంటే కూడా అవసరమైన సాక్ష్యాలు ఉన్న వ్యక్తులపై ట్రయల్ జరపాలనేది ఉద్దేశ్యం. నేను, అనేక మంది ట్రయల్ నిర్వహించేందుకు అవసరమైన ఆధారాలు ఉన్నాయని వాదించాం. ఇదిలా సాగుతుండగానే ఆమె గుల్బర్గ్ సొసైటీ హింస కేసును వదిలిపెట్టలేదు.

2016లో ఈ కేసులో 11 మందిపై హత్య, 13మందిపై హత్యాయత్నం, లూటీ, హింస నేరాలలో మొత్తం 24 మందిని దోషులుగా సెషన్స్ కోర్టు నిర్ధారించింది. అయినప్పటికీ కుట్ర అభియోగాల నుంచి వారందరినీ కోర్టు విముక్తులను చేసింది. ఈ తీర్పుపై ఇరుపక్షాలు దాఖలు చేసిన అప్పీళ్ళు ఇప్పటికీ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి.

> గుజరాత్ అల్లర్లు ఆకస్మికంగా తలెత్తింది కాదని, అది పోలీసు, అధికార యంత్రాంగం, ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తుల సహకారంతో హిందూ మితవాద సంస్థల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రణాళిక బద్ధంగా జరిగి న కుట్ర అని జాకియా మొదట్లోనే గ్రహించింది. ఆమె ఫిర్యాదులో పేర్కొన్న వారిలో అనేకమంది పేర్లను కావాల్సిన సాక్ష్యాలు లేవనే కారణంతో తొలగించారు. వాటిలో నాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర దామోదర్‌దాస్ మోదీ పేరు కూడా ఉంది. జాకియాకు తీస్తా సెతల్వాద్‌తో పాటు, సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్, మరికొందరు వ్యక్తులు, పౌర సమాజ సంస్థలు అండగా నిలిచాయి.

జాకియా అప్పా చారిత్రాత్మక న్యాయ పోరాటం చేసింది. ఆమె చివరకు కేసు ఓడిపోయినప్పటికీ, వాటిని తిరగదోడడంలో ప్రదర్శించిన ధైర్యం, నిబద్ధతలను నేనెన్నటికీ మరిచిపోలేను. ఎందుకుంటే ఆమె శక్తివంతమైన, ప్రమాదకరమైన అధికార యంత్రాంగాన్ని ఢీకొట్టింది. ఆమె పోరాటం ఎహ్సాన్ జాఫ్రీ విషయంలో వ్యక్తిగత న్యాయం కోసం జరిగింది. అది రాజకీయ పోరాటం కూడా. అలాగే వీగిపోతున్న దేశ లౌకిక చట్రాన్ని ఏకం చేసే మహోన్నత పోరాటం.

ఇవాళ జాకియా జాఫ్రీని తలుచుకుంటే నేను మానవ హక్కుల కోసం పోరాడిన ఒక సాహస యోధురాలి జ్ఞాపకాల దొంతరలోకి వెళ్ళిపోతాను. "న్యాయంకోసం చేసే పోరాటం వాస్తవానికి ఎన్నటికీ ఓడిపోదు. అలాగే ఆ పోరాటం ఎన్నటికీ ముగియదు" అని ఆమె పదేపదే నాతో చెప్పిన మాటలు ఇప్పటికీ చెవుల్లో గింగురుమంటూనే ఉన్నాయి.

*(లీఫ్‌లెట్ సౌజన్యంతో)*

# ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థ



చాడ వెంకటరెడ్డి
సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

ప్రపంచ పుటల్లో పెద్ద ప్రజాస్వామ్య దేశంగా విరాజిల్లుతున్న దేశం నేడు అనేక ఆటుపోట్లు/అగమ్యగోచరంగా ప్రజాస్వామ్య స్ఫూర్తికి భిన్నంగా అన్య వర్గధోరణులు ప్రబలి వ్యక్తిగత అహంకారపూరిత ఆలోచనలతో పార్టీలు వ్యవహరించడంతో ప్రజాప్రాతినిధ్య వ్యవస్థకే పెనుప్రమాదం పొంచి ఉన్నది.

1975 అత్యవసర పరిస్థితితో ఆరంభమైన రాజ్యాంగ ఉల్లంఘనలు, చట్టాన్ని ధిక్కరించడం లాంటివి ప్రస్తుత బిజెపి ప్రభుత్వంలో మరింత వేగంగా రాజ్యాంగ స్ఫూర్తికే భిన్నంగా మారుతున్నాయి. ప్రజల చేత ప్రజల ద్వారా ప్రజల కొరకు ప్రభుత్వం అనే దృక్పథం ప్రశ్నార్థకంగా మారుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రధానమైన మూడు అంగాలు శాసనవ్యవస్థ, కార్యనిర్వాహ వ్యవస్థ, న్యాయవ్యవస్థ. నాల్గవ స్థంభంగా మీడియా గుర్తింపులోకి వచ్చింది. రాచరిక వ్యవస్థలో కూడా ఒక నానుడు ఉండేది. "యథా రాజాతథా ప్రజా" రాజు మంచివాడు అంటే సుగుణవంతుడైతే (విలువలున్నవాడైతే) ప్రజలు కూడా అలాగే ఉంటారనే సామెత.

1980 తర్వాత అటు కేంద్రంలో ఇటు రాష్ట్రాలలో సంకీర్ణ ప్రభుత్వాలతో పార్టీ మార్పులతో రాజకీయాలలో నైతిక విలువల పతనం వేగవంతమైంది. పార్టీలు మారడం ప్రభుత్వాలను పడగొట్టడము నైజంగా మారిం ది. అప్పుడు కేంద్రం పార్టీ ఫిరాయింపుల చట్టం తెచ్చింది. దానితో కొంత అదుపులో ఉన్నట్లు అనిపించినా ఆ చట్టంలోనున్న లొసుగులను ఆసరా చేసుకొని ఫిరాయింపుల పరంపర కొనసాగుతూనే వుంది.

1992లో నూతన ఆర్థిక విధానాలు సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలతో దేశంలో పెనుమార్పులు సంభవించాయి. చేతివృత్తులు చితికి పోయాయి. గ్రామీణ వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. గ్రామసీమలలో కూడా ప్రపంచీకరణ అడుగులు మోపబడ్డాయి. భూస్వామ్య వ్యవస్థ స్థానే రియల్ ఎస్టేట్ రంగానికి రెక్కలొచ్చాయి. దీనితో ప్రతి మనిషికీ డబ్బు జబ్బు పట్టుకున్నది. అడ్డమైన దారులు తొక్కి అయినా డబ్బులు సంపాదించుకోవాలని ఆకాంక్షలు పెరిగాయి.

**మానవ సంబంధాల స్థానే యాంత్రిక సంబంధాలు**

2004 కంటే ముందు బోఫోర్సు కుంభకోణాలున్నా వాటిపైన సిబిఐ, ఇడిల విచారణ సీరియస్‌గా జరగడం గుడ్డిలో మెల్లలాగా పారదర్శకతకు నిదర్శనం. అవినీతి మయమైన నేపథ్యంలో వామపక్షాలు, యుపిఎ1 కనీస అవసరాల కార్యక్రమం ప్రాతిపదికన మద్దతిచ్చి అమలుకు పూనుకోవడంతో సమాచార హక్కు చట్టం, అటవీ భూములు హక్కు చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టం, గృహ హింస చట్టం లాంటి ప్రగతిశీల చట్టాలు రూపొందించబడి అమలులోకి వచ్చాయి. దానితో కొంత జవాబుదారితనం ఏర్పడింది. అణుఒప్పందంలో యుపిఎ1కు వామపక్షాలు వ్యతిరేకంగా నిలబడ్డాయి. దీనితో సమీకరణలు మారిపోయి, ఆ తదుపరి యుపిఎ 2 ఏర్పడి, అవినీతి మరకలు అంటుకోవడంతో బిజెపి, ఎన్‌డిఎ ప్రభుత్వం 2014లో అధికార పగ్గాలు చేపట్టడంతో రాజకీయాలలో తుపాన్ లాంటి మార్పులు సంభవించాయి.

నూతన ఆర్థిక విధానాల అమలుతో మానవీయ కోణంతో యుపిఎ1 ప్రభుత్వం అమలు చేస్తే మోదీ పూర్తిగా దానికి భిన్నంగా అంటే దృక్పథాన్ని మార్చేసి కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేస్తూ ప్రజలను మాటలతో మభ్యపెడుతూ "సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్" లాంటి మాటలు చెబుతున్నారు.

విజయమాల్యా, నీరవ్‌మోదీ, లలిత్‌మోదీ, ఆదానీ, అంబానీల అవినీతికి పరాకాష్టకు చేరింది. నేడు అమెరికా న్యాయ శాఖ నుండి రూ.2500 కోట్ల అవినీతి కుంభకోణం విషయంలో అంబానిపై ఆరోపణలతో రావడం చర్చనీయాంశంగా మారింది. అయితే అంబానీ మీద ఆరోపణలు చేసిన హిండెన్‌బర్గ్ అనే షేర్ మార్కెట్ షార్ట్ సెల్లింగ్ సర్వే సంస్థ ఇప్పుడు తన కార్యక్రమాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం ప్రపంచ వ్యాపితంగా ఆశ్చర్యం కలిగించింది. గతంలో హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణల వలన అంబానీకి సంబంధించిన షేర్లు పాతాళంలోకి వెళ్ళాయి. ఇప్పుడు ఆ సంస్థను మూసివేయడం, ట్రంప్ అమెరికాలో అధికారంలోకి రావడం, మోదీ ప్రభుత్వానికి ట్రంప్‌కు ఉన్న సన్నిహిత్యానికి సంబంధించి జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే కార్పొరేట్ శక్తులను మోడి ప్రభుత్వం ఎంతమేరకు సమర్థిస్తున్నదో ఈ సంఘటన ద్వారా అర్థం అవుతున్నది.

రైతు ఉద్యమం ఉధృతం కావడంతో మూడు సాగునీటి చట్టాలను వెనక్కి తీసుకుంటానని హామీ ఇచ్చి తుంగలో తొక్కారు. పంటలకు మద్దతు ధర కూడా ప్రకటించకపోవడం దుర్మార్గం.

రాజ్యాంగ ఉల్లంఘనలు ఒకటి రెండు కాదు. 'ఒకే దేశం–ఒకే పన్ను, ఒకే విధానమని' ఎన్ని పన్నులు మోపపడుతున్నాయో చర్చ జరగాలి. నేడు జమిలి ఎన్నికలు ఒకే దేశం ఒకే ఎన్నిక ఇది గతంలో లేదా పాలకులు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాలను పడగొడుతున్నందుననే పార్లమెంట్, అసెంబ్లీకి వేరువేరుగా జరుగుతున్నాయి.

రాజ్యాంగం పటిష్టవంతంగా ఉన్నందుననే పాలకులు ఇప్పటికీ కొంత పరిమితులలో ఉంటున్నారు. రాజ్యాంగ ఉల్లంఘనలకు, చట్టాలను ధిక్కరించడం లాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. కింకర్తవ్యమేమిటని ఈనాడు మేధావులు చర్చించాలి. ఎన్నికల విధానంపై కూడా మోదీ శీతకన్ను పెడుతున్నాడు. ఎన్నికల కమిషన్ నియామకంలో కూడా తన ముద్ర వేసుకునే ప్రయత్నం. ఆఖరుకు న్యాయవ్యవస్థలో కొల్లిజియంలో మార్పులు అంటే సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి నియామకంలో కూడా రాజకీయ నీలినీడలను పోత్సహించడం మోదీ దుర్మార్గానికి పరాకాష్ట. ఇప్పటికే ప్రధాన న్యాయమూర్తితోపాటు కొంతమంది న్యాయమూర్తులకు బిజెపి అండదండలు, రాజ్యసభ లాంటి అనేక పదవులు పొందుతుండటం గుర్తించాలి. ఎన్నికలు ఎలా సజావుగా సాగుతాయి. న్యాయవ్యవస్థ ద్వారా సరియైన న్యాయం అందే అవకాశం ఉన్నదా అనేది ప్రధాన ప్రశ్న.

ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా చట్టసభల ద్వారా ఎన్నికైన వారి నుండి ప్రభుత్వాల ఏర్పాటు జరుగుతున్నందున వారి కనుసన్నలలోనే ఐఎఎస్,ఐపిఎస్ తదితర అన్ని శాఖల అధికారులు బాధ్యతలు నిర్వర్తించాల్సి వుంటుంది. వారు ఎవరి ఆదేశాలు లేదా సూచనలతో పని చేయాలి అనేది ప్రధాన ప్రశ్న.

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు చెప్పిన విషయాలను వారికి అనుకూలమైనట్లు చెప్పినవన్ని కిక్కురమనకుంటా చేస్తే ఎన్ని సంవత్సరాలు అయినా ఒకే పదవిలో ఎంత కాలమైన ఉంటారు. లేకపోతే అడుగడుగున బదిలీలుచేస్తూ చుక్కలు చూపిస్తారు. అందుకే ప్రభుత్వ యంత్రాంగం పారదర్శకతను, జవాబుదారీతనాన్ని కోల్పోయింది.

మీడియా ఇదైనా స్వేచ్ఛగా, న్యాయం కోసం చట్టాలు అమలు కోసం పనిచేస్తుందా అనేది లేదు. ఇది పూర్తిగా కార్పొరేట్ అధిపతుల చేతుల్లో బందీ అయ్యింది.

> నేడు ఇండియా కూటమి పాత్రేమిటి? కాంగ్రెస్ పార్టీ, వామపక్షాలు సిద్ధాంతపరమైన విలువలున్నందున సీట్ల పంచాయితీ మాని, సమన్వయానికి పెద్దపీట వేయాలి. ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులను గంభీరంగా తీసుకోవాలి. ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా వ్యక్తిగత పోకడలు మాని దేశ భవిష్యత్‌కు ప్రజాస్వామ్య పరిరక్షణకు బాటలు వేయాలి. లేకుంటే ప్రజాస్వామ్యానికే పెనుముప్పు జరగనున్నది. ఇది సువిశాలమైన భారతదేశ భవిష్యత్‌కే సవాలు కానుంది. ఇప్పటికైనా ప్రతిపక్షాలు కళ్లు తెరచి, ప్రభుత్వానికి ముక్కుకు ముకుతాడు వేసే పద్ధతులలో ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుము బిగించాలి. ప్రజాస్వామ్యమంటే ప్రతిపక్షాలుంటాయి. లేకపోతే పొరుగు దేశాలుగా దశదిశా లేని దుస్థితి ఏర్పడక తప్పదు. చేతులు కాలకముందు ఆకులు పట్టుకుంటే మంచిది.

**చట్టసభల నిర్వహణ**

ఎవరు ఎం.పి, ఎం.ఎల్.ఎ. స్థానిక సంస్థలలో ప్రతినిధులుగా ఎన్నికవుతున్నారు. పూర్తి కార్పొరేట్ , పారిశ్రామిక వేత్తలు, గుత్తేదారులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తూ ప్రజా ప్రతినిధులుగా ఎన్నికవుతున్నారు. అందుకనే చట్టసభలలో ప్రజాసమస్యల పరిష్కారానికి వినియోగిస్తున్న సమయమెంతా, వ్యక్తిగత ఆరోపణలు, ప్రత్యారోపణలతో వినియోగిస్తున్న సమయం ఎంత అనేది విశ్లేషణ జరగాలి.

ఈ మధ్య అంబానీ ఆగడాలు, అవినీతిపై జెపిసి వేయడానికి పార్లమెంట్‌లో ఎన్ని రోజులు వాయిదా పడుతూ ఎంత సమయం వృథా అయ్యింది. ఈ చట్టసభలున్నది. ప్రభుత్వం తప్పులను ప్రతిపక్షాలు ఎత్తిచూపాలి. వాటిపైన పారదర్శకతతో నిర్మొహమాటంగా చర్చ జరగాలి. తప్పులుంటే సరిచేయాలి. మార్చుకోవాలి. కాని మంద బలంతో వాయిదా వేస్తూ ప్రతిపక్షాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుండటం ప్రజాస్వామ్య మూల సిద్ధాంతానికే విరుద్ధం.

ఇటీవల బిహార్ రాజధాని పట్నాలో దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభ సభల స్పీకర్‌లు, మండలి చైర్మన్‌లకు సంబంధించిన 85వ ఆలిండి యా సదస్సు జరిగింది. ఈ సదస్సు ముగింపు రోజున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక వ్యాఖ్యలు చేశారు. చట్టసభల పని దినాలు రాను రాను తగ్గిపోతున్నాయని, దీనిపై ప్రిసైడింగ్ ఆఫీసర్లు చర్య తీసుకోవాలని సూచించారు. చట్టసభల్లో గందరగోళం జరగకుండా రాజకీయ పార్టీలు అంతర్గత వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ వ్యాఖ్యలు మంచివే. ప్రజాస్వామ్య దేవాలయాలైన పార్లమెంటు, అసెంబ్లీలో సరైన దిశలో చర్చ జరిగితేనే దేశ ప్రజలకు ప్రజాస్వామ్యం, ప్రజాప్రతినిధులపై విశ్వాసం పెరుగుతుంది. అలా కాకుండా సభ జరకుండా పోవడంతో నిస్తేజం ఆవరిస్తుంది. చట్ట సభలు సరిగా జరగకపోవడానికి కారకులు ఎవరో ఒక్కసారి మనం పరిశీలిస్తే, ప్రధాన బాధ్యులు అధికారంలో ఉండే పార్టీలు. ఆ పార్టీ లు ప్రతిపక్షంలో ఉండగా, సభ జరగాలని, పని దినాలు పెరగాలని పట్టుబడతాయి. కానీ, అధికారంలోకి రాగానే అందుకు భిన్నంగా వ్యవహరిస్తుంటాయి. అందుకే ప్రజాస్వామ్యంలోఎవరు అధికారంలోకి వచ్చినా ఇంతేనని నిస్తేజం ప్రజల్లో అవరించింది. ఇది ఆందోళన కలిగించే విషయమే.

దేశవ్యాపితంగా రాజ్యాంగ ప్రాథమిక హక్కులు, ప్రభుత్వ పారదర్శకతకు ప్రజలకు జవాబుదారీపై చర్చ జరగాలి.

ప్రతిపక్షాలు మీనమేషం లెక్కించుకుంటూ ఉంటే మోదీ మరింత దూకుడు పెంచుతూ ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసే కుట్రకు పాల్పడటం ఖాయం.

నేడు ఇండియా కూటమి పాత్రేమిటి? కాంగ్రెస్ పార్టీ, వామపక్షాలు సిద్ధాంతపరమైన విలువలున్నందున సీట్ల పంచాయితీ మాని, సమన్వయానికి పెద్దపీట వేయాలి. ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులను గంభీరంగా తీసుకోవాలి. ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా వ్యక్తిగత పోకడలు మాని దేశ భవిష్యత్‌కు ప్రజాస్వామ్య పరిరక్షణకు బాటలు వేయాలి.

లేకుంటే ప్రజాస్వామ్యానికే పెనుముప్పు జరగనున్నది. ఇది సువిశాలమైన భారతదేశ భవిష్యత్‌కే సవాలు కానుంది. ఇప్పటికైనా ప్రతిపక్షాలు కళ్లు తెరచి, ప్రభుత్వానికి ముక్కుకు ముకుతాడు వేసే పద్ధతులలో ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుము బిగించాలి. ప్రజాస్వామ్యమంటే ప్రతిపక్షాలుంటా యి. లేకపోతే పొరుగు దేశాలుగా దిశదశ లేని దుస్థితి ఏర్పడక తప్పదు. చేతులు కాలకముందు ఆకులు పట్టుకుంటే మంచిది.

# తెలుగు జానపద రారాజు బిరుదురాజు రామరాజు



బిరుదురాజు రామరాజు హై స్కూల్ విద్యార్థిగా ఉన్న నాటి నుండి, 'భారతి' మొదలైన పత్రికలలో మానవల్లి, వేటూరి, నిడదవోలు, మల్లంపల్లి, వంటి పరిశోధకుల వ్యాసాలు, వారు సంపాదించిన గ్రంథములు, పీఠికలు చదివారు. వారిలాగే సాహిత్య లోకానికి తెలియని కొత్త విషయాలు తాను కూడా చెప్పాలని నిశ్చయంతో పరిశోధనారంగంలో అడుగుపెట్టాడు. జానపద విజ్ఞానంలో విశ్వవిద్యాలయాల పరిశోధనల్లో దక్షిణ దేశభాషలన్నింటిలోనూ, బిరుదురాజు రామరాజు యొక్క 'తెలుగు జానపద గేయ సాహిత్యం' మొదటి సిద్ధాంత గ్రంథం అయింది. జానపదగేయ రంగంలో అనేక జానపద గేయాలు, సంకలనాలు బిరుదురాజు రామరాజు ప్రకటించాడు. తెలుగులో, ఇంగ్లీషులో, జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పరిశోధనాత్మక పత్రాలు, రామరాజు చదివాడు. ఇంగ్లీషులో 'ఫోక్ ఫోక్ ఆఫ్ ఎ పి. 'ఫోక్ లోరు ఆఫ్ ఎపి, సౌత్ ఇండియన్ ఫోక్ సాంగ్స్, గ్లింప్సెస్ ఇన్ టూ, తెలుగు ఫ్లోక్ లోర్ అనే గ్రంథాలు బిరుదురాజు ప్రకటించారు. బిరుదు రాజు తెలంగాణ అంతా తిరిగి వందల కొద్ది తెలుగు, సంస్కృతంలో ఉన్న తాళపత్ర గ్రంథా లు, పదులకొద్దీ శిలా శాసనాలను సేకరించాడు. అచ్చుకాకుండా పడి ఉన్న తెలుగు, సంస్కృత కావ్యాలను దాదాపుగా నూరింటిని సాహిత్య ప్రపంచానికి తెలియజేశాడు. 'మరుగున పడిన మాణిక్యాలు– చరిత్రకి ఎక్కని చరితార్థులు' అనే పేరుతో అనేక వ్యాసాలు పత్రికల్లో బిరుదు రాజు రాశాడు.

**పరిష్కరించిన, గ్రంథాలుః** సంస్కృతంలో కాళహస్తి కవి రచించిన 'వసు చరిత్రం' మధురవాణి రచించిన రామాయణ సార తిలకం, వెల్లలా ఉమామహేశ్వర్లు 'శృంగార శేఖర బాణం', శ్రీకృష్ణదేవరాయల జాంబవతి పరిణయ నాటకం, మొదటిసారిగా పరిష్కరించిన బిరుదు రాజు అనంత రామయ్య, సీతా విజయ చంపు వంటి సంస్కృత కృతులను బిరుదు రాజు రామరాజు పరిష్కరించాడు.

**తెలుగు గ్రంథాల పరిష్కరణ :–** తెలుగులో బొడ్డుచర్ల చిన తిమ్మ కవి 'ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధం', చింతపల్లి ఛాయాపతి రాఘవాభ్యుదయం, వెంకటాద్రి నాయకుని సకల జీవసంజీవనం, పాల్కురికి సోమనాథుని, పండిత రాధ్యోదాదహరణం, అనే కావ్యాలను మొదటగా సేకరించి ప్రకటించారు. బిరుదురాజు రామరాజు, 'ఉర్దూ తెలుగు నిఘంటువు'ను కూర్చారు. ఇంగ్లీష్, హిందీల నుండి నాలుగు గ్రంథాలు అనువదించాడు. బిరుదురాజు పర్యవేక్షణ లో 38మంది ఎంఫిల్, పిహెచ్‌డి లు సంపాదించారు. తెలుగు జానపద విజ్ఞానరంగంలో విశేషమైన కృషిచేసిన వ్యక్తి ఆచార్య బిరుదురాజు రామరాజు, పరిశోధకుడిగా, పండితుడిగా, ఆచార్యుడిగా, జాతీయ వక్తగా ప్రసిద్ధి పొందిన ఈయన వరంగల్ జిల్లా దేవనూరు గ్రామంలో 1925, ఏప్రిల్ 16న జన్మించాడు. దేవునూరు, మడికొండ, హనుమకొండలో ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్యతోపాటు ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. తరువాత హైదరాబాద్ నిజాం కళాశాలలో ఇంగ్లీష్ మీడియంలో బిఎ పూర్తి చేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఎ తెలుగు, ఖండవల్లి లక్ష్మీ రంజనం పర్యవేక్షణలో పిహెచ్‌డి పూర్తి చేశాడు. 1952లో ఉస్మానియా తెలుగుశాఖలో అధ్యాపకుడిగా చేరి రీడర్‌గా, ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందాడు. 1973 నుంచి 1983 వరకు తెలుగు శాఖ అధ్యక్షులుగా కొనసాగాడు.1967 నుంచి 1974 వరకు వరంగల్ స్నాతకోత్తర కేంద్రంలో పనిచేసిన బిరుదురాజు రామరాజు 1983లో పదవీ విరమణ పొందాడు.

తెలుగు జానపద గేయ సాహిత్యంపై పిహెచ్‌డి చేసి ఆ రంగంలో ఎందరికో మార్గదర్శకుడయ్యాడు. జానపద సాహిత్య పరిశోధన దక్షిణ భారతదేశ భాషల్లోనే మొదటి పరిశోధనగా గుర్తింపు పొందింది. బిరుదురాజు రామరాజు వందలకొద్ది జానపద గేయాలను, అనేక తాళపత్ర గ్రంథాలను, శిలాశాసనాలను సేకరించాడు. ప్రాచీన కావ్యాలను పరిష్కరించాడు. ఆంధ్రదేశంలోని యోగుల చరిత్ర ను సేకరించి పుస్తకాలను నిలవరించాడు. ఈయన చేసిన సాంస్కృతిక సేవకుగాను జాతీ యాచార్య పదవి లభించింది. 2010 ఫిబ్రవరి 8న హైదరాబాదులో మరణించారు. జానపద సాహిత్యానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన బిరుదురాజు రామరాజు...తెలుగు జానపద సాహిత్యం అంటేనే బిరుదురాజు రామరాజు అని చెప్పుకోవచ్చు.

*(ఫిబ్రవరి 8 బిరుదురాజు రామరాజు వర్ధంతి)*

దేవులపల్లి రమేశ్, 9963701294

# ఫ్రాన్స్‌లో ప్రధాని మోడీ పర్యటన

### 10 నుంచి 12వరకు షెడ్యూల్ ఖరారు



**న్యూఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ.. ఫ్రాన్స్, అమెరికా పర్యటన షెడ్యూల్ ఖరారు అయ్యింది. ఈ నెల 10 నుంచి 12 వరకు ప్రధాని మోదీ ఫ్రాన్స్‌లో పర్యటిస్తారని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి మోడీ అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. కెడారచీ థర్మో న్యూక్లియర్ ఎక్స్‌పెరిమెంటల్ రియాక్టర్‌ను ప్రధాని పరిశీలించనున్నారని.. అనంతరం, అక్కడి నుంచి అమెరికా పర్యటనకు ప్రధాని వెళ్లనున్నట్లు తెలిపారు, ఈ నెల 12, 13 తేదీల్లో అమెరికా పర్యటిస్తారని.. అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోడీ భేటీ కానున్నారని వెల్లడించారు. రెండవ సారి అమెరికా ప్రెసిడెంట్ గా ఇటీవలవ బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. అమెరికా పర్యటనకు ప్రధాని మోడీని ఆహ్వానించిన సంగతి తెలిసిందే.

# రెండు రోజుల సమ్మెకు బ్యాంకుల పిలుపు




**న్యూఢిల్లీ :** తమ డిమాండ్ల సాధనకు రెండు రోజుల సమ్మెకు బ్యాంకు సిబ్బంది సంఘాలు పిలుపునిచ్చాయి. ముఖ్యంగా అయిదు రోజుల పనిదినాలు, తగినంత సిబ్బంది నియామకాన్ని నెరవేర్చాలని కోరుతూ మార్చి 24, 25 తేదీలలో సమ్మె నిర్వహించాలని నిర్ణయించాయి. 9 బ్యాంకుల సిబ్బంది సంఘాల ఉమ్మడి వేదిక యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యుఎఫ్‌బియు) సమ్మెకు పిలుపునిచ్చింది. ఉన్నతాధికారులతో చర్చలు, సంప్రతింపులు కొలిక్కి రాకపోవడంతో యూనియన్ సమ్మె నిర్ణయం తీసుకున్నట్టు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నది. పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలపై ఆర్థిక సేవల విభాగం ఇటీవల విడుదల చేసిన మార్గదర్శకాలు ఉద్యోగ భద్రతకు సవాల్‌గా పరిణమించాయని, ఉద్యోగుల మధ్య విభేదాలను సృష్టించేవిగా ఉన్నాయని, వాటిని వెంటనే ఉపసంహరించాలని సంఘాలు ఆందోళన వ్యక్తంచేశాయి. గ్రాట్యుటీ నిబంధనలు, తదితర అంశాలకు సంబంధించిన డిమాండ్లనుకూడా నెరవర్చేలని సంఘాలు కోరుతున్నాయి.

# 'నీట్' కౌన్సెలింగ్‌పై అభ్యర్థన కొట్టివేత

**న్యూఢిల్లీ :** నీట్ పిజి–2024 ఆలిండియా కోటా మూడో విడత కౌన్సెలింగ్‌ను నిలుపుదల చేయాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. ఈ తరుణంలో కౌన్సెలింగ్‌ను నిలుపుదల చేస్తే అన్ని రాష్ట్రాలలో ప్రతికూల వాతావరణం నెలకొంటుందన్న నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసి) అభ్యర్థన మేరకు సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. ఇటువంటి సమయంలో కౌన్సెలింగ్ నిలుపుదల చేస్తే పిజి కౌన్సెలింగ్‌పై దాని ప్రభావం పడుతుందని కమిషన్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. పిటిషన్‌ను కొట్టివేస్తూ ఇటువంటి అభ్యర్థనలకు చోటిస్తే మరో 30 అభ్యర్థనలు వస్తాయని ధర్మాసనం పేర్కొన్నది. కొన్ని రాష్ట్రాలలో రెండో విడత కౌన్సెలింగ్ పూర్తి కాకుండానే మూడో విడత కౌన్సెలింగ్ చేపట్టడం తమకు అన్యాయం చేసినట్టేనని పిటిసనర్లు తమ అభ్యర్థనలో పేర్కొన్నారు. రాష్ట్రాల కౌన్సెలింగ్, ఆలిండియా కోటా కౌన్సెలింగ్ మధ్య సమయాభావాన్ని పిటిషనర్లు ప్రశ్నించారు.

# ఎల్‌ఒసిలో పాక్ ఉగ్రవాదులు హతం

**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లో శుక్రవారం సుమారు 12 మంది పాక్ ఉగ్రవాదులు హతమయ్యారు. కృష్ణా ఘాటీ సెక్టార్ వద్ద ఏడుగురు పాక్ ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. భారత సైనిక శిబిరంపై ఉగ్రవాదులు ఆకస్మిక దాడికి పాల్పడ్డారు. దాడి చేసి కృష్ణా ఘాటీ సెక్టార్‌లోకి ప్రవేశించేందుకు యత్నించారు. అయితే వారి చొరబాటు ప్రయత్నాలను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఆకస్మిక దాడి చేసిన పాక్ ఉగ్రవాదులపైకి ఎదురుకాల్పులు జరిపారు. ఈ దాడుల్లో ఏడుగురు ఉగ్రవాదులు మృతిచెందారు. మరోవైపు జమ్మూకాశ్మీర్ పూంచ్ జిల్లాలోని బత్తల్ సెక్టార్‌లో ల్యాండ్‌మైన్ పేలి ఐదుగురు పాక్ ఉగ్రవాదులు మరణించారు. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ నుంచి భారత వైపునకు ఉగ్రవాదులు కంచె దాడుతున్న సమయంలో మందుపాతర పేలింది. ఓ ఉగ్రవాది ల్యాండ్‌మైన్ మీద కాలివేయడంతో ఈ సంఘటన జరిగిందని అధికారిక వర్గాలు తెలిపాయి. ఉగ్రవాదుల వద్ద ఐఈడీ కూడా ఉందని ల్యాండ్‌మైన్‌తో పాటు ఐఈడీ కూడా పేలిపోయినట్లు వెల్లడించారు. భారత్లోకి ఉగ్రవాదులు ప్రవేశించకుండా ఇండియన్ ఆర్మీ.. లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద వివిధ ప్రాంతాల్లో ల్యాండ మైన్లు ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలోనే అక్రమంగా ప్రవేశిస్తున్న ఉగ్రవాదులు మృతిచెందినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు.

### భారతీయ మత్స్యకారులను శ్రీలంక అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ

# ప్రతిపక్ష ఎంపిల నిరసన




**న్యూఢిల్లీ :** పార్లమెంటు ప్రాంగణంలో ప్రతిపక్ష ఎంపిలు శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. భారతీయ మత్స్యకారులను శ్రీలంక తరుచూ అరెస్టు చేస్తుండడాన్ని నిరసిస్తూ, ప్రభుత్వం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని డిమాండ్ చేశారు. తమిళనాడుకు చెందిన డిఎంకె, కాంగ్రెస్, వామపక్ష ఎంపిలో నేతృత్వంలో నిరసన జరగగా, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)కి చెందిన డెరెక్ ఓ బ్రెయిన్, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్‌కు చెందిన సుదామ ప్రసాద్ సహా అనేక ఇతర ప్రతిపక్ష పార్టీల ఎంపిలు పాల్గొన్నారు. 'తమిళ మత్స్యకారులకు న్యాయం', 'మా మత్స్యకారులను తిరిగి తీసుకు రండి', 'ఇకపై అరెస్టులు వద్దు', 'తమిళనాడు మత్స్యకారులు భారతీయులే' అనే నినాదాలతో కూడిన ప్లకార్డులను ఎంపిలు ప్రదర్శించారు. తమిళ మత్స్యకారుల అరెస్టు జాతీయ సమస్య అని డిఎంకె ఎంపి తిరుచ్చి శివ అన్నారు. కాగా, నిరసనలో ఇతర పార్టీలకు చెందిన వారు కూడా పాల్గొన్నారు. ఈ సమస్య రాష్ట్రానికే పరిమితం కాకూడదని, తమిళ మత్స్యకారులు కూడా భారతీయులనేనని శివ పిటిఐకి తెలిపారు. సంవత్సరాలుగా మత్స్యకారులను హింసించడం, వేధించడం, చంపడం జరుగుతోందని, ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎటువంటి నిర్దిష్ట చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో శ్రీలంక అధికారులు భారత మత్స్యకారులపై దాడి చేసి వారి వేటను దోచుకునేవారని, అయితే ఇటీవలి కాలం నుంచి పేద మత్స్యకారులను కాల్చడానికి ఆయుధాలను ఉపయోగించడం ప్రారంభించారని రాజ్యసభ సభ్యుడు తెలిపారు. జాలర్లు సముద్రంలోకి వెళ్లడానికి భయపడుతున్నారని, దీనివల్ల వారి జీవనోపాధికి అంతరాయం కలుగుతున్నదని ఆయన పేర్కొన్నారు. ఈ మత్స్యకారులను షెడ్యూల్డ్ తెగల వర్గంలో చేర్చాలనే ప్రతిపాదన ఉందని కూడా శివ అన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఈ విషయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌కు అనేకసార్లు లేఖలు రాశారని, శాశ్వత పరిష్కారం కనుగొనాలని కోరారని డిఎంకె సభ్యురాలు కనిమొళి చెప్పారు. 'శ్రీలంక నావికాదళం తమిళనాడు మత్స్యకారులను అరెస్టు చేసి వేధిస్తోంది. తమిళనాడుకు చెందిన దాదాపు 97 మంది మత్స్యకారులను అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ప్రధానమంత్రికి, విదేశాంగ మంత్రికి లేఖ రాశారు' అని ఆమె చెప్పారు. శ్రీలంక అధికారులు దాదాపు 200 పడవలను లాక్కున్నారని, దీనివల్ల మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటోందన్నారు. శ్రీలంక ప్రభుత్వం పడవలను లాక్కుని జాతీయం చేసిందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. 'మత్స్యకారులను విడుదల చేయాలని, పడవలను తిరిగి ఇవ్వాలని, శాశ్వత పరిష్కారం కనుగొనాలి' అనేది తమ డిమాండ్ అన్నారు. కాంగ్రెస్ ఎంపి మాణిక్కం ఠాగూర్ మాట్లాడుతూ మత్స్యకారుల విషయంలో కేంద్రం జోక్యం చేసుకుని శ్రీలంక ప్రభుత్వంతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. శ్రీలంక తమిళ మత్స్యకారులను నిరంతరం అరెస్టు చేయడాన్ని తాము తీవ్రంగా నిరసిస్తున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా, తమిళ మత్స్యకారుల సమస్య భారతదేశం, శ్రీలంక మధ్య చాలా సంవత్సరాలుగా వివాదానికి దారితీసింది. పాక్ జలసంధిలో తమ ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించారని ఆరోపిస్తూ భారత మత్స్యకారులపై కాల్పులు జరిపి వారి పడవలను స్వాధీనం చేసుకున్నట్లు ద్వీప దేశ నావికాదళం పదేపదే ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఈ నెల ప్రారంభంలో, శ్రీలంక అధికారులు తమ ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించారనే ఆరోపణలతో 10 మంది భారతీయ మత్స్యకారులను అరెస్టు చేసి, వారి పడవను స్వాధీనం చేసుకున్నారు. 2024లో, అక్రమంగా చేపలు పట్టారనే ఆరోపణలతో శ్రీలంక నావికాదళం 550 మందికి పైగా భారతీయ మత్స్యకారులను అరెస్టు చేసింది.

# రైతుల బాధలు పట్టని బడ్జెట్

### కాంగ్రెస్ ఎంపి ధరంవీర్ గాంధీ



**న్యూఢిల్లీ :** కేంద్ర వార్షిక బడ్జెట్ రైతుల బాధలను పట్టించుకోని విధంగా ఉందని, సామాజికి పథకాలకంటె ఆర్థిక లోటును కొనసాగించే విధంగా బడ్జెట్‌ను రూపొందించారని కాంగ్రెస్ ఎంపి ధరంవీర్ గాంధీ ఆక్షేపించారు. శుక్రవారం లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా కాంగ్రెస్ తరపున ధరంవీర్ మాట్లాడుతూ అది ఏకపక్షంగా ఉందని, బడ్జెట్ రూపకల్పనలో రాష్ట్రాలకు భాగస్వామ్యం లేకుండా చేశారన్నారు. విద్యం వైద్యం రంగాలలో వ్యయం చాలా తక్కువగా ఉందని, సామాజిక పథకాలను పణంగా పెట్టి ఆర్థిక లోటును కొనసాగేలా బడ్జెట్‌ను రూపొందించారన్నారు. చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి లేకపోవడాన్ని ఆక్షేపిస్తూ కాంగ్రెస్ సభ్యులు ఆమె హాజరు కావాలని డిమాండ్ చేశారు. అయితే బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆర్థికమంత్రి హాజరవ్వాలన్న నియమం ఏదీ లేదని, ఆమె తరపున ఆ శాఖ సహాయమంత్రి ఉన్నారని సభకు అధ్యక్షత వహించిన దిలీప్ సైకియా తెలిపారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆర్థికమంత్రి హాజరవడం ఆనవాయితీ అని కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. దీంతో కాంగ్రెస్ ఎంపిలు నిరసన వ్యక్తం చేయడంతో స్పీకర్ ఓం బిర్లా కార్యక్రమానికి అధ్యక్షత వహించి ఇకపై బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆర్థికమంత్రి హాజరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఉమ్మడి బాధ్యత నేపథ్యంలో మంత్రి లేదా సహాయమంత్రి హాజరవ్వాలన్న భావన ఉందని, ఎవరు పాల్గొనాలన్న దానిపై నిర్దిష్టమైన నిబంధన లేదన్నారు. మంత్రి పాల్గొనడం అన్నది కేవలం సాంప్రదాయమని, దీనిపై ఎలాంటి నిబంధనలు లేవని స్పీకర్ స్పష్టం చేశారు. తరువాత కొద్దిసేపటికి నిర్మల సీతారామన్ సభకు హాజరయ్యారు. ధరంవీర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ బడ్జెట్‌లో రైతుల రుణాల మాఫీ లేదా బీమా పథకం గురించిగానీ వెల్లడించలేదని, రైతుల బాధలు పట్టించుకోలేదని విమర్శించారు. అనవసర అంశాలకు ప్రాధాన్యమిస్తూ దేశ వ్యాప్తంగా ఎంఎస్ఎంఇ యూనిట్లను మూసివేశారన్నారు. చర్చలో పాల్గొన్న జైపూర్ బిజెపి ఎంపి రూరల్‌రావు రాజేంద్రసింగ్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలకంటె బిజెపి ప్రభుత్వం మధ్య తరగతి ప్రజలకు గరిష్ట ప్రయోజనాలకు చేకూర్చిందన్నారు. గత అయిదేళ్లలో సాధారణ ప్రజలు 8.17 లక్షల కోట్ల పన్ను ప్రయోజనాలను పొందారని, కార్పొరేట్ సంస్థలకు చెందిన వారు 4.53 లక్షల కోట్ల పన్ను ప్రయోజనం పొందారని తెలిపారు. విదేశీ పెట్టుబడిదారులు దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నా విపక్షాలు దేశ ఆర్థిక సామర్థ్యాన్ని శంకిస్తున్నారని వ్యాఖ్యానించారు.

### గల్ఫ్ ప్రవాసుల సంక్షేమానికి

# చర్యలు చేపట్టండి

### సిపిఐ ఎంపి సందోష్ కుమార్

**న్యూఢిల్లీ :** గల్ఫ్ దేశాలలోని ప్రవాస భారతీయుల సంక్షేమానిక తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంపి సందోష్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాజ్యసభలో గల్ఫ్ ప్రవాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడుతూ గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ దేశాలలో 90 లక్షలమంది భారతీయులు పనిచేస్తున్నారని, వారి సంక్షేమం కోసం ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించాలని కోరారు. భారతీయ ఆర్థిక ప్రగతిలో వారి భాగస్వామ్యం ఎనలేనిదని, వారు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారని, వారి సంక్షేమానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ పండుగ సమయాలలో విమాన ధరలను పెంచి శ్రమను దోచుకుంటున్నారని, ఈ సమస్యను పౌర విమానయాన శాఖ పట్టించుకోవడం లేదని గుర్తుచేశారు. పండుగలకు స్వదేశానికి రావాలనుకునే గల్ఫ్ ప్రవాసులకు ఇది ఎంతో భారంగా పరిణమిస్తోందన్నారు. గల్ఫ్ దేశాలలో చనిపోయిన భారతీయుల మృతదేహాలను స్వదేశానికి తీసుకువచ్చేందుకు ఎయిర్ ఇండియా అలవికాని చార్జీలను వసూలు చేస్తోందని, దీనిపై కూడా సంబంధిత మంత్రిత్వ శాఖ దృష్టి సారించాలన్నారు. ప్రవాస భారతీయుల సంక్షేమానిక ఏర్పాటు చేసిన ఇండియన్ కమ్యూనిటి వెల్ఫేర్ ఫండ్ నిధులను సరైన రీతిలో వినియోగించడం లేదని కేరళ ప్రతినిధులు సభ దృష్టికి తెచ్చారు. ప్రవాస భారతీయులు ఓటు హక్కును కూడా సరిగా వినియోగించుకోలేకపోతున్నారని, ప్రవాసుల సమస్యల పరిష్కార దిశగా భారత ప్రభుత్వం చొరవ చూపాలని సందోష్ కుమార్ విన్నవించారు.

# పార్లమెంటు సమావేశాలు ఏటా 120 రోజులు

### రాజ్యసభలో ప్రైవేట్ మెంటర్స్ బిల్లు
### రికార్డుస్థాయిలో ఒకేరోజు
### 50 బిల్లులు ప్రవేశపెట్టిన సభ్యులు



**న్యూఢిల్లీ :** రాజ్యసభలో శుక్రవారం 50 ప్రైవేటు మెంబర్స్ బిల్లులను సభ/్యలు ప్రవేశపెట్టారు. వాటిలో పని ప్రదేశాలలో కృత్రిమ మేథ వినియోగం అమలు నేపథ్యంలో ఉద్యోగుల హక్కుల పరిరక్షణ మొదలు డీప్‌ఫేక్ ద్వారా కంటెంట్ తయారు చేయడం, దుర్వినియోగం చేయడాన్ని నేరంగా భావించాలనే బిల్లులను సభ్యులు ప్రవేశపెట్టారు. అధికార బిజెపి మొదలు టిఎంసి, కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), ఆప్ తదితర పక్షాల సభ్యులు ప్రైవేటు మెంబర్స్ బిల్లులను ప్రవేశపెట్టిన సభ్యులలో ఉన్నారు. పార్లమెంటు సమావేశాలను ఏటా కనీసం 100 నుంచి 120 రోజులు నిర్వహించాలని కోరుతూ రెండు బిల్లులను మధ్యాహ్నం తరువాత రాజ్యసభలో ప్రవేశపెట్టారు. కృత్రిమ మేథ(ఉద్యోగుల హక్కుల పరిరక్షణ) బిల్లు, 2023ను , దాంతో పాటు డీప్‌ఫేక్ నిరోధక, క్రిమినలైజేషన్ బిల్లు, 2023ను కూడా టిఎంసి సభ్యురాలు మౌసం బి నూర్ సభలో ప్రతిపాదించారు.మరో టిఎంసి సభ్యుడు డెరిక్ ఒబ్రెయిన్ మాట్లాడుతూ '' ప్రస్తుతం పార్లమెంటు ఏటా 55 రోజుల మాత్రమే సమావేశం అవుతుంది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం నైతికతను కాపాడాలి. అందుకు కనీసం 100 రోజులు సమావేశమవ్వాలి. ఇందుకు నిర్ణీత క్యాలెండర్‌ను రూపొందించాల''ని అన్నారు. ఈ ప్రతిపాదనలతో ఆయన 85వ అధికరణను సవరించాలని కోరుతూ రాజ్యాంగ (సవరణ) బిల్లు, 2024ను ప్రవేశపెట్టారు. పార్లమెంటు (ఉత్పాదకత పెంపు) బిల్లు, 2024ను ఆర్‌జెడి ఎంపి మనోజ్ కుమార్ ఝా ప్రవేశపెడుతూ సమావేశాలను కచ్చితంగా ఏటా 120 రోజులకు తగ్గకుండా నిర్వహించాలని కోరారు. ప్రతి పార్లమెంటు సమావేశంలో పని దినాల సంఖ్యను, సమయం పెంపు, ప్రస్తుతం ఉన్న మూడు సెషన్‌లకు అదనంగా మధ్యలో స్వల్ప కాలిక సెషన్‌లను ఏర్పాటు చేయాలని, ప్రతిపక్షాలు ప్రత్యేకంగా చర్చించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రభుత్వరంగ ఉద్యోగులకు చట్టబద్ధమైన, స్వయం ప్రతిపత్తి, రాజ్యాంగ సంస్థల ఉద్యగుకలకు స్టార్టప్‌లు పెట్టేందుకు రెండు సంవత్సరాల వేతన రహిత సెలవు ఇవ్వాలనే సర్వీసు కండీషన్స్‌పై నిబంధనలతో కూడిన ఆంత్రప్రీనర్‌షిప్ లీవ్ బిల్, 2024ను కాంగ్రెస్ సభ్యుడు వివేక తంకా ప్రవేశపెట్టారు. భారతదేశంలో గిరిజనలు గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించేందుకు నేషనల్ ట్రైబల్ హెరిటేజ్ కౌన్సిల్ బిల్లు, 2024ను బిజెపి సభ్యుడు సుమిత్ర బాల్మిక్ ప్రవేశపెట్టారు. ఉచిత ప్రజారోగ్యరక్షణ బిల్లు, 2024ను సిపిఎం సభ్యుడు వి.శివదాసన్ ప్రవేశపెట్టగా, ఆన్‌లైన్ విద్వేష ప్రసంగాల(నిరోధక) బిల్లు, 2024ను ఆప్ సభ్యుడు విక్రమ్‌జిత్ సింగ్ ప్రవేశపెట్టారు.

## మూడు బిల్లులు పెట్టిన సిపిఐ



రాజ్యసభలో శుక్రవారం నాడు సిపిఐ సభ్యులు పి.సందోశ్ కుమార్ మూడు ప్రైవేట్ మెంబర్స్ బిల్లులను ప్రవేశపెట్టారు. అందులో గృహ హింస నుంచి మహిళలకు భద్రత చట్టం, 2005కు సవరణ ప్రతిపాదిస్తూ సవరణ బిల్లు–2024తో పాటు డిజిటల్ వ్యవస్థలో వ్యక్తిగత సమాచారానికి రక్షణ కల్పించాలని డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ బిల్లు–2024, ఉప్పు తయారీ కార్మికుల సంక్షేమం కోసం జాతీయ ఉప్పు కార్మికుల సంక్షేమ కమిషన్ బిల్లు–2024 ఉన్నాయి.

### ఎమ్మెల్యేలకు లంచం ఇవ్వజూపారన్న ఆరోపణలపై


# కేజ్రీవాల్‌కు ఏసిబి నోటీసు జారీ



**న్యూఢిల్లీ :** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తమ అభ్యర్థులకు బిజెపి లంచం ఇవ్వజూపిందన్న ఆప్ ఆరోపణలపై విచారణ జరిపించాలన్న బిజెపి అభ్యర్థన మేరకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్‌కు శుక్రవారం ఏసిబి నోటీసు జారీచేసింది. ఎన్నికల ఫలితాలు వెలువడేందుకు ఒక రోజు ముందు జరిగిన ఈ సంఘటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది రాజకీయ దురుద్దేశంలో కూడుకున్న చర్యగా కేజ్రీవాల్ అభివర్ణించారు. ఎక్స్ వేదికగా ఆప్ ఎమ్మెల్యేలకు లంచం ఇవ్వజూపారన్న ఆరోపణలు కేజ్రీవాల్ చేసినవేనా, అదే నిజమైతే అందుకు సంబంధించి న రుజువులను అంజేయాలని నోటీసులో పేర్కొన్నారు. ప్రజలలో ఆందోళన కలిగించే ఇటువంటి ఆరోపణలకు సంబంధించిన రుజువులు సమర్పించని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలకు ముందు ఆప్ నేతను భయపెట్టడానికే ఏసిబిని ఉసికొల్పారని ఆప్ వర్గాలు పేర్కొన్నాయి. ఏసిబి కేజ్రీవాల్ ఇంటికి చేరుకున్నపుడు వారివద్ద ఎటువంటి లీగల్ నోటీసు లేదని, గంటన్నర తరువాత వారు నోటీసు అందజేశారని ఆప్ లీగల్ సెల్ చీఫ్ సంజీవ్ నాసియర్ పేర్కొన్నారు. ఇదంతా లెఫ్టినెంట్ గవర్నర్, బిజెపి కుట్ర అని, అధికారులు వారి ఒత్తిడిపై ఈ చర్యకు పూనుకున్నారన్నారు. ఆప్ ఆరోపణలపై నిజ నిర్ధారణకు విచారణ జరిపించాలని ఢిల్లీ బిజెపి ప్రధాన కార్యదర్శి విష్ణు మిట్టల్ అభ్యర్థన మేరకు ఎల్‌జి ఏసిబిని ఆదేశించినట్టు అధికారులు పేర్కొన్నారు. 'ఆప్ నాయకులు అరవింద్ కేజ్రీవాల్, సంజయ్ సింగ్ ఆరోపణలు తీవ్రమైనవి. వాటిపై వెంటనే విచారణ జరిపించాలి. వారి ఆరోపణలకు సంబంధించి ఎటువంటి రుజువులు సమర్పించలేదు' అని బిజెపి నాయకుడు మిట్టల్ ఎల్‌జికి అందజేసిన అభ్యర్థనలో పేర్కొన్నారు. అంతకుముందు గురువారం కేజ్రీవాల్ తమ పార్టీకి చెందిన 16మంది ఎమ్మెల్యేలకు బిజెపి లంచం ఇవ్వజూపినట్టు ఎక్స్ వేదికగా ఆరోపించారు. పార్టీ మారినట్టైతే ఒక్కొక్కరికి రూ.15 కోట్లు నగదు, మంత్రి పదవులు ఇవ్వజూపినట్టు తెలిపారు. ఆప్ ఎంపి సంజయ్‌సింగ్ కూడా ఇటువంటి ఆరోపణలే చేశారు. కేజ్రీవాల్ ఆరోపణలను సమర్థిస్తూ ఆప్ అభ్యర్థులు ముఖేశ్ అహ్లావత్, వినయ్ మిశ్రా తమకు బిజెపి నుంచి ప్రతిపాదనలు అందినట్టు వెల్లడించారు.

# పన్ను రేట్లు తగ్గించిన ఆర్‌బిఐ

### గత అయిదేళ్లలో ఇదే మొదటిసారి




**న్యూఢిల్లీ :** ఆర్థిక వృద్ధి రేటును పెంచేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంకు శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేపథ్యంలో సమావేశమైన మోనిటరీ పాలసీ కమిటీ(ద్రవ్య నియంత్రణ కమిటీ) రెపో రేట్‌ను 25 బేస్ పాయింట్ల ఆధారంగా 6.25 శాతానికి తగ్గిస్తూ నిర్ణయించింది. నత్తనడకన సాగుతున్న ఆర్థిక ప్రగతిని వేగవంతం చేసేందుకు గత అయిదేళ్లలో పన్ను రేటును తగ్గించడం ఇదే మొదటిసారి. మే 2020 తరువాత పన్ను రేట్లు తగ్గడం ఇదే ప్రథమం. రెండున్నరేళ్ల తరువాత పన్ను విధానంపై తొలిసారి సమీక్షించారు. ప్రభుత్వాధికారిగా కెరీర్ ఆరంభించిన సంజయ్ మల్హోత్రా గత డిసెంబర్‌లో ఆర్‌బిఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఏప్రిల్ 2025 ఆర్థిక సంవత్సరం ఆరంభం నాటికి ఆర్థిక వృద్ధి రేటు 6.7 శాతానికి చేరుకోవాలని, ద్రవ్యోల్బణాన్ని 4.2 శాతానికి తగ్గించాలన్న ధ్యేయంతో మల్హోత్రా తీసుకున్న తొలి కీలక నిర్ణయం ఇది. సాధారణంగా ఆర్‌బిఐ బ్యాంకులకు నిధుల కొరత ఏర్పడినపుడు ఇచ్చే రుణాలపై వసూలు చేసే పన్ను రేటును రెపో రేట్ అంటారు. రెపో రేట్ ఎక్కువగా ఉన్నపుడు బ్యాంకులు ఎక్కువ రుణాలను పొంది ఖాతాదారులకు ఎక్కువ వడ్డీకి రుణాలను అందజేస్తుంటాయి. రెపో రేట్ తక్కువగా ఉన్నపుడు ఖాతాదారులకు అందించే రుణాలపై వడ్డీ రేటు కూడా తగ్గుతుంది. అపుడు గృహ రుణాలు, వాహన రుణాలు, వ్యక్తిగత రుణాలపై ఖాతాదారులు చెల్లించే వడ్డీ రేట్లు కూడా తగ్గుతాయి. ఆ సమయంలో బ్యాంకులనుంచి రుణాలు తీసుకునే వారి సంఖ్య పెరుగుతుంది. మరోకోణంలో పరిశీలిస్తే రెపో రేట్ తగ్గినపుడు బ్యాంకులలో చేసే పొదుపు, సంబంధిత పథకాలపై లభించే వడ్డీ తగ్గుతుంది. అది పొదుపు చర్యలపై ప్రభావం చూపుతుంది. ముగ్గురు ఆర్‌బిఐ సభ్యులు, మరో ముగ్గురు ఇతరులతో కూడిన కమిటీ రెపో రేట్‌ను 6.5 శాతంనుంచి 6.25 శాతానికి తగ్గించాలని నిర్ణయించిందని, ద్రవ్యోల్బణం రేటు తగ్గినందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు గవర్నర్ మల్హోత్రా వివరించారు. గత కొద్ది కాలంగా వినియోగదారు ధర ద్రవ్యోల్బణం తగ్గుతుండడం కూడా ఇందుకు దోహదం చేసిందన్నారు. ధరల నిలకడ, నిలకడైన ఆర్థిక వృద్ధి, ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలను కూడా దృష్టిలో ఉంచుకని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇటీవల రూపాయి పతనం ఇందుకు ఏమాత్రం అడ్డంకి కాదన్నారు. వచ్చే రెండేళ్లలో స్థూల జాతీయోత్పత్తి 7 శాతానికి చేరుకునే ధ్యేయంతో కమిటీ పనిచేస్తుందన్నారు.

### 6.7 శాతానికి ఆర్థిక వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరికి ఆర్థిక వృద్ధి రేటు 6.4 నుంచి 6.7 శాతానికి చేరుకుంటుందని ఆర్‌బిఐ ఆశాభావం వ్యక్తంచేసింది. రబీ సీజన్‌లో పంట దిగుబడుల పెరగడం, పారిశ్రామిక రంగం కోలుకోవడం ఇందుకు దోహదం చేస్తాయని ఆర్‌బిఐ గవర్నర్ వెల్లడించారు. పన్నురేటు తగ్గింపు కారణంగా గృహవినియోగం పెరగనున్నట్టు భావిస్తున్నామన్నారు. కేంద్ర ఆర్థికమంత్రి వార్షిక బడ్జెట్‌లో పన్ను రేటు తగ్గం మధ్య తరగతి వర్గాల కొనుగోలు శక్తిని పెంచేదిగా ఉంది. భారత స్థూల జాతీయోత్పత్తి జులై–సెప్టెంబర్ క్వార్టర్‌లో ఆశించినదానికంటె(7శాతం) తక్కువగా 5.4 శాతంగా నమోదైంది. ప్రభుత్వం తీసుకున్న సర్దుబాటు చర్యలతో 2025–2026 ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తి 6.8 శాతానికి చేరుకుంటుందని భావిస్తున్నారు.

# ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఉపశమనం

### 'ముడా' కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన కర్నాటక హైకోర్టు
### సిఎం హోదాలో దర్యాప్తుసంస్థలను ప్రభావితం చేస్తారని ఆర్‌టిఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ పిటిషన్ దాఖలు



**బెంగళూరు :** మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) స్థలం కేటాయింపు దర్యాప్తు కేసును సిబిఐకి అప్పగించేలా మార్గనిర్దేశంచేయాలని కోరుతూ ఆర్‌టిఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం కర్నాటక హైకోర్టు కొట్టివేసింది. దీంతో కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఉపశమనం లభించినట్లైంది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య సతీమణి బిఎం.పార్వతికి ముడా 14స్థలాలను అక్రమంగా కేటాయించిందన్న ఆరోపణలను సిద్దరామయ్య ఎదుర్కొంటున్నారు. ఆర్‌టిఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కారణంగా విచారణలో నిష్పాక్షిక దర్యాప్తు సాగడం సాధ్యం కాదని కర్నాటక హైకోర్టులో దాఖలుచేసిన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయనవద్ద అధికారం ఉన్న కారణంగా రాష్ట్రంలోని డిపార్ట్‌మెంట్లను ఆయన ప్రభావితంచేయగలరని, ప్రత్యేకించి దర్యాప్తు సంస్థలైన పోలీస్ అధికారులను, కర్నాటక లోకాయుక్త పోలీసులను కూడా ఆయన ప్రభావితం చేసే అవకాశం ఉన్నదని తెలియజేశారు. కాగా ఈ కేసులో జస్టిస్ ఎం.నాగప్రసన్న తన తీర్పును వెలువరిస్తూ లోకాయుక్త స్వతంత్రాన్ని కోల్పోతుందని బాధపడటంలో అర్థంలేదన్నారు. లోకాయుక్త జరిపిన విచారణ పక్షపాతంగా ఉన్నట్లు లోకాయుక్త రికార్డులలో ఎక్కడా స్పష్టం కాలేదని, ఈ విషయాన్ని తదుపరి విచారణ కోసం, పున:పరిశోధన కోసం కర్నాటక హైకోర్టు సిబిఐకి అప్పగించిందని, ఫలితంగా పిటిషన్ తొలగింపును ఎదుర్కొంటుందని, తదనుగుణంగా పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని జస్టిస్ ఎం.నాగప్రసన్న తన తీర్పులో తెలిపారు.లోకాయుక్త కార్యాలయానికి సందేహాస్పదమైన స్వాతంత్ర్యం ఉందా లేదా అనే మూడు ప్రశ్నలను తాను పరిగణనలోనికి తీసుకుంటున్నట్లు న్యాయమూర్తి చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి

## 16 మందికి గాయాలు

### మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలో ఘటన



**మహో :** మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలో శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనం, ప్రైవేట్ మినీబస్సు, ట్రైలర్ ట్రక్కు మధ్య జరిగిన ప్రమాదంలో ఇద్దరు మహిళలు సహా ఆరుగురు మృతి చెందగా, 16 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. మహో తహసీల్‌లోని మాన్పూర్ ప్రాంతంలో ఒక మోటార్ సైకిల్, మినీ బస్సు ట్రైలర్ ట్రక్కును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని ఒక అధికారి తెలిపారు. మోటార్ సైకిల్‌పై ఉన్న ఇద్దరు పురుషులు, మినీబస్సులో ఉన్న మహిళలు అక్కడికక్కడే మరణించగా, మరో ఇద్దరు మహారాజా యశ్వంతరావు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని అదనపు పోలీసు సూపరింటెండెంట్ (ఇండోర్ గ్రామీణ) రూపేష్ ద్వివేది పిటిఐకి తెలిపారు. 16 మంది గాయాలతో చికిత్స పొందుతున్నారని, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని ఆయన అన్నారు. మినీ బస్సులోని ప్రయాణికులు ఉజ్జయినిలోని ప్రసిద్ధ మహాకాళ ఆలయాన్ని సందర్శించిన తర్వాత కర్ణాటకలోని బెల్గాంకు తిరిగి వస్తున్నారని అధికారి తెలిపారు.

# మాతా, శిశు మరణాలు లేని జిల్లాగా నల్లగొండ

## నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




**ప్రజాపక్షం/నల్లగొండ:** సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించి అన్ని రంగాలలో మనిషి ముందుకెళుతున్నప్పటికీ అవగాహన లోపం, మూఢనమ్మకాల కారణంగా ఇంకా అక్కడక్కడ గ్రామీణ ప్రాంతాలలో ప్రసవం సందర్భంగా,ప్రసవానంతరం మాతా,శిశు మరణాలు సంభవించడం బాధాకరమని మాతా, శిశుమరణాలను తగ్గించడాన్ని సవాల్‌గా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్ లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఆశ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఇకపై జిల్లాలో ఎలాంటి మాతా శిశు మరణాలు సంభవించకుండా చూడాల్సిన అవసరం ఉందని, ఈ విషయాన్ని ప్రభుత్వ వైద్యులు, ఆశా కార్యకర్తలు సవాలుగా తీసుకోవాలని చెప్పారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ,గ్రామాల పరిధిలో ఒక్క మాతా శిశు మరణం సంభవించకూడదన్న లక్ష్యం తో పనిచేస్తే మాత శిశు మరణాలు తగ్గిపోతాయన్నారు. గత రెండు నెలలతో పోలిస్తే జిల్లాలో మాత, శిశు మరణాల సంఖ్య తగ్గిందని, ఇందుకు గాను ఆమె వైద్య అధికారులు, ఆశ కార్యకర్తలను అభినందిస్తూ మాత శిశు మరణాలు లేని జిల్లాగా నల్లగొండ జిల్లాను తీర్చి దిద్దాలని ఆమె కోరారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని ఏరియా ఆస్పత్రులు ,ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు,సబ్ సెంటర్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.పౌష్టికాహారం తీసుకోవడం, సరైన సమయానికి వైద్య పరీక్షలు చేయించుకుని పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుట్టే విధంగా చూడడంతో పాటు, గర్భిణిస్త్రీ సైతం ఆరోగ్యంగా ఉండేలా అవగాహన కల్పించాలని అన్నారు. గర్భం దాల్చిన తర్వాత గ్రామాలలోని ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వారికి అరోగ్య సంరక్షణ పై అవగాహన కల్పించాలని, అవసరమైతే వైద్యాధికారులు గర్భిణీ స్త్రీ లకు కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు.ప్రసవం కష్టం అయ్యే కేసులు, కవల పిల్లలు ,హై రిస్క్ కేసులను మాత్రమే జి జి హెచ్,ఏరియా ఆసుపత్రులకు పంపించాలని ఆమె తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిసిహెచ్ఎస్ డాక్టర్ మాతృనాయక్, డాక్టర్లు స్వరూప రాణి, వందన, డిప్యూటీ డిఎంహెచ్వోలు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### టిజిఒ భవన ఏర్పాటుకు కృషి చేస్తా

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి తన వంతుగా కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన టిజిఓ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గెజిటెడ్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారం కోసం మీకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం అధికారులు తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిజిఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, బి శ్యాం, ఉపేందర్ రావ్ శ్రీనివాసమూర్తి, ప్రవీణ్ రెడ్డి,జి మోహన్ రావు ,బి అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పాలన గురించి మీ తాత ముత్తాతలను అడుగు

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన పటేల్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** కాంగ్రెస్ పార్టీ 135 సంవత్సరాల చరిత్ర కలిగినదని, కాంగ్రెస్ పార్టీ పాలన గురించి బిఆర్ఎస్ నాయకులు మీ తాత, ముత్తాలను అడిగితే తెలుస్తుందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి కాంగ్రెస్ పాలనపై చేసిన వాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సిఎం కెసిఆర్ పాలన చేయడం చేతకాకనే లక్షల కోట్ల అప్పులు చేశారన్నారు. పాలన చేయడం రాకనే ఫాంహౌజ్‌లకే పరిమితమయ్యారని, అనాడైన సచివాలయానికి వచ్చి అధికారులతో సమీక్షలు చేసిన సందర్భాలు గత బిఆర్ఎస్ పాలకులకు లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో వచ్చిన అనతికాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని శాఖలు, రంగాలపై నిత్యం అధికారులతో సమీక్షలు జరిపి అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, ఎండి షఫిఉల్లా, నాయకులు ముదిరెడ్డి రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, వల్దాస్ దేవేందర్ ఉన్నారు.

## ఎన్నికల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం తగదు



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జె. శ్రీనివాస్ కోరారు.శుక్రవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయావరణలోని ఉదయాదీత్య భవన్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు నియమించబడిన పిఓ,ఏపిఓ, సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు.ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం జారీ చేసిన పిఓ హ్యాండ్ బుక్ ను బాగా చదవాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించవద్దని పూర్తి జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాల్సిందిగా ఆయన కోరారు. నల్లగొండ అర్‌డిఓ వై. అశోక్ రెడ్డ, ఎల్డిఎం శ్రామిక్, ఎన్నికల శిక్షకులు కొండమల్లేపల్లి ఎంపిడిఓ బాలరాజు రెడ్డి ఉన్నారు.

## సింగిరెడ్డి దామోదర్ రెడ్డి మరణం సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/మోటకొండూరు :** మోటకొండూరు మండలంలో వర్టూరు గ్రామ శాఖలో కామ్రేడ్ సింగిరెడ్డి దామోదర్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో మృతదేహానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, మండల కార్యదర్శి గాధగాని మాణిక్యం మండల కౌన్సిల్ కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బొలగాని సత్యనారాయణ మాట్లాడుతూ దామోదర్ రెడ్డి వర్టూరుతో పాటు చుట్టూ గ్రామాల్లో అమ్మనబోలు, చందపెల్లి మోటకొండూరులలో ప్రజా సమస్యలపై ముందుండి నడిచిన నాయకుడు దామోదర్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు బోలగాని లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మండల కార్యవర్గ సభ్యులు పల్లె వెంకన్న, మండల కౌన్సిల్ సభ్యులు సూదగాని వెంకన్న, నల్ల రాములు, గువ్వ వెంకన్న, పల్లె శీను, కర్రె సిద్ధులు, పాండు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

### తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్



**ప్రజాపక్షం/తిరుమలగిరి:** కాంగ్రెస్ పార్టీ, సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే మాదిగలకు సామాజిక న్యాయం లభిస్తుందని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఎస్‌సి వర్గీకరణకు క్యాబినెట్ తీర్మానం ఆమోదించడం హర్షణీయమన్నారు. గత 30 సంవత్సరాలుగా ఎస్‌సి వర్గీకరణ కోసం పోరాటాలు జరిగిన గత పాలకులు ఏ నాడు పట్టించుకోలేదన్నారు. రాజ్యాంగ ప్రకారం మాదిగలకు రావాల్సిన రిజర్వేషన్ ఫలాలను అందించే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరమను ఆమోదించిందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎల్సోజు నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమ్మిలాల్ నాయక్, నాయకులు సుంకరి జనార్ధన్, పేరాల వీరేష్, అంబేద్కర్, లింగన్న, సుధాకర్, శ్రీనివాస్, నరేష్, సోమన్న పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట(పెన్‌పహాడ్):** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య అధికారులు, సిబ్బంది ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం రికార్డులను తనికీ చేశారు. ఆయన వెంట మండల వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, ఎస్ఓ సాంబశివరావు, ఎంఓ వీరయ్య, హెచ్ఈఓ శ్రీనివాసులు, చంద్రసేఖర్ రాజు, సిబ్బంది ఉన్నారు.

# రోగుల పట్ల వైద్యులు నిర్లక్ష్యం వహించొద్దు

### ల్యాబ్ టెక్నీషియన్‌కు షోకాజ్ నోటీస్ జారీ

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీలో యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** అనధికార సెలవుపై వెళ్లిన ప్రభుత్వ వైద్య ల్యాబ్ టెక్నీషియన్ పై యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. వెంటనే వివరణ ఇవ్వాలని కోరుతూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హాస్పటల్‌కు వచ్చే పేషెంట్లకు వైద్యాధికారులు, సిబ్బంది నాణ్యమైన వైద్యం అందించి ప్రజలకు అందుబాటులో ఉండాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. భూదాన్ పోచంపల్లి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, తాసిల్దార్ కార్యాలయాన్ని ఆయన అధికారిక పర్యటనలో భాగంగా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేటట్లు ధరణి పై రివ్యూ చేశారు. కుల ఆదాయ, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ల జారీ విషయంలో అభ్యర్థులకు ఆలస్యం లేకుండా వీలైనంత తొందరగా ఇవ్వాలని అధికారుల ఆదేశించారు. రెవెన్యూ అధికారులు చేస్తున్న పని పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి హాజరు రిజిస్టర్ ను పరిశీలించగా టీఎస్ విలియమ్స్ ల్యాబ్ టెక్నీషియన్స్ గ్రేడ్ 2 విధులకు హాజరు కాకపోవడం పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ల్యాబ్ టెక్నిషన్స్ కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండల వైద్యాధికారి శ్రీవాణిని ఆసుపత్రిలో ఎంతమంది సిబ్బంది ఉన్నారని, వైద్య అధికారులు సమయపాలన పాటించాలని, లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వైద్యాధికారికి ఫోన్ ద్వారా అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేసేందుకు కమిషనర్ తో నివేదికలు పంపాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బంది చేస్తున్న సేవల పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఎండిఓ భాస్కర్, ఇన్చార్జి ఎమ్మార్వో నాగేశ్వరరావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది నర్సులు ఏఎన్ఎంలు ల్యాబ్ టెక్నీషియన్స్ రెవెన్యూ అధికారులు ఆయన వెంట ఉన్నారు.



## ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 13 మంది అభ్యర్థులు..16 సెట్ల నామినేషన్లు

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లలో భాగంగా శుక్రవారం 13 మంది అభ్యర్థులు 16 సెట్ల నామినేషన్లను దాఖలు చేసినట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు.శుక్రవారం నామినేషన్లు వేసిన వారిలో భారతీయ జనతా పార్టీ నుండి పులి సరోత్తమ్ రెడ్డి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు. తక్కిన 12 మంది అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారని ఆమె పేర్కొన్నారు.వారిలో ఏలే చంద్ర మోహన్, ఎస్. సుందర రాజ్, దామెర బాబురావు, పూల రవీందర్, తలకోల పురుషోత్తం రెడ్డి ,డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, చాలిక చంద్రశేఖర్, కంటే సాయన్న, జంగిటి కైలాసం, గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డిలు ఒక్కో నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు.పింగిలి శ్రీపాల్ 2 సెట్లు, అలుగుబెల్లి నర్సిరెడ్డి 3 సెట్ల నామినేషన్లను స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారని ఆమె వెల్లడించారు.నామినేషన్ల స్వీకరణ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జె.శ్రీనివాస్,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ లు ఉన్నారు.

# చెర్వుగట్టులో అగ్నిగుండాల ఘట్టం





**ప్రజాపక్షం /నార్కట్‌పల్లి :** కొలిచిన వారికి కొంగు బంగారం గా విరాజిల్లుతున్న నల్గొండ జిల్లా నార్కెట్పల్లి మండలం చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున అగ్నిగుండాల ఘటం ను ఆలయ అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన స్వామివారి కల్యాణానంతరం అగ్నిగుండాలకు అంతటి ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ అగ్ని గుండాల వెంట భక్తులు నడిచినచో పాపాలు వైదోలుగునని, అనారోగ్య సమస్యలు తీరునని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ అగ్ని గుండాల కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు శివసత్తులు పాల్గొని, ఒకరికొకరు పోటీపడుతూ అగ్ని గుండంలోని నిప్పుల మీద నడుచుకుంటూ వెళ్లడానికి భక్తులు పోటాపోటీపడ్డారు. చెరువు గట్టు ప్రాంతం అంతయు శివనామస్మరణతో మారుమోగింది. భక్తులు అగ్నిగుండంలో నడిచి పుణ్యాత్ములయ్యారు. ఈ కార్యక్రమం కి ముందుగా పార్వతి పరమేశ్వరులను పర్వత వాహనంపై ఊరేగింపుగా అగ్నిగుండెం స్థలం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిప్పులపై భక్తులు నడిచే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భక్తుల రద్దీకి అనుగుణంగా దేవాదాయ శాఖ, పోలీస్ శాఖలు తగిన ఏర్పాట్లను చేశారు.

**ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు:** అగ్నిగుండంలోని నిప్పులపై నడిచే భక్తులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందు జాగ్రత్తగా డిఎస్పి శివరాం రెడ్డి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ చర్యలు చేపట్టింది. అగ్ని మాపక శాఖ, ఆరోగ్య శాఖ సిబ్బంది అగ్ని గుండం వద్దనే విధిగా ఉంటూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్త పడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ అశోక్ రెడ్డి, బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి కృష్ణ, ఆలయ కార్యనిర్వాన అధికారి నవీన్ కుమార్, ఇంద్రసేనారెడ్డి శ్రీనివాసరెడ్డి శేఖర్ రెడ్డి వంశీ నరేష్ స్థానిక నేతలు గడుసు శశిధర్ రెడ్డి వారాల రమేష్, డీఎస్పీ శివరామిరెడ్డి సిఐ కె నాగరాజు ఎస్సై కాంత్ కుమార్, శివ సత్తి క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని అది దైవంతో సమానమని ప్రపంచ పర్యావరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర అన్నారు. ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి, ప్రపంచ పర్యావరణ సంస్థ ఉపాధ్యక్షులు కార్యక్రమ నిర్వాహకులు మిట్టపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన హెచ్ ఎండ్ ఆర్ బ్లాక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సిఎస్ఆర్ నిధులతో యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ ముఖి గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల చేత పర్యావరణ ప్రతిజ్ఞ చేపించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సుల అమెరికా నుంచి వచ్చిన ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి మాట్లాడుతూ భారత మాజీ రాష్ట్రపతి ప్రముఖ పర్యావరణ తత్వవేత్త భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను విద్యార్థిలోకానికి ప్రపంచానికి చాటి చెప్పాలన్న ఏకైక లక్ష్యంతో ప్రపంచ పర్యావరణ సంస్థ పర్యా వరణ పరిరక్షణ కోసం పని చేస్తూ ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్ర మంలో ప్రపంచ పర్యావరణ సంస్థ సహాయ కార్యదర్శి రాజేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు ఆర్.వినోద్ రెడ్డి, రామకృష్ణ, శంకర్, మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల హెచ్ఎం నాగభూషణం చారి, పాఠశాల కళాశాల లెక్చరర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాణ్యమైన కందులు తీసుకురావాలి

### కందులు కొనుగోలు కొనసాగుతున్నాయి

**ప్రజాపక్షం/ఉండవెల్లి :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించిన గిట్టుబాటు ధర ప్రకారం 7550 రూపాయలు ప్రకారం కందులను నేరుగా మార్క్ ఫెడ్ వాళ్లు కొనుగోలు చేస్తున్నట్లు అలంపూరు చౌరస్తా వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ఎల్లాస్వామి తెలిపారు. శుక్రవారం రైతులు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోకుండా ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు ధర ప్రకారం మార్కెట్ యార్డులోనే అమ్ముకోవాలని వారు సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అలంపూరు వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని సీఈఓ నాగేశ్వర్‌రెడ్డి సిబ్బంది కందుల పరిశీలన నిమిత్తం నాణ్యత ప్రమాణాలు ఆధారంగా కొనుగోలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. రైతులు ఎటువంటి పుల్లలు పుచ్చి గింజలు లేకుండా నాణ్యతమైన కందులు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సిబ్బంది, సొసైటీ అధికారులు పాల్గొన్నారు.

## యువత క్రీడలలో రాణించాలి : ఎఎస్‌పి మౌనిక



**ప్రజాపక్షం/చింతపల్లి :** నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశానుసారం చింతపల్లి మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన్ యువతేజం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ కబడ్డీ టోర్నమెంట్‌ను దేవరకొండ అడిషనల్ ఎస్పీ పి మౌనిక ప్రారంభించారు. మండల పరిధిలోని పలు గ్రామాల నుండి 22 టీములు హాజరై తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏఎస్‌పి మౌనిక మాట్లాడుతూ మిషన్ పరివర్తన్ యువతేజం కార్యక్రమం గ్రామాలలోని యువత మత్తు పదార్థాలకు, డ్రగ్స్‌కు లోను కాకుండా, వారిని క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ కబడ్డీ టోర్నమెంట్లో చింతపల్లి గ్రామానికి చెందిన ఎమ్‌సిసి టీం మొదటి బహుమతిని గెలుచుకోగా, రెండవ బహుమతిని కుర్మేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీం, ప్రశాంతపురి తండా టీం మూడో బహుమతిని గెలుచుకున్నారు. ప్రణవ గ్రూప్ ఛైర్మన్ బూరుగు రవి క్రీడాకారులకు జెర్సీలను, జ్ఞాపికలను అందించారు. ప్రథమ విజేతలకు ఎర్ర వెంకటయ్య ఐదులవేల రూపాయలు అందించగా, ద్వితీయ విజేతకు పిల్లి వెంకన్న మూడువేల రూపాయలు అందించాడు. క్రీడలలో గెలుపొందిన విజేతలకు సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ యాదయ్య బహుమతులను అందించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రమాకాంత్‌శర్మ, ఎంపిడిఓ సుజాత, ఎంఇఓ అంజయ్య, పలు పాఠశాలల పీడీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ పరిరక్షణకు కృషి



**ప్రజాపక్షం/నల్లగొండ :** శాసనమండలిలో విద్యారంగం పరిరక్షణ కోసం ప్రభుత్వంతో పోరాడే అభ్యర్థి ని గెలిపించుకోనే బాధ్యత ఉపాధ్యాయులదని శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిఅన్నారు.ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నామినేషన్ కార్యక్రమం సందర్భంగా ఉపాధ్యాయులచే పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా అనంతరం ఎస్ ఆర్ గార్డెన్స్ లో జరిగిన అలుగుబెల్లి నర్సిరెడ్డి నామినేషన్ సమావేశానికి టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి అధ్యక్షత జరిగిన సమావేశంలో నర్సిరెడ్డి మాట్లాడుతూ ఈనెల 27న జరుగుతున్న ఎన్నికలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు చాలా కీలకమని తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ పరిరక్షణ కోసం పేద ప్రజల పిల్లలకు సమానమైన నాణ్యమైన విద్య అందటానికి శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకను గెలిపించడానికి ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో టి పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్,రాష్ట్ర ప్రభుత్వ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్,తెలంగాణ గురుకులాల ఉపాధ్యాయ సంఘాల చైర్మన్ మామిడి నారాయణ ,కాంట్రాక్ట్ టీచర్ల సంఘం అధ్యక్షులు శ్రీధర్ కుమార్,ఎం తిరుపతి,ఏ వెంకట్, ,కొండయ్య మహేష్,మంజుల,జిల్లా అధ్యక్షులు బక్కా శ్రీనివాసాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, బడుగు అరుణ, నర్రా శేఖర్ రెడ్డి, జిల్లా కోశాధికారి వడిత్య రాజు, అరుణ రమాదేవి , సైదులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రజలు బకాయిలను వెంటనే చెల్లించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పట్టణ ప్రజలు బకాయి ఉన్న తమ ఇంటి పన్ను, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ తమ బకాయిలను చెల్లించకుంటే ఇంటి జప్తు చేయడంతో పాటు నల్లా కనెక్షన్లను శాశ్వతంగా తొలగించనున్నట్లు తెలిపారు. మొండి బకాయిలను వసూళ్లు చేసేందుకు పట్టణంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు తమ బకాయిలను చెల్లించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారి గౌస్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

# సౌత్‌కోస్ట్ రైల్వేజోన్‌గా వాల్తేర్ డివిజన్

## 'స్కిల్ ఇండియా'కు 8,800 కోట్లు
## ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్

**న్యూఢిల్లీ :** ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న వాల్తేర్ రైల్వే డివిజన్ పేరును సౌత్‌కోస్ట్ జోన్‌గా నామాంతరం చేస్తూ ప్రధాని మోడి నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపింది. వాల్తేరు డివిజన్‌లోని కొంత భాగంతోపాటు పలాస– విశాఖపట్నం–దువ్వాడ, కూనేరు, విజయనగరం, నైపాడ్ జంక్షన్, పర్లాకిమిడి, బొబ్బిలి జంక్షన్, సాలూరు, సింహాచలం నార్త్, వడలపూడి దువ్వాడ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ వరకు 410 కి.మీ. పరిధిని ఈ జోన్‌లో చేర్చనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల క్రితమే మోదీ ప్రభుత్వ ఈ జోన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికి అది కార్యరూపం దాల్చింది. వాల్తేర్ డివిజన్‌ను రద్దు చేస్తూ విశాఖపట్నం డివిజన్‌ను ఏర్పాటు చేసింది. ఈ జోన్‌లో ఇప్పటివరకు విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు మాత్రమే ఉండగా, కొత్తగా తీసుకున్న నిర్ణయంతో విశాఖ డివిజన్ కూడా ఇందులో చేరనున్నది. ఈ మేరకు డిపిఆర్ సిద్ధం చేయాలని జోన్ ప్రత్యేక అధికారికి ఆదేశాలు అందాయి.
కేంద్ర ప్రభుత్వ పథకం 'స్కిల్ ఇండియా'కు ఎట్టకేలకు ఆమోదం లభించింది. శుక్రవారం కేబినెట్ ఈ పథకానికి మొత్తంగా రూ.8,800 కోట్లు కేటాయించినట్లు, దీనితోపాటు నూతన ఐటి బిల్లుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపిందని సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0(పిఎం కెవివై 4.0), ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్(పిఎం–ఎన్ఎపిఎస్), జన్ సిక్షన్ సంస్థాన్(జెఎస్ఎస్) పథకాలను ఒకే గొడుగు కిందకు తెచ్చి 'స్కిల్ ఇండియా ప్రోగ్రామ్'గా రూపుదిద్దారు. పిఎంకెవివై 4.0 పథకానికి రూ.6,000 కోట్లు, పిఎం ఎన్ఎపిఎస్ పథకానికి రూ.1,942 కోట్లు, జెఎస్ఎస్ పథకానికి 858 కోట్లు కేటాయించినట్లు వైష్ణవ్ తెలిపారు. నైపుణ్యం కలిగిన, భావి అవసరాలకు అనుగుణమైన, డిమాండ్ కలిగిన, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన, పరిశ్రమలకు అనుగుణమైన శ్రామిక శక్తిని రూపుదిద్దేందుకు ఈ పథకానికి ఆమోదం తెలిపినట్లు ఒక అధికారిక ప్రకటనతో తెలిపారు. దేశ యువతను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అన్ని నైపుణ్యాలను అందించేందుకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ పథకం కింద ఇప్పటికే 2.27 కోట్లమంది నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక సామర్థ్యాన్ని పొందారని వివరించారు. తక్కువ సమయంలో నైపుణ్యాలను పెంచుకోవ డం, వర్చువల్ పారిశ్రామిక అనుభవం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవడం, కృత్రిమ మేథకు సంబంధించి 400కు పైగా కోర్సులు, 5జి సాంకేతికత, సైబర్ సెక్యూరిటి, గ్రీన్ హైడ్రోజన్, డ్రోన్ సాంకేతికత ఈ కోర్సుల్లో పొందుపరిచారు. కాగా నూతన ఐటి బిల్లుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లులో డైరెక్ట్ పన్నుల విధానాన్ని మరింత సరళతరం చేయనున్నారు. ఈ బిల్లును వచ్చే వారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్లు ఇన్‌కంటాక్స్ వర్గాలు తెలిపాయి. సఫాయి కర్మచారి జాతీయ కమిషన్‌ను మరో మూడేళ్లపాటు పొడిగిస్తూ కేబినెట్ నిర్ణయించింది. ఇందుకోసం మూడేళ్ల కాలానికి రూ.50.91 కోట్లను కేటాయించారు.




# లగచర్ల రైతుల భూముల్లో అధికారుల సర్వే



మా భూముల జోలికి రావొద్దంటు ప్లకార్డులతో గిరిజనుల నిరసన
భూములు ఇచ్చిన రైతుల భూములు సర్వే చేసిన అధికారులు
భారీగా మోహరించిన పోలీసు బలగాలు

**ప్రజాపక్షం / కొడంగల్ :** దేశ స్థాయిలో సంచలనంగా మారిన కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల భూవివాదం కాస్త కొలిక్కి వచ్చిందనే చెప్పవచ్చు. రైతుల ఆమోదం మేరకు అధికారులు పలు గ్రామాల్లో సర్వే చేపట్టి దాదాపు 230 మంది రైతులకు లబ్ది చేకూరినట్లు అధికారులు వెల్లడించారు. అందులో భాగంగానే శుక్రవారం లగచర్ల గ్రామ శివారులోని రోటిబండ తాండ, పులిచెర్ల తండాలలోని అసైన్డ్ భూ ములలో అధికారులు సర్వేకు వచ్చారు. విషయం తెలుసుకున్న తండా వాసులు మా భూముల జోలికి రావద్దు, మా భూములు మాకే కావాలి మా తండాలోకి అధికారులు రావద్దంటు ఆగ్రహం వ్యక్తం చేస్తు ప్లకార్డులను ప్రదర్శిస్తూ అధికారులను అడ్డుకున్నారు. దీంతో అధికారులు పోలీసుల సహాయంతో భూ సర్వే పనులను చేపట్టారు. అయితే గత వారం రోజుల క్రితం కొంత మంది రైతులు కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని భూములు ఇచ్చేందుకు సమ్మతి చెప్పడంతోనే సర్వేకు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. దుద్యాల్ మండలంలో పారిశ్రామిక కారిడర్‌కు సంబంధించి మొత్తం 1236 భూ సేకరణ చేయాల్సి ఉండగా అందులో హకీంపేట గ్రామంలో అసైన్డ్ భూమి 350 ఎకరాలు ఉండగా పట్టా భూములు 146 ఎకరాలు ఉంది. లగచర్ల గ్రామంలో అసైన్డ్ భూమి 110 ఎకరాలు ఉండగా పట్టా భూములు 497 ఎకరాలు ఉంది. పోలేపల్లి గ్రామంలో అసైన్డ్ భూమి కేవలం 73.29 గుంటలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో లగచర్ల గ్రామంలో కేవలం 110 ఎకరాలకు సంబంధించిన అసైన్డ్ భూమి సర్వే చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. సర్వే చేసేందుకు 4 బృందాలుగా ఏర్పడి భూములు మొత్తం సర్వే చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పారిశ్రామిక కారిడర్‌కు భూములు ఇస్తే ఎకరానికి 20 లక్షలు, ఇందిరమ్మ ఇండ్లు, 150 గజాల ప్రభుత్వ అనుమతులతో స్థలం, అర్హతను బట్టి ఇంటికి ఒక ఉద్యోగం కల్పించడం జరుగుతుందని అన్నారు. రైతులు అసైన్డ్ భూములను స్వచ్ఛందంగా ముందుకు రాని యెడల వారి పేరు పై న్యాయస్థానంలో 6.75 లక్షల రూపాయలను డిపాజిట్ చేసి భూములు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉన్నట్లు అధికారులు చెప్పినట్లు మనకు విశ్వసనీయ సమాచారం. లేని పక్షంలో ప్రభుత్వ పథకాలు ఏవి కూడా వీళ్లకు వర్తించబోవని కూడా సమాచారం. భూ సర్వేకు ఇద్దరు డిఎస్పిలు, నలుగురు సిఐలు, పది మంది ఎస్ఐలు, దాదాపు 200 మంది పోలీసు బలగాలు మోహరించారు. ఎట్టకేలకు పోలీసు బందోబస్తు మధ్య శాంతియుతంగా అసైన్డ్ భూముల సర్వే సాగింది.

## మల్లు అనంతరాములుకు సిఎం, డిప్యూటీ సిఎం నివాళి




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కేంద్ర మాజీ మంత్రి, పిసిసి మాజీ అధ్యక్షులు లోక్‌సభ మాజీ సభ్యులు దివంగత మల్లు అనంతరాములు వర్ధంతిని పురస్కరించుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నివాళి అర్పించారు. ఢిల్లీలో శనివారం సిఎం అధికారిక నివాసంలో మల్లు అనంతరాములు చిత్రపటానికి ముఖ్యమంత్రితో రేవంత్‌రెడ్డితో ఎఐసిసి తెలంగాణ ఇంచార్జి దీపదాస్ మున్షి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ ఇతర నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నాగర్‌కర్నూల్ ఎంపిగా రెండు సార్లు ఎన్నికైన మల్లు అనంతరాములు ఆ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కొనియాడారు.

## సూర్యాపేట, గజ్వేల్‌లో బహిరంగ సభలు : వి.హనుమంతరావు




**ప్రజా పక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి ,బిసిలకు న్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు ఇచ్చిన మాటను నిలుపుకున్న నేపథ్యంలో త్వరలోనే సూర్యాపేటలో బహిరంగ సభ నిర్వహించనున్నామని, ఈ సభకు కాంగ్రెస్ అగ్రనాయకులు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరు కానున్నట్లు తెలిపారు. ఎస్‌సి వర్గీకరణ పూర్తి చేసిన నేపథ్యంలో గజ్వేల్‌లో ఎఐసిసి అధ్యక్షులు మలికార్జున ఖర్గేతో మరో బహిరంగ సభను నిర్వహించనున్నామని హనుమంతరావు తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి బిసిల పక్షపాతి అని, పార్టీ నిర్వహించనున్న సూర్యాపేట, గజ్వేల్ సభకు తన పూర్తి మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

## కుంభమేళాలో అగ్ని ప్రమాదం



**మహాకుంభ్‌నగర్ :** మహాకుంభ మేళాలో శుక్రవారం మరోసారి అగ్ని ప్రమాదం సంభవించింది. అయితే ఎవరూ మరణించడం లేదా గాయపడలేదని అధికారులు వెల్లడించారు. సెక్టార్–18లోని ఇస్కాన్ క్యాంప్ వద్ద ఉదయం 10.35 గంటలకు ఈ ప్రమాదం సంభవించిందని, సమీపంలోని మరో 12 క్యాంపులకు మంటలు వ్యాపించాయని ముఖ్య అగ్నిమాపక అధికారి ప్రమోద్ శర్మ తెలిపారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే డజనుకు పైగా ఫైరింజన్లను ఘటనా స్థలికి పంపించామని, సకాలంలో మంటలను అదుపుచేశారని తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, ఎవరికీ గాయాలు కాలేదని ఎక్స్ వేదికగా వెల్లడించారు. అదాని ఫౌండేషన్ నేతృత్వంలో నిర్వహిస్తున్న సెక్టార్–19లోని ఇస్కాన్ క్యాంప్ కుంభమేళా యాత్రికులకు ఉచిత అన్నదానం పంపిణీ చేస్తున్నది. ఇందుకోసం పెద్ద వంటశాలను ఏర్పాటు చేసుకున్నది. కాగా కుంభమేళా సందర్భంగా సంభవించిన మూడో పెద్ద అగ్ని ప్రమాదం ఇది. గతంలో జనవరి 19న సెక్టార్–19లో గ్యాస్ సిలిండర్ పేలి సంభవించిన అగ్ని ప్రమాదంలో ఎవరికి ప్రమాదం జరగనప్పటికీ డజను క్యాంపులకు అగ్నీ కీలలు వ్యాపించి ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. జనవరి 25న సెక్టార్–2లో పార్కింగ్‌లో ఉన్న కారులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి సమీపంలోని మరో కారు కూడా దెబ్బతిన్నది. జనవరి 13న ఆరంభమైన కుంభమేళా ఫిబ్రవరి 26వరకు కొనసాగనున్నది.

## దేశవ్యాప్తంగా 2,450 పిల్లల సంరక్షణ కేంద్రాలు

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో వాత్సల్య పథకం కింద 2,450 పిల్లల సంరక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు, అందులో 199 కేంద్రాలు వికలాంగులకు కేటాయించినట్టు మహిళ, శిశు అభివృద్ధి శాఖ సహాయమంత్రి సావిత్రి ఠాకూర్ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానమిస్తూ మొత్తంగా 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో వికలాంగ బాలలకు సంబంధించిన కేంద్రాలు లేనట్టు వెల్లడించారు. వాటిలో మహారాష్ట్ర, అరుణాచల్‌ప్రదేశ్, గోవా, గుజరాత్, ఒడిషా రాష్ట్రాలున్నట్టు తెలిపారు. మరో ప్రశ్నకు మంత్రి అన్నపూర్ణ దేవి సమాధానమిస్తూ యాచక వృత్తిని నిరోధించే దిశగా 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు వివిధ చట్టాలను అమలు చేస్తున్నాయన్నారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ వద్దనున్న సమాచారం ప్రకారం డిసెంబర్, 2, 2024నాటికి 7.5 కోట్లమంది అయిదేళ్లలోపు పిల్లలు అంగన్‌వాడీలలో నమోదు అయ్యారని అన్నపూర్ణ తెలిపారు.

# మార్చి 7 నుంచి 24 వరకు హెచ్‌1బి వీసా దరఖాస్తుల స్వీకారం

**వాషింగ్టన్ :** అమెరికాలో ఉద్యోగాలు చేయబోయే వాళ్లకు మంజూరు చేసే హెచ్‌1బి వీసాల కోసం దరఖాస్తుల ప్రక్రియ ఈ ఏడాది మార్చి 7న ప్రారంభం కానుంది. మార్చి 7 నుంచి 24 వరకు ఇది కొనసాగుతుందని అమెరికా పౌరసత్వ , వలస సేవల సంస్థ (యుఎస్‌సిఐఎస్) ప్రకటించింది. ఈ సమయంలో పిటిషనర్లు , రెప్రజెంటేటివ్‌లు, రిజిస్ట్రేషన్ కోసం యుఎస్‌సిఐస్ ఆన్‌లైన్ అకౌంట్‌ను వినియోగించుకోవాలని సూచించింది. అభ్యర్థుల ఎంపిక కోసం ప్రతిలబ్ధిదారుడు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని పేర్కొంది. 215 అమెరికా డాలర్లుగా రిజిస్ట్రేషన్ ఫీజు నిర్ణయించారు. ఆర్థిక సంవత్సరం 2026 హెచ్‌1బికి సంబంధించి ఆర్థిక సంవత్సరం 2025లో ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, అమెరికా ఆర్థిక సంవత్సరం అక్టోబర్ 1న ప్రారంభమవుతుందని వెల్లడించింది. హెచ్‌1 బి వీసా లబ్ధిదారుల్లో ఎక్కువ మంది భారతీయులే ఉంటారు. వృత్తుల్లో అత్యంత నైపుణ్యం సంపాదించిన భారతీయులే అధిక సంఖ్యలో హెచ్‌1 బి వీసాలకు ప్రయత్నిస్తుంటారు. ఏటా 65,000 మంది ఈ వీసా కోసం వృత్తి నిపుణులు వీసాలు పొందగా, మరో 20,000 మంది అమెరికాలో ఉన్నత విద్యను పొందుతున్నారు. అమెరికా కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకోడానికి ఈ హెచ్‌1 బి వీసా లబ్ధిదారులనే ఎంపిక చేస్తుంటారు.




# బాసర ట్రిబుల్ ఐటిలో ఏం జరుగుతోంది?

## పరీక్షలు సరిగా రాసినా ఫెయిల్ చేస్తున్నారని ఆరోపణలు..


**ప్రజాపక్షం/బాసర:** రాజీవ్ గాంధీ శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం పరిధిలోని బాసర ట్రిపుల్ ఐటీలో అసలు ఏం జరుగుతుంది. అనే అంశం చర్చనీయాంశంగా మారింది. గతంలో కూడా విద్యార్థులు పలుమార్లు ఆందోళనకు దిగారు. విద్యార్థులు మళ్లీ ఆందోళనకు దిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పరీక్షలు బాగా రాసినా ఫెయిల్ చేస్తున్నారని ఆరోపిస్తూ, శుక్రవారం బాసర ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీ కార్యాలయం ఎదుట విద్యార్థులు నిరసన తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. కొంతమంది ఫెయిల్ అయిన విద్యార్థులు తమ పరీక్ష పేపర్లు తిరిగి తనిఖీ చేయించుకున్న తర్వాత పాస్ మార్కులు వచ్చినట్లు పేర్కొన్నారు. గతంలో కూడా బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు వివిధ కారణాలతో ఆందోళనలు నిర్వహించారు. 2022లో విద్య, భోజన, ఇతర వసతుల్లో నాణ్యత తగ్గిందని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌ను నియమించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేశారు. 2024లో కూడా విద్యార్థులు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ నియామకం,హాస్టల్ గదుల్లో, మెస్సుల్లో, విద్యాబోధనలో ఎదుర్కొంటున్న సమస్యలపై నిరసనలు తెలిపారు. తాజాగా ఆందోళనకు సంబంధించి యూనివర్సిటీ యాజమాన్యం నుండి ఇంకా అధికారిక పకటన వెలువడలేదు. విదాయర్థుల డిమాండ్లపై యాజమాన్యం స్పందించి, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని ఆశించవచ్చు. దీనితో కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూపుల్లో మిగిలిపోయారు. గతంలో ఇప్పటివరకు కళాశాలలో వంద సంఖ్యలో ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు ఉన్న విషయం విధితమే. అదేవిధంగా ఒక కీచక ప్రొఫెసర్ గతంలో అమ్మాయిలను టార్గెట చేసి సస్పెండ్ అయిన విషయం మరిచిపోక ముందే కళాశాలలో విద్యార్థుల ఆత్మహత్యలు, అసౌకర్యాలు, యూనివర్సిటీని దోచుకున్న అదికారుల ఆగడాలు బయటపడ్డాయి. ఇప్పుడు ఫెయిల్ పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థులు ఆందోళన బాటకు దిగారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత అధికారులు ప్రతిష్టాత్మకంగా ఇట్టి విషయానికి స్పందించి కళాశాలలో నెలకొన్న సమస్యలను తీర్చాలని విదాయర్థులు, వారి తల్లిదండ్రులు, తమ పిల్లల భవిష్యత్తుపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# హల్‌చల్ చేసిన అడవిదున్న మృతి

## మూడు రోజుల అటవీ అధికారుల రెస్క్యూ ఆపరేషన్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్:** గత కొన్ని రోజుల నుండి యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు గ్రామాలలో తిరుగుతున్న అడవిదున్న శుక్రవారం బోనగిరి మండల పరిధిలోని సిరివెనుకుంట గ్రామ శివారులో మృతి చెందినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. స్థానికులు, అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం రాత్రివేళలో మాదారం తండా, రావి పహాడ్, రావి పహాడ్ తండా, జంపల్లి, బొల్లేపల్లి సిరివెనీకుంటతో పాటు ఆయా గ్రామాలలో అడవి ప్రాంతాలలో సంతరించుకుంటూ ఉండగా గ్రామాల రైతులు మూడు రోజుల నుండి బయ ఆందోళనలతో కంటికి కునుకు లేకుండా కొన్ని రోజులుగా అటవీ శాఖ అధికారులకు ముప్పు తిప్పలు పెట్టినట్లు తెలిపారు. గ్రామాలలో రైతులు వ్యవసాయ పొలాలలో పనుల నిమిత్తం వెళ్లకుండా భయానక వాతావరణం నెలకొందని తెలిపారు. గ్రామస్తులు అడవి శాఖ అధికారులకు సమాచారం అందించగా అధికారులు హుటాహుటిన సిరివెనుకుంట సంఘటన స్థలాన్ని చేరుకొని సంతరిస్తున్న ఎట్టకేలకు అడవి దున్నకు మత్తు ఇంజక్షన్ ఇవ్వగా కొండలలో, గుట్టలలో పరుగులు తీస్తూ గుట్ట ఎక్కిన దున్న ప్రమాదవశాత్తు గుట్ట నుండి జారి పడగా ఆ దున్న మృతి చెందినట్లు జిల్లా అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అడవి జిల్లా అధికారిని పద్మజ రాణి మాట్లాడుతూ గత కొన్ని రోజుల అటవీ శాఖ అధికారులు 4 బ్యాచులుగా ఏర్పడి విడివిడిగా వెతికినట్లు ఆమె అన్నారు. కొన్ని రోజుల నుండి విపరీతంగా తిరిగి నీరసమై ఉండడంతో దున్న అనారోగ్యానికి గురైనట్లు తెలిపారు. దున్నను సర్వ ప్రయత్నాలు చేసి మత్తు ఇంజక్షన్ ఇవ్వగా ప్రమాదవశాత్తు ఆ గుట్టపై నుండి జారిపడి చనిపోయినట్టు తెలిపారు. అడవి అధికారుల ప్రయత్నం చివరకు విఫలమైందని తెలిపారు. ప్రభుత్వ సంబంధిత అధికారులు ప్రభుత్వ నియమా నిబంధనల ప్రకారం పంచనామ నిర్వహించినట్లు ఆమె తెలిపారు.



## పులిగుండాల ప్రాంతంలో చిరుతపులి సంచారం

**ప్రజాపక్షం/పెనుబల్లి :** మండల పరిధిలోని బ్రహ్మళ్లకుంట పంచాయతీ గ్రామ శివారు పరిధి లో చిరుతపులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. గ్రామం శివారులోని మామిడి తోటలో చిరుత పులి అడుగుజాడలు ఉన్నట్లు తోట కాపలాదారు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం తెలిపినట్లు తెలిసింది. దాంతో అటవీ అధికారులు, సిబ్బంది గ్రామాలలో టంకా వేయించారు. పులిగుండాల అటవీ ప్రాంతం పెనుబల్లి, కల్లూరు, జూలురుపాడు, భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలాల్లో విస్తరించి ఉంది. శుక్రవారం పెనుబల్లి తహశీల్దార్ ప్రతాప్, తల్లాడ రేంజ్ అధికారిని ఉమ, పెనుబల్లి ఎంపీడీఓ అన్నపూర్ణ, బీట్ అధికారి భరత్ బృందం ఆ ప్రాంతాన్ని పరిశీంచారు. చిరుత అడుగులను గుర్తించి నిర్ధారించారు.
పులిగుండాల ప్రాజెక్ట్ ప్రాంతానికి గుంపులుగా రావాలని కూలి పనులకు వచ్చే కూలీలు, రైతులు విడివిడిగా రావొద్దని ప్రజలకు తెలిపారు. రాత్రి సమయంలో అసలు బయటకు ఒంటరిగా రావొద్దని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు రేపు ఆదివారం మాత్రమే అనుమతి ఉందని అన్నారు. చిరుత పులి సంచరిస్తున్నట్లు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

# భారత్‌కు మరో 487మంది

## సమాచారమందించిన అమెరికా అధికారులు

**న్యూఢిల్లీ :** అమెరికాలో అనధికారికంగా నివసిస్తున్న మరో 487మందిని వెనుకకు పంపిస్తున్నట్టు అమెరికా అధికారులు భారత్‌కు తెలియజేశారు. వారిలో 298 మంది సమాచారం అందజేశారని, తక్కిన వారి వివరాలు అందవలసి ఉందని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రి తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోడి అమెరికా సందర్శన నేపథ్యంలో బుధవారం అమృతసర్‌కు చేరుకున్న భారత అక్రమ వలసదారుల గెంటివేతపై నిరసనలు వ్యక్తమయ్యాయి. భారతీయులను వెనుకకు పంపించడంపై నిరసన వ్యక్తం చేశారా అన్న ప్రశ్నకు స్పందిస్తూ అమెరికా అధికారులతో తాము నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, భారతీయులను అమానవీయంగా వెనుకకు పంపించడంపై నిరసన వ్యక్తం చేసినట్టు మిశ్రి తెలిపారు. బహిష్కరణకు గురైన భారతీయులను సి17 యుద్ధ విమానంలో సంకెళ్లతో తీసుకువచ్చారన్న అంశంపై వివరణ ఇస్తూ బుధవారం నాటి సంఘటన గత సంఘటనలకు భిన్నమైనదని, అక్రమ వలసదారులను గెంటివేయడం ఎప్పటి నుంచో జరుగుతున్న ప్రక్రియ అని, జాతీయ భద్రత అంశంతో కూడినదని, అందుకే మిలటరీ విమానంలో తరలించారన్నారు. వలసదారులు భారత్‌కు చేరిన తరువాత వారి వివరాలు పరిశీలించి దేశంలోకి అనుమతించడం జరుగుతుందని మిశ్రి తెలిపారు.

# ఎంఎల్‌సి ఎన్నికలకు భారీగా నామినేషన్లు

## గ్రాడ్యుయేట్‌కు 28, టీచర్స్ నామినేషన్లు 2 దాఖలు
## కరీంనగర్‌లో ఎమ్మెల్సీ నామినేషన్ల సందడి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సందడి ఊపందుకుంది. మంచి రోజు కావడంతో పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. కొందరు సాదాసీదాగా వచ్చి నామినేషన్లు దాఖలు చేయగా మరికొందరు భారీ ర్యాలీలు, డప్పు చప్పుళ్ల మధ్య తరలివచ్చారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల సందడి నెలకొంది. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో సోమవారం ఒక్కరోజు మాత్రమే నామినేషన్ గడువు ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఒక్క రోజే 30 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి 28 మంది, టీచర్స్‌కు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు గ్రాడ్యుయేట్ నామినేషన్లు మొత్తంగా 49, టీచర్స్ నామినేషన్లు మొత్తంగా 9 దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రముఖం గా శుక్రవారం కరీంనగర్‌కు చెందిన కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డా.వి.నరేందర్‌రెడ్డి తమ కుటుం బ సభ్యులతో కలిసివచ్చి ఒక సెట్ నామినేషన్ దా ఖలు చేశారు. సోమవారం భారీ ర్యాలీతో వచ్చి మరో సెట్ దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా రిజైన్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ శుక్రవారం భారీ ర్యాలీతో తరలివచ్చారు. ఎస్సారార్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు తన అనుచరగణం, అభిమానులు, పట్టభద్రులతో కలిసి తరలివచ్చి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పించారు. అదే విధంగా బిజెపి పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి సాదాసీదాగా పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. బిఆర్ఎస్ నుంచి టికెట్ ఆశిస్తున్న కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ సాదాసీదాగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి గాను పిఆర్‌టియు బలపరుస్తున్న వంగ మహేందర్‌రెడ్డి భారీగా ఉపాధ్యాయులతో కలిసి వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ఇది వరకే నామినేషన్లు వేసిన వారు సైతం కొంత మంది మరో సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు.




### పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి..

కరీంనగర్ మంకమ్మతోటకు చెందిన దయ్యాల ఓం ప్రకాష్, కరీంనగర్ క్రిస్టియన్ కాలనీకి చెందిన డాక్టర్ బండారి రాజ్‌కుమార్, కరీంనగర్ క్రిస్టియన్ కాలనీకి చెందిన వి.నరేందర్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం శ్రీరామ్ నగర్‌కు చెందిన డాక్టర్ రాపోల రాజు, కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన న్యాంతాబాద్ జనార్ధన్, సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం రామచంద్రాపూర్‌కు చెందిన చిన్నమైల్ అంజిరెడ్డి, కరీంనగర్ భగత్‌నగర్‌కు చెందిన సంకినేని మధుసూధన్‌రావు, ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడకు చెందిన బక్వాడ బాలాజీ, కరీంనగర్ విద్యానగర్‌కు చెందిన మెక్కు హేమలత పటేల్, జగిత్యాల జిల్లా కండ్లపల్లికి చెందిన చందా సాయికుమార్, మెదక్ జిల్లా తుఫ్రాన్‌కు చెందిన ఎనరెల్లి సాయిబాబా, కరీంనగర్ నగరానికి చెందిన సర్దార్ రవీందర్‌సింగ్, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం అమరావరంనకు చెందిన దార మనోహర్, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన లింగం కృష్ణ, హన్మకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన శనిగరపు రమేష్‌బాబు, పెద్దపల్లి జిలా మంథనికి మండలం పుట్టపాకకు చెందిన సిహెచ్ పురుషోత్తం, కరీంనగర్ నగరానికి చెందిన ప్రసన్న హరికృష్ణ, నిర్మల్ పట్టణానికి చెందిన ఎన్.శ్రీనివాస్, వరంగల్ జిల్లా కాజిపేట మండలం మడికొడకు చెందిన జంక్షన్ బక్క, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సోమగానికి నరేందర్, మంచిర్యాల జిల్లా గౌతమి నగర్‌కు చెందిన జావిద్ అహ్మద్, సూర్యాపేట జిల్లా గరిడెపల్లి మండలం కేతవారి గూడెంకు చెందిన బడే నరసయ్య, మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం మల్లంపేటకు చెందిన అంగ సంపత్ యాదవ్, కరీంనగర్ నగరానికి చెందిన మహమ్మద్ ముస్తాక్ అలీ, మెదక్ జిల్లా పల్లికోటానుకు చెందిన నాచారం చంద్రశేఖర్, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణానికి చెందిన మదనం గంగాధర్, సిద్దిపేటకు చెందిన దేవునూరు రవీందర్, మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన పెద్దపల్లి సత్యనారాయణలు పట్టభద్రుల ఎమ్మెల్సీకి నామినేషన్ దాఖలు చేశారు.

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి..

సిద్దపేటకు చెందిన వంగ మహేందర్‌రెడ్డి, నిజామాబాద్ నగరానికి చెందిన ముత్తారం నరసింహ స్వామిలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం నాటికి మొత్తం 58 మంది నామినేషన్లు వేశారు. ఇందులో 48 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ సమర్పించగా 9 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నామినేషన్ దాఖలు చేశారు.

## కల్యాణలక్ష్మి ,షాదీముబారక్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ మండల కేంద్రంలో శుక్ర వారం తహశీల్దార్ కార్యాలయంలో 168 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ / షాదీముబారక్ చెక్కులను మక్తల్ నియోజక శాసన సభ్యులు వాకటి శ్రీహరి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రభుత్వ అధికారులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక ఉర్సు



**ప్రజాపక్షం/కల్వకుర్తి:** మత సామరస్యానికి ఉర్సు ఉత్సవా ప్రతీక అని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఇఒ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉర్సు ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు. జీడిపల్లి హజ్రత్ ఖాజాబందె నవాబ్ ఉర్సుకు హాజరై దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని, అదేవిధంగా కల్వకుర్తి పట్టణకేంద్రంలోని బలరాంనగర్‌కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన మెట్రోన్యూస్‌శ్రీరామ్, షేక్ అహ్మద్ కుటుంబాలను పరామర్శించి వారి కుటుంబాలకు భరోసా నిస్తూ మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్‌నాయకులు ఎండి.ఆరీఫ్, ఎండి.ఇక్బాల్, ఎండి. శాబు ద్దీన్‌లతోపాటు స్థానిక నాయకులతోపాటు ఐక్యతఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీని కలిసిన బిఆర్‌ఎస్‌వి అధ్యక్షుడు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కవితని వాసంలో తెలంగాణజాగృతి నాగర్‌కర్నూల్ జిల్లానాయకుడు దారమోనిగణేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కవిత నాగర్‌కర్నూల్ జిల్లాలో జాగృతిని బలోపేతంచేయడంకోసం పలు సూచనలను, సలహాలను జాగృతిబృందంద్వారా చేయా ల్సిన కార్యక్రమాలను చర్చించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ రాష్ట్రనాయకులు కొమ్ముశ్రీనివాస్‌యాదవ్, ఆంజనేయులు, శేఖర్, సైదులు, నాగరాజు పాల్గొన్నారు.

## కళాశాలల ఉచిత అన్నదాన పథకం

**ప్రజాపక్షం/అచ్చంపేట :** సిబిఎంట్రస్టు ఆధ్వర్యంలో పేద జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితభోజనపథకం ఏర్పాటుచేస్తున్నట్లు సిబిఎంచైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో ఈ పథకం అమలుచేస్తున్నట్లు ఆమె తెలిపారు. వేసవికాలంలో విద్యార్థులు కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా బొడ్రాయి పునఃప్రతిష్ట

**ప్రజాపక్షం/అచ్చంపేట :** పట్టణంలోని పాతబజారులో బొడ్రాయి పునఃప్రతిష్టించామని మున్సిపల్‌చైర్మన్ గార్లపాటిశ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉదయం 6గంటలకు చౌరస్తాలోని బొడ్రాయిశంకుస్థాపన, 6.30గంటలకు పోచమ్మగుడిభూమిపూజ నిర్వహించామని తెలిపారు. ఈకార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు.

## 13న బిఆర్‌ఎస్ రైతుదీక్ష



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రంగారెడ్డిజిల్లా ఆమన్‌గల్ పట్టణంలో బిఆర్‌ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదిన నిర్వహించే రైతుదీక్షను విజయవంతంచేయాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కోరారు. శుక్రవారం మండలకేంద్రంలోని బిఆర్‌ఎస్‌నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మిషన్‌భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ పార్టీనేతలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓట్లు దండుకునేందుకు అమలుకు సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చినతర్వాత వాట న్నింటిని విస్మరించిన ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రజలుసిద్ధంగా ఉన్నారన్నారు. ఈదీక్షకు బిఆర్‌ఎస్‌శ్రేణులు , ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసమావేశంలో మాజీజడ్పిటిసి విజితరెడ్డి, మాజీఎంపిపి పుట్టరాంరెడ్డి, మాజీఉపసర్పంచ్ నిరంజన్, మధుసూదన్‌రెడ్డి, యాదగిరి, నర్సింహ్మ, రమేష్‌గౌడ్, ఆనంద్, ప్రసాద్, ప్రవీన్, శ్రీను, శేఖర్,వెంకటేష్ పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ ఆలయ కమిటీ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వనపర్తి :** కొత్తకోట పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ ఆలయాన్ని వనపర్తి ఎమె ్మల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలో ఇంత పెద్ద శ్రీకృష్ణ ఆలయం లేదని ఈ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన శ్రీకృష్ణ కమిటీ సభ్యులందరిని ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ నెల 13,14,15 తేదీల్లో నూతన ఆలయంలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమ సందర్భంగా నిర్వహించే ఉత్సవాలకు తమ వంతు ఆర్థిక సహాయం అందజేయగలరని కోరిన ఆలయ కమిటీ సభ్యుల అభ్యర్థనకు స్పందించిన ఎమ్మెల్యే రూ.2 లక్షల నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ అయ్య గారు, వెల్టూరు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, చీర్ల శేఖర్ , మణిగిల్ల తిరుపతిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పట్టణ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండలంలో 18 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీముబారక్ పథకాల మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. కొల్లా పూర్‌లో రాష్ట్రఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అందజేసినట్లు తహసీ ల్దార్ వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్ర మంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు గోదల బీరయ్య, మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు బొల్లారం సుదర్శన్ రెడ్డి, చక్ర వెంకటేష్ , వెంకట్రాజయ్య, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మద్దూరు**
మండలంలో కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి పర్యటించారు. మండలంలోని లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి , షాదీముబారక్ మొత్తం 108 చెక్కులను పంపిణీ చేశారు. కొత్తపల్లి మండలంలోని లబ్దిదారులకు 62 చెక్కులను పంపిణీ చేశారు. మాట్లాడుతూ కొడంగల్ అభివృద్ధి కోసం సిఎం ప్రత్యేక దృష్టి పెట్టారన్నాన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# అభయ హస్తం హామీలన్నీ అమలు చేస్తాం

### మంత్రి జూపల్లికృష్ణారావు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఆర్థిక అవరోధాలుఉన్న ప్రతి ఇంటి సౌభాగ్యాన్ని నింపాలనే మహా సంకల్పంతో రూపొందించిన అభయ హస్తం హామిలన్ని తూచతప్పకుండా అమలు చేస్తున్నామని పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలోని మండలరెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో కొల్లాపూర్, వీపనగండ్ల, కోడేరు, పెంట్లవెల్లి మండలాలకు చెందిన 250మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్‌ప్రజాప్రభుత్వం మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, రూ.500లకేగ్యాస్ సిలిండర్, ప్రతిపేద కుటుంబానికి 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.2లక్షలలోపు రైతు రుణాల మాఫీ, రైతుభరోసా, సన్నాలకు క్వింటాల్‌కు రూ.500లబోనస్, రూ.5లక్షలనుంచి రూ.10లక్షల వరకు రాజీవ్‌ఆరోగ్యశ్రీ ఉచిత వైద్యం పరిమితిపెంపు, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. గత బిఆర్‌ఎస్‌పాలనలో కెసిఆర్ ప్రభుత్వం రూ.8లక్షలకోట్ల అప్పుచే సిందని నెలకు రూ.6500వడ్డీ కడుతున్నామని ఇంత అప్పులభారం ఉన్న దశలవారీగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాల తనిఖీ



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** విద్యార్థులు పాఠాలను చదివి అవగాహన చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం మహబూబ్ నగర్ పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల న్యూటౌన్ ఎస్‌ఎస్‌ఎస్ గుట్టను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు బోధన, మెనూ అంశాలపై అడిగి తెలుసుకున్నారు. పరిసరాల ను వంట గది స్టోర్ రూం పరిశీలించి వంట గది, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల వెనుక ఉన్న పార్క్ నుండి పాఠశాల లోకి ప్రవేశించే దాని ని మూసివేయాలని మున్సిపాల్ కమిషనర్‌ను ఆదేశించారు. విద్యార్థిని, విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలు బోధన, వారి లక్ష్యాలు గురించి తెలుసుకున్నారు. 10 వ తరగతి ఇంగ్లీష్, ఉర్దూ మీడియం తరగతి గదులను సందర్శించి విద్యార్థినీ, విద్యార్థులతో మాట్లాడారు. ప్రత్యేక తరగతులు నిర్వహణ, సాయంత్రం స్నాక్స్ గురించి. భవిష్యతులో విద్యార్థులు తమ కెరీర్ గురించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు.

# విద్యార్థులు ఒత్తిడిని జయించాలి

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** విద్యార్థులు ఒత్తిడినిజయించి ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నా రు. శుక్రవారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని విద్యార్థులకు, యువ తలో ప్రేరణ ఇవ్వడానికి ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి రత్నగిరిఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలోని మినీస్టేడియంలోభారీగా సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ వి ద్యార్థులు పరీక్షల్లో నేర్చుకున్న విషయాలను సరై న విధంగా రాయలేకపోవడం ఒక ప్రధానసమస్యగా మారింది దీనికారణంగా వారు మానసికంగా ఒత్తిడికి లోనవుతూ కొన్నిసార్లు ఆత్మవిశ్వా సం కోల్పోయి తప్పుదారుల్లోవెళుతూ తమ జీవితాలను నాశనం చేసుకు ంటున్నారని జీవితంలో ప్రతి ఒక్కరికి అపజయం ఎదురవుతుందని దాం తో కృంగిపోవద్దనితిరిగిదానిపై పోరాడాలని విజ యం సాధించేవరకు కష్టపడాలని విద్యార్థులకు సూచిస్తూ ప్రణాళికబద్ధంగా చదువుకొని పరీక్షలుమంచిగారాసి ఉత్తీర్ణత సాధించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్ విద్యా ర్థులు పరీక్షల్లోఫెయిల్ అవ్వడంతో జీవితాన్ని కోల్పో యామనేభావనకు లోనవు తున్నారు ఇదిసరైన దృక్పథంకాదని, ఐఎఎస్, ఐపిఎస్ లాంటి ఉన్నత స్థాయికి చేరినవారు ఏదో ఒక దశలో అపజయాన్ని ఎదుర్కొన్న వారేనని అపజయం అనేది విజ యానికి మొదటిమెట్టుగా భావించి మరింత పట్టు దలతో ముందుకు సాగాలని సూచించారు. విద్యా ర్థులందరూ ఇష్టపడిచదివి తల్లిదండ్రులకు సమా జానికి మంచిపేరుతేవాలని జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని తెలియజేశారు. కార్యక్ర మంలో డిఇఓ రమేష్ కుమార్, డిఐఓ వెంకట రమణ, ఆర్‌డిఓ భన్సీలాల్, తహసీల్దార్ విష్ణు వర్ధన్ రావు, వివిధపాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మహిళలకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు సి.ఆర్.పి వ్యూహం కార్యక్రమం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుండి ప్రారంభం చేస్తున్నట్లు రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఎస్‌ఇఆర్‌పి) సిఇఒ దివ్య దేవ రాజన్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా సమీకృతి జిల్లా కార్యాలయంలో సముదాయం (ఐడిఒసి) లో సంఘాల బలోపేతంకు సిఆర్‌పి వ్యూహం కార్యక్రయం ప్రారంభ సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఆర్‌పి త్రిపుర, గోవా, ఇతర రాష్ట్రాల్లో మహిళలకు సంఘాల ఏర్పాటుపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో పాల మూరు. మహా సమాఖ్య, స్తంభాద్రి మహా సమాఖ్య,ఓరుగలు, మహబూబ్‌నగర్, గద్వాల్, నారాయణ పేట, నాగర్ కర్నూల్, వికారాబాద్, జిల్లాల్లో మహిళా సంఘాల ఏర్పాటు, ప్రోత్సాహం, బలోపేతం చేయటానికి జిల్లాలో గ్రామాలకు వెళ్లి అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర ఐటి పరిశ్రమల ఏర్పా టు, జిడిపిలో ముందు స్థానంలో ఉన్నప్పటికీ మహిళలు, పిల్లల్లో పోషకాహార లోపం, ఎత్తు, బరువు తక్కువ ఉన్న పిల్లలు ఉన్నారని, స్వయం సహాయక సంఘాలలో 47 లక్షల మంది మహిళలు రాష్ట్రంలో సభ్యులుగా ఉన్నారన్నారు. మహిళా సంఘాలలో మహిళలు సంఘటితంగా గ్రూప్‌గా ఉంటే ఏదైనా సాధించివచ్చన్నారు. సమాజంలో సామాజిక సమస్యలు పరిష్కారం చేయవచ్చన్నారు. మహిళలపై హింస వంటి సమస్యలు బాధిత మహిళలకు తోడుగా మహిళలు ఐక్యంగా ఉంటే నే ఎదుర్కొవచ్చన్నారు. సామాజిక సమస్యలు గురించి చర్చించి ముందుకు వెళ్లాలని, స్త్రీ నిధి, పబ్లిక్, సెక్టార్ బ్యాంక్ ద్వారా రుణం అందించాలని, గ్రామాల్లో 20 శాతం మహిళలు సంఘాల బాటపట్టాలన్నారు. నిరుపేదలు, ఒంటరి, దివ్యాంగ మహిళలు, ఎస్‌సి, ఎస్‌టి మ హిళలను అందరినీ గ్రూప్‌లో చేర్పించాలన్నారు. ఇన్స్యూరెన్స్ ప్రమాద బీమాల గురించి పొదుపు గురించి, పంచ సూత్రాలుపై అవగాహన కలిగించాలన్నారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ సంఘాల బలోపేతం సిఆర్‌పి వ్యూహం కార్యక్రమం మహబూబ్‌నగర్ జిల్లా నుండి ప్రారంభం చేయడం సంతోషంగా ఉందని,పేదరిక నిర్మూలనకు కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎస్‌ఈఆర్‌పి (ఐబి) డైరెక్టర్ నవీన్, మహబూబ్‌నగర్ డిఆర్‌డిఒ నర్సిం హులు, గద్వాల డిఆర్‌డిఒ నర్సింగరావు, వికారాబాద్, నారాయణపేట డిఆర్‌డిఒ మొగిలప్ప, డిఆర్‌డిఆర్‌లు అదనపు పిడిలు, ఎపిఎం తదితరులు పాల్గొన్నారు.

# ఆరాధ్యమృతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే బాధ్యత



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** గురుకుల పాఠశాలలో ఉరివేసుకొని ఆత్మహత్యచేసుకున్న ఆరాధ్యమృతికి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని బిఆర్‌ఎస్‌నేత, మాజీ ఐపిఎస్‌ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం మండలపరిధిలోని చొక్కన్నపల్లిలో ఆరాధ్యమృతదేహానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మిషన్‌భగీరథ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పలవెంకటేష్, ఫుడ్‌కార్పొరేషన్‌చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిలతో పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులుండే గురుకులాల్లో మానసిక రుగ్మతలను పెంపొందించేందుకు కెసిఆర్ నియమిస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైనతర్వాత మానసిక నిపుణులను తొలగించారని కెసిఆర్ చేపట్టిన ఆనవాళ్లను లేకుండాచేయడమే రేవంత్‌రెడ్డిపనిగా పెట్టుకున్నాడన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 420రోజులలో ఇప్పటివరకు 56 మంది గురుకుల విద్యార్థులు చనిపోయారని విద్యార్థుల మృతికి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేజైపాల్‌యాదవ్ డిమాండ్ చేశారు. అంతకుముందు ఆర్‌ఎస్‌ప్రవీణ్‌కుమార్ ఆరాధ్య కుటుంబసభ్యులకు రూ.51వేల చెక్‌ను అందజేశారు.

**ఘటనపై రాష్ట్రప్రభుత్వానికి నివేదిక ఇస్తా :**

ఆరాధ్యమృతిచెందిన ఘటనపై రాష్ట్రప్రభుత్వానికి త్వరలో నివేదిక అందజేస్తానని ఫుడ్‌కమీషన్ చైర్మన్ గోలిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆరాధ్య మృ తిపై పలు అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బాలిక మృతిపై ఘటనస్థలాన్ని పరిశీలించి పూర్తిసమాచారంతో రాష్ట్రప్రభుత్వానికి త్వరలో నివేదిస్తానని తెలిపారు. మాజీ జెడ్‌పిటిసిలు విజితారెడ్డి, రాములమ్మ, మాజీ ఎంపిపి పుట్టరాంరెడ్డి, మాజీ ఉప సర్పంచులు జంగిలి నిరంజన్, రాజేందర్‌నాయక్, పురుగులనర్సింహ్మ ముదిరాజ్,డీలర్లసంఘం అధ్యక్షుడు తాండ్రజంగయ్య, చల్ల మధుసూదన్‌రెడ్డి, జంగిలి ఆనంద్, పోలే అశోక్, జోగురవికుమార్,జంగిలి యాదగిరి, సామేలు, తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

### గిరిజన సంఘం నాయకులు



**ప్రజాపక్షం/జడ్చర్ల :** సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి అయిన ఫిబ్రవరి 15వ తేదీన జాతీయ సెలవు దినంగా ప్రకటించి, ప్రభుత్వం అధికారికంగా జయంతిని నిర్వహిం చాలని నిగిరిజన సంఘం నాయకులు తెలిపారు. వారు మాట్లాడుతూ దేశావ్యాప్తంగా ఉన్న బంజారాలు మాట్లాడే గోర్ బొలి భాష ను రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్డ్ చేర్చాలని, అధికారిక భాషగా గుర్తించాలని డిమాండు చేస్తూ చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్త్యావత్ రమేష్ నాయక్, లోకేష్ నాయక్, జడ్చర్ల 9వ వార్డు కౌన్సిలర్ చైతన్య, చౌహాన్, గోపాల్ నాయక్, రాంచందర్ నాయక్, రాజు నాయక్, వెంకటేశ్, ఉన్నారు.

## జీతాలు చెల్లించకుంటే ధర్నా చేపడతాం



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** గత ఆరు నెలలుగా పెళ్లాం పిల్లలతో పస్తులు ఉంటున్నామని, వెంటనే జీతాలు చెల్లించి ఆదుకోవాలని లేకుంటే ఆసుపత్రి ఎదుట ధర్నా చేపడతాం అని వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రం విధులు నిర్వహిస్తున్న కార్మికులు హెచ్చరించారు. గత ఆరు నెలలుగా జీతాలు లేక పెళ్లాం పిల్లలతో పస్తులు ఉంటున్నామని పలుమార్లు పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవటం లేదని ఇలా ఉంటే తమ పరిస్థితి ఏమిటని కార్మికులు ప్రశ్నించారు. మూడు రోజుల్లోగా వేతనాలు చెల్లించకుంటే ఆసుపత్రి ఎదుట ధర్నా చేపడతామని సిహెచ్‌సి వైద్యాధికారి ప్రియాంకకు ఆసుపత్రి కార్మికులు శానిటేషన్ , పేషెంట్ కేర్ , సెక్యూరిటీ అండ్ సూపర్వైజర్ వినతి పత్రం అందజేశారు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి ఆరు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో ఆసుపత్రి కార్మికులు దయాకర్ , శైలజ, అలివేల, పార్వతమ్మ, బాలేశ్వరమ్మ, ప్రసాద్ కుమార్ ఉన్నారు.

## మోటివేషన్ క్లాస్‌లకు విద్యార్థులు



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని హై స్కూ ల్‌లోని పదవ తరగతి విద్యార్థుల కోసం మోటివేషన్ తరగతులను ఏర్పాటు చేశారు. కల్వరాల జిల్లా పరిషత్ పాఠశాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం తరలివెళ్లారు. మోటివేషన్ క్లాస్ ద్వారా విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టడం , నైపుణ్యంగా ఎలా రాయటం, చదివే పద్ధతి ఏ రకంగా ఉండాలని, పరీక్షల సమయంలో ఏరకంగా ఉండాలిలని, తల్లిదండ్రులు ఏవిధంగా సహకరించాలని తదితర అంశాలపై రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. మోటివేషన్ క్లాస్ కోసం కల్వరాల పాఠశాల నుండి 28 మంది విద్యార్థులు బయలుదేరిన వాహనాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజవర్ధనాచారి ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, శఠరీనివాసులు ,కళావతమ్మ, జితేందర్ , బక్కన్న , మధుసూదన్ గుప్తా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విద్యాభిమానులు వెంకట రాజయ్య, రమేష్ ,ఆ ంజనేయులు, స్వామి, పాల్గొన్నారు.



## జాతీయ నులిపురుగుల దినోత్సవం

**ప్రజాపక్షం/జడ్చర్ల :** చిన్న పిల్లలు అందరికి అన్ని ఫ్రి స్కూల్ పాఠశాల పిల్లలలో ఆరోగ్య పోషకస్థితి, విద్యకు ప్రాధాన్యం, జీవన నాణ్యత మెరుగుపరచడానికి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్మూలన చేయడమే లక్ష్యంగా ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జడ్చర్ల మున్సి పాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, కమి షనర్ లక్ష్మారెడ్డి అధ్యక్షతన జడ్చర్ల పిహెచ్‌సి వైద్యులు డా.మనుప్రియ, ఆధ్వర్యంలో నులిపురుగుల నిర్మూలన గురించి చర్చించారు. పిల్లల ఎదుగుదల పైన నులిపురుగుల ప్రభావం వాటి నివారణపైన మండల టాస్క్ ఫోర్సు సమావేశం నిర్వ హించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఆల్బెండజోల్ 400 యంజి టాబ్లెట్‌ను పిల్లలకు ఇవ్వానున్నట్లు, 1 నుండి 2 సంవత్సరాల పిల్లలకు సగం టాబ్లెట్ 2 నుండి 19 సంవత్సరాల పిల్లలకు మొత్తం టాబ్లెట్‌ను అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం జడ్చర్ల మండల పరిధిలోని అన్ని స్కూల్ హెడ్‌మాస్టర్లకు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా.మనుప్రియ, డా.సునీల్, కౌన్సిలర్స్ , టీచర్స్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పాలనలో విధ్వంసానికి గురవుతున్న విద్యారంగం




**ప్రజాపక్షం / పెబ్బేరు:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ పెబ్బేరు మండల మహసభను మండల కేంద్రంలోని స్వర్ణ భారతి కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ మహసభకు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం. ఆది హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ ఫీజురీయింబర్స్ మెంట్స్ విడుదల చేయాలని, విద్యారంగంపై ప్రభుత్వ శ్రద్ధ పెట్టాలని అన్నారు. విద్యా కమిషన్ ప్రైవేట్ ,కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజులను పెంచాలని చేసిన నిర్ణయం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం విద్యా అభివృద్ధికి రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో మరిన్ని నిధులు కేటాయించి సమస్యలు పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశం, రాష్ట్రంలో అనేక సవాళ్లు విద్యారంగం ఎదుర్కొంటుందని తెలిపారు. కేంద్రం ఉన్నత విద్యలో తీసుకొని రావాలని అనుకుంటున్న యూజిసి మార్గదర్శకాలు తక్షణమే ఉపసంహరణ చేయాలని, ఇప్పటికే కేంద్ర బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించి విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ కోసం బాటలు వేసింది. బీజేపీ పాలనలో మరింత విధ్వంసానికి విద్యారంగం గురవుతుంది. బీజేపీ విద్యా వ్యతిరేక సంస్కరణలపై విద్యార్థులు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహసభలలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షులు లక్ష్మణ్ , ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మహేష్ ,కేశవర్ధన్ , జ్యోతి, నవ్య, స్పందన , శైలజ తదితరులు పాల్గొన్నారు.


## కాలనీలలో పనులు పూర్తి

### మున్సిపల్ చైర్ పర్సన్ పుష్పలత



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల మున్సిపాలిటీ 12వ వార్డులో చైర్ పర్సన్ కోనేటి పుష్పలత స్థానిక కౌన్సిలర్ రఘురాం గౌడ్‌తో కలిసి ము రికి కాలువల నిర్మా ణ ం, శుభ్రత, పారి శుద్ధ్య పనులను పరిశీలిం చారు. వార్డులో అవసరమైన డ్రైనేజీ పనులు, సిసి రోడ్డు నిర్మాణం పను లను త్వరలోనే చేపడతామని చైర్ పర్సన్ తెలిపారు. వార్డులో ఉన్న ఫ్రీడమ్ పార్కులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, కాల నీలో పెరిగిన ముళ్ల కంప చెట్లను వెంటనే తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. కౌన్సిలర్ రఘురాం గౌడ్‌తో పాటు రాజుచారి, మహేందర్, ఆంజ నేయులు, శేఖర్‌రెడ్డి, విజయ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనకు విరాళాల సేకరణ పత్రాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ మక్తల్ :** స్వామి వివేకానంద విగ్రహ ప్రతిష్టాపనకు విరాళాల సేకరణ పత్రాల ఆవిష్కరణ ఆవిష్కరించినట్లు నేరగడం మఠం సందరిశంచి శ్రీ సిద్ధలింగేశ్వర స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్తల్ కేంద్రములో వివేకానంద విగ్రహం స్థాపించడం అందరికీ ఆదర్శనీయమని, విగ్రహ ప్రతిష్ఠకు తనవంతుగా ఆర్థిక సహకారం అందించి ప్రజలందరినీ భాగస్వామ్యం చేయాలని స్వామిజీ కోరినట్లు ఎబివిపి నగర కార్యదర్శి వంశీ తెలిపారు. తెలిపారు. మక్తల్ పట్టణ పరిసర గ్రామ ప్రజలు యువ కులు విద్యార్థులందరి భాగ స్వామ్యంతోనే విగ్రహ ఏర్పాటు జరగాలనే భావనతో అందరి సహకారంతోనే విగ్రహ ఏర్పాటు చేయాలని సంఘ పరివార సభ్యులందరూ కలిసి నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం సంఘ పరివార క్షేత్రాల సభ్యులు అంతా కలిసి నేరగడం మఠం సందరిశంచి శ్రీ సిద్ధలింగేశ్వర స్వామి చేతుల మీదుగా వివేకానంత విగ్రహ ప్రతిష్టాపన విరాళల సేకరణ పత్రాలు విడుదల చేశారు. అనంతరం ఎబివిపి సభ్యులు స్వామి వారిని సత్కరించి వివేకానంద చరిత్ర పుస్తకాలను బహుకరించారు. కార్యక్రమంలో సంఘ పరివార క్షేత్రాల సభ్యుతు కావలి వెంకటేష్, చంద్ర శేఖర్, అంజనేయ రెడ్డి, కుర్మయ్య, కాంత్ కుమార్, వినయ్, శరణ్, సందీప్, పాల్గొన్నారు.

# ఫోకస్ సైన్స్



# ప్రళయాలు ఎన్ని?


ప్రళయం అంటే వినాశనం. సముద్రాలు ఉప్పొంగి, భూమి మొత్తాన్ని ఆక్రమించడం. సమస్త జీవజాలాన్ని నామరూపాలు లేకుండా చేయడం. ఇంతకు ముందు ఎప్పుడైనా ప్రళయాలు వచ్చాయా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం అనుకున్నంత సులభం కాదు. విశ్వం ఎలా ఏర్పడిందో ఇంకా నిర్ధారించలేకపోతున్నాం. 'బిగ్ బ్యాంగ్' ద్వారా విశ్వసృష్టి జరిగిందనే సిద్ధాంతాన్ని ఇటీవల కొన్ని అధ్యయనాలు సవాలు చేస్తున్నాయి. ఎంత లోతుగా పరిశీలిస్తే, అన్ని చిక్కుముడులు తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రళయాలు సంభవించాయా? లేదా? అని తెలుసుకోవడం కష్టమే. అయితే, పలు ప్రాంతాల్లో కనగొన్న శిలాజాలాలు, ఇతరత్రా ఆనవాళ్లను పరిశీలించి, ఇప్పటి వరకూ ఐదు పర్యాయాలు ప్రళయాలు సంభవించినట్టు దాదాపుగా ఒక నిర్ధారణకు వచ్చారు. మొదటి ప్రళయం సుమారు 44 కోట్ల సంవత్సరాల క్రితం, ఓర్డోవిసియన్ యుగం చివరిలో సంభవించింది. అప్పుడు భూగోళం మొత్తం మంచులో గడ్డకట్టుకుపోయింది. ఫలితంగా భూమిపైన, సముద్రాల్లోని జీవజాతులన్నీ అంతరించిపోయాయి. రెండో ప్రళయం 37.4 కోట్ల సంవత్సరాల క్రితం, డివోనియన్ యుగం చివరిలో చోటు చేసుకుంది. 75 శాతం జీవులు నశించిపోయాయి. మూడో ప్రళయం 25 కోట్ల సంవత్సరాల క్రితం, పెర్మియన్ యుగంలో జరిగింది. అన్ని ప్రళయాల్లోకీ ఇదే అతి పెద్దని, భయంకరమైనది. దీని ప్రభావంతో 95 శాతం జీవులు అంతరించిపోయాయి. నాలుగో ప్రళయం 20 కోట్ల సంవత్సరాల క్రితం జురాసిక్ యుగంలో జరిగింది. 80 శాతం జీవజాతులు నశించాయి. చివరిదైన ఐదో ప్రళయం 14.5 కోట్ల సంవత్సరాల క్రితం, క్రిటేపియస్ యుగంలో చోటు చేసుకుంది. మెక్సికో వద్ద భూమిని ఓ భారీ గ్రహశకలం ఢీకొట్టింది. దీని ఫలితంగా భారత్‌లోని దక్కన్ పీఠభూమిలో అగ్నిపర్వతాలు పేలిపోయాయి. భూమిపై 75 శాతం జీవులు అంతరించాయి. ప్రస్తుతం మనిషి తన విధ్వంసాన్ని తానే కొనితెచ్చుకుంటున్నాడు. పర్యావరణ పరిరక్షణను మరచి, ప్రకృతిని అపహాస్యం చేస్తున్నాడు. మితిమీరిన స్వార్థం, అదుపులేని యుద్ధాలు మనల్ని మరో ప్రళయం వైపు నడిపిస్తున్నాయన్నది నిజం. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం 1500 సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ వెన్నెముక ఉన్న జీవుల్లోనే 332 జాతులు అంతరించిపోయాయట.మరో అధ్యయనం ప్రకారం, ప్రస్తుతం 32 శాతం జాతుల జీవులు అంతరించే ప్రమాదంలో ఉన్నాయి. ప్రస్తుతం ఒక్క ఆస్ట్రేలియాలోనే 300 జంతుజాతులు, 1000 వృక్ష జాతులు కనుమరుగైపోయే పరిస్థితిలో ఉన్నాయి. ఆరో ప్రళయానికి వీటి సూచికలుగా భావించాలా? ఇప్పట్లో ప్రమాదం ఏమీ లేకపోయవచ్చు. కానీ, జాగ్రత్తలు తీసుకోకపోతే, భవిష్యత్ తరాలకు అగ్ని గోళమే మిగులుతుంది.




# సూక్ష్మాతిసూక్ష్మ కదలికల గుర్తింపు

ఒక కదలికను మన మెదడు ఎంత వేగంగా కనిపెట్టగలుగుతుందనే ప్రశ్నకు సరైన సమాధానం లేదు. అయితే, సెకనుకు 30 నుంచి 60 ఫ్రేమ్‌లు మాత్రమే కంటి ద్వారా మెదడుకు చేరుతాయి. అంతకంటే వేగం గా ఉన్న కదలికలను కళ్లు కనిపెట్టలేవు. ఈ సిద్ధాంత మే సినిమాలకు మూలం. సెకనులో కొన్ని లక్షల వం తు సమయంలో జరిగే అణువులు...పరమాణువుల కదలికలను శాస్త్రవేత్తలు కనిపెట్టగలిగారు. అయి తే, రసాయన శాస్త్రాన్ని నడిపించే ఎలక్ట్రాన్ల వేగవంతమైన కదలికలను చూసేందుకు శాస్త్రవేత్తలు కొత్త విధానాన్ని కనిపెట్టారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న స్టా న్‌ఫోర్డ్ లైనియర్ యాక్సిలరేటర్ సెంటర్ (ఎస్‌ఎల్‌ఎసి లేదా స్లాక్) పేరుతో ప్రారంభమైన నేషనల్ యాక్సిలరేటర్ లాబొరేటరీ (ఎన్‌ఎఎల్) శాస్త్రవేత్తలు ఎక్స్‌రే లేసర్ ఎన్‌హాన్స్‌డ్ అట్టోసెకండ్ పల్స్ జేరేషన్ (ఎక్స్‌ఎల్‌ఇఎఆర్)ను అభివృద్ధి చేశారు. సెకండ్‌లో బిలియన్ వంతులోని బిలియన్ వంతును అట్టోసెకండ్‌గా పేర్కొంటా రు. ఎక్స్‌ఎల్‌ఇఎఆర్ విధా నం ద్వారా 280 అట్టోసెకం డ్ల వేగాన్ని కూడా చూడవచ్చని శాస్త్రవేత్తలు ప్రకటించా రు. రసాయన శాస్త్రంలో ఇది అత్యంత కీలకమైన పరిణామంగా పేర్కోవాలి. అత్యంత శక్తివంతమైన ఎక్స్‌రే లేజర్ పేలుళ్లతో ఎలక్ట్రాన్‌ల కదలికను గమనించే విధానం కేవలం రసాయన శాస్త్రంలోనేగాక, ఇతర రంగాల్లోనూ విప్లవాత్మక మార్పులు తెస్తుందని అంటున్నా రు. పరమాణు కేంద్రకాల కదలికలను ఖచ్చితంగా గమనించే విధానాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నప్పటికీ, రసాయన ప్రతిచర్యలను నడిపించే అత్యంత వేగవంతమైన ఎలక్ట్రాన్ల కదలికలు అస్పష్టంగా ఉం డే వి. ఎక్సఎల్‌ఇఎఆర్ విధానంలో అవి స్పష్టంగా కనిపిస్తున్నట్టు పరిశోధకులు అంటున్నారు. ఈ సిద్ధాంతాన్ని వృక్షశాస్త్రం, జంతుశాస్త్రంలోనూ ఉపయోగపడుతుందని, ఉదాహరణకు కిరణజన్య సంయోగక్రియ సమయం లో కాంతిని శోషించడం, తక్షణమే ఎలక్ట్రాన్లను నెట్టివేయడం వంటి చర్యలను పరిశీలించి, పరీక్షించడానికి వీలుంటుందని చెప్తున్నారు. మొత్తానికి నేషనల్ యాక్సిలరేటర్ లాబొరేటరీ శాస్త్రవేత్తలు వేగానికి కూడా కళ్లెం వేయడా నికి ప్రయత్నిస్తున్నారు. వీరి పరిశోధనలు ఇతరత్రా రంగాల్లో ఏ విధంగా ఉపయోగపడతాయో చూడాలి.

## దటీజ్ ఐన్‌స్టీన్








అందుబాటులో ఉన్న సమాచారం, చారిత్రక ఆధారాలను పరిశీలిస్తే ఎంతో మంది శాస్త్రవేత్తలు కనిపిస్తారు. అయితే, మానవ జీవితాలను, శాస్త్ర విధానాలు... సిద్ధాంతాలను విపరీతంగా ప్రభావితం చేసిన వారు కొందరే. అలాంటి అతికొద్ది మందిలో ఐన్‌స్టీన్‌ది మొదటి స్థానం అనడంలో అనుమానం లేదు. ఐన్‌స్టీన్ ఐక్యూ స్థాయి చాలా ఎక్కువ అని అతని మరణానంతరం మెదడును పరీక్షించిన థామస్ స్టోల్జ్ హార్వే స్పష్టం చేశాడు. ఐన్‌స్టీన్ మృతి చెందిన తర్వాత, తన లాబ్‌లో అతని మెదడును వెలికితీసిన హార్వే, అది 1230 గ్రాముల బరువు ఉన్నట్టు ప్రకటించాడు. దానిని 240 ముక్కలుగా కోసి, మానవ మెదడుపై పరిశోధనలు చేస్తున్న సంస్థలు, వ్యక్తులకు పంపినట్టు చెప్తారు. మెదడును వేరు చేసి, ప్రయోగాలు నిర్వహించేందుకు ఐన్‌స్టీన్ నుంచి ముందస్తు అనుమతి తీసుకున్నారా? లేదా? అనే విషయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కానీ, ఐన్‌స్టీన్ మేధస్సు గురించి ఎవరికీ, ఎలాంటి అనుమానం లేదు. అందుకే ఆయనకు 1922లో నోబెల్ ప్రైజ్ వచ్చింది. సాధారణంగా ఈ నోబెల్ రావడం కాదు... ఆ అవార్డుకు నామినేట్ కావడం కూడా అత్యంత ప్రతిష్టాత్మకమైదిగా భావిస్తారు. వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభావంతులను ఎంపిక చేసి నోబెల్‌ను బహూకరిస్తారు కాబట్టే దీనికి అంత క్రేజీ. అయితే, ఐన్‌స్టీన్ తనకు వచ్చిన నోబెల్‌ను అసలు పట్టించుకునేవాడే కాదు. తాను రోజూ రాసుకునే డైరీలో కూడా నోబెల్‌ను ప్రస్తావించలేదు. తనకు నోబెల్ వచ్చిన విషయాన్ని ఆయన ఎక్కడా, ఎవరితోనూ చెప్పేవాడు కాదు. అసలు ఆ ప్రస్తావనను తీసుకురావడం కూడా ఆయనకు ఇష్టం లేదు. మిత్రులకు రాసే ఉత్తరాలోనూ ఐన్‌స్టీన్ ఈ అత్యుత్తమ అవార్డు గురించి ఒక్క ముక్క కూడా రాయలేదు. అతనికి అవార్డుల కంటే పరిశోధనలే ఎక్కువ. దటీజ్ ఐన్‌స్టీన్.

# అణు రియాక్టర్లలో కొత్త విధానాలు!



అణు రియాక్టర్‌ల వినియోగ సమయంలో అణు అనుబంధ (సబ్ అటామిక్) కణాలను గుర్తించడానికి సరికొత్త విధానం అందుబాటులోకి రానుంది. ఫలితంగా అణు రియాక్టర్ల సాంకేతికతలో కొత్త విధానాలు అమల్లోకి రావడం ఖాయంగా కనిపిస్తున్నది. స్విట్జర్లాండ్‌లోని లీబ్‌స్టాట్ వద్దగల న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌లో ఈ ఆవిష్కరం జరిగింది. సబ్ అటామిక్ కణాలను గుర్తించే కాంపాక్ట్ విధానాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇప్పటి వరకూ అనుసరిస్తున్న సాంప్రదాయ భౌతిక సిద్ధాంతాల ఆధారంగా ఈ గుర్తింపు కోసం భారీగా పదర్థాలు అవసరమవుతాయి. కానీ, శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేసిన కాంపాక్ట్ విధానంలో కేవలం మూడు కిలోల పదార్థం సరిపోతుంది. ఫలితంగా అత్యంత సంక్లిష్టమైన, సవాళ్లతో కూడుకున్న అణు అనుంబంధ కణాల గుర్తింపు సులభతరమవుతుంది. ప్రస్తుతం ఈ విధానంపై ప్రయోగాలు జరుగుతున్నాయని, పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిన తర్వాత, నూతన సాంకేతికత అందుబాటులోకి వస్తుందని డ్యూక్ యూనివర్శిటీ భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు, శాస్త్రవేత్త ప్రొఫెసర్ కేట్ స్కోల్‌బెర్గ్ ప్రకటించారు. ఈ అంశంపై లోతైన అధ్యయనం చేస్తున్న ఆమె, అణు రియాక్టర్ల వినియోగంలో విప్లవాత్మక మార్పులకు బీజం పడిందని పేర్కొన్నారు.

# మెరుపుల నుంచి విద్యుత్ సాధ్యమా?



మెరుపులు... ఉరుములు అనేవి మేఘాల మధ్య జరిగే విద్యుత్ పరిణామం. రెండు వేర్వేరు ధ్రువత్వం గల విద్యుదావేశాలతో ఏర్ప డే పరిణామం. ఒక మేఘానికి మరో మేఘం దగ్గరలో లేనప్పు డు, మెరుపుగా పేర్కొనే విద్యుదావేశం అనేది ధ్రువత్వంతో సం బంధం లేకుండా, స్థిర విద్యుత్తు ను భూమివైపు ప్రసరింప చేస్తుం ది. కొన్ని లక్షల ఓట్ల శక్తిగల విద్యుత్తు భూమిపై చెట్లు లేదా భవనాలు సాయంతో భూమిలోకి చొచ్చుకుపోతుంది. దీనినే పిడుగు అంటారు. మెరుపులు, పిడుగులు లక్షలాది ఓట్ల శక్తిని ప్రసరింప చేయడం నిజం. అయితే, అది క్షణకాలం కూడా ఉండదు. రెప్పపాటులో జరిగే ఈ ప్రక్రియను ఉపయోగించుకొని, అంతకంటే వేగంగా వాటి నుంచి విద్యుత్‌ను సంగ్రహించి, నిలువ చేసుకునే సామర్థ్యంగలసాధనాలు ప్రస్తుతానికి లేవు. భవిష్యత్తులో వస్తాయేమో చూడాలి.

## పేదలకు, విలేకర్లకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

### హనుమకొండజిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి మద్దెల ఎల్లేస్



ప్రజాపక్షం/ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల విలేకరు లకు ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇవ్వాలని హనుమకొండ జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి మద్దెల ఎల్లేస్ అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో ధర్మసా గర్ సిపిఐ గ్రామశాఖ సమావేశం శుక్రవారం గ్రామ కార్యదర్శి చిలుక బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశనికి సిపిఐ జిల్లా కార్యదర్శి మద్దెల ఎల్లేస్ హాజరై మాట్లాడుతూ, యూట్యూబ్‌లో సిపిఐ పార్టీకి సంబధం లేని వ్యక్తి విలేకరులు ప్రభుత్వ భూమి ఆక్రమించారని మాట్లాడుతున్నారని ఈ వార్తలను సిపిఐ పార్టీ పూర్తిగా ఖండిస్తుందన్నారు. మండల విలేకరులకు, పెదలకు ప్రభుత్వ ఇండ్ల స్థలలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇంటి స్థలాల పట్టాలు ప్రభుత్వం పట్టాలు ఇచేంత వరకు సిపిఐ పోరాటలు కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ సిపిఐ మండల కార్యదర్శి కొట్టే వేంకటేశ్, చిలుక దేవదాస్, బట్టు మల్లయ్య, వల్లేపు సార య్య, కొమురయ్య, వెంకటయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'సేవ్ సింగరేణి' కోసం ఉద్యమిస్తాం

### యాజమాన్యం, ప్రభుత్వంపై మండిపడ్డ సీతారామయ్య, రాజ్ కుమార్



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సింగరేణి లో కార్మికుల హక్కుల కోసం, సంస్థ రక్షణ కోసం సింగరేణి వ్యాప్తంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో త్వరలో సేవ్ సింగరేణి పేరుతో ఉద్యమాలు చేస్తామని గుర్తింపు సంఘం ఎఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతా రామయ్య, కొరిమి రాజ్ కుమార్‌లు పేర్కొన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన ప్రెస్ మీట్ లో వారు పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో ఏడవసారి గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి సం వత్సరం గడిచినా, యాజమాన్యం ఇప్పటి వరకు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కాలాను గుణంగా జరిగే స్ట్రక్చర్, జేసిసి, సిఅండ్ఎండి లెవెల్ మీటింగ్‌లు జరపడం లో యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని వారు ఆరోపించారు. ఏఐటియుసి గెలిచిన తరువాత ముఖ్యమైన కార్మికుల సమస్యల పరి ష్కారం కోసం సిఅండ్ఎండి లెవెల్ మీటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, చేయకుండా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పేరుతో యాజమాన్యం సమావేశాలు ఏర్పాటు చేయకుం డా కాలయాపన చేస్తుంద న్నారు. ప్రభుత్వం మొన్న జరిపిన అసెంబ్లీ సమావేశాలకు లేని ఎన్నికల కోడ్ సింగరేణిలో జరిగే సమావేశాలకు ఎక్కడిదని వారు ప్రశ్నించారు. సింగరేణి లో గత పది సంవత్సరాలుగా కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని, గత గుర్తింపు సంఘం టిబిజికేఎస్, బిఆర్ ఎస్ లు పరిష్కరించక పోవడం వల్ల 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెసుకి కోల్ బెల్ట్ ప్రాం తంలో, గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎఐటియుసి గెలిపించారని వారు పేర్కొన్నారు. యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం మాట వింటూ సింగరేణిని ధ్వంసం చేసే విధంగా వ్యవహ రిస్తుందని వారు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం విధానాల వల్ల తెలంగాణలో సింగరేణి కనుమరుగయ్య పరిస్థితి కనపడుతుందని, జరుగుతున్న పరిణామాలపై సింగరేణి వ్యాప్తంగా కార్మికులకు వివరించి 'సేవ్ సింగరేణి' పేరు తో ఉద్యమాలు చేస్తామని, సంస్థను, కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ఎఐటియుసి ముందుంటుందని వారు తెలిపారు. యాజమాన్యం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా తక్షణమే సి అండ్ ఎండి లెవెల్ మీటింగ్ ఏర్పాటు చేసి కార్మికుల ముఖ్యమైన సమస్యలైన మారుపేర్లు, విజిలెన్స్ బాధితుల సమస్య, స్వంత ఇంటి పథకం అమలు, పెర్క్స్ పై ఆదాయపు పన్ను మినహాయింపులు, ఉద్యోగులకు పదోన్నతులు, తదతర సమస్యలను పరిష్కరించాలని, సింగరేణికి డైరెక్టర్‌లను వెంటనే నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి నాయకులు ఎల్ ప్రకాష్, వై.వి.రావు, కే.స్వామి, ఆరెల్లి పోషం, కందుకూరి రాజారత్నం, జూపాక రాం చందర్, ఎస్ వెంకట్ రెడ్డి, మానాల శ్రీనివాస్, సోహెల్, ఆకునూరి శంకరయ్య, సిర్ర మల్లికార్జున్, నాయిని శంకర్, ఎం.ఎ.గౌస్, బోయిన స్వామి, వేముల అశోక్, తాళ్ళపెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంఖ్య పెంచి..పనిభారం తగ్గించండి

### ఎఐటియుసి ఆధ్వర్యంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌కి వినతి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : చాలీచాలని వేతానాలతో ఉద్యోగ భద్రతకు నోచుకోక దిన దిన గండంగా బండెడు చాకిరీ చేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ కార్మికులను బద్నాం చేయడం మంచిదికాదు అని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. శుక్రవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ప్రభుత్వం జనరల్ ఆసుపత్రి పడకల నిష్పత్తి ప్రకారం కార్మికుల సంఖ్యను పెంచి పనిభారం తగ్గించాల జిఒ నెంబరు 60 ప్రకారం జీతాలు, పిఎఫ్‌ఈఎస్‌ఐలు చెల్లించాలని కార్మికుల పట్ల వేధింపులు ఆపాలని డిమాండు చేస్తూ జనరల్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సునీల్‌కి కార్మికులు విజ్ఞాపన పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకే తలమానికమైనదని, ప్రతిరోజు వందలాదిమంది రోగులు, రోగుల బంధువులు వైద్య సేవల కోసం వస్తారన్నారు. జనరల్ ఆసుపత్రి 650 పడకల సామర్థ్యం గలదని ప్రభుత్వం ధృవీకరించిన వాస్తవంగా దాదాపు వెయ్యి పడకల వైద్య సేవల సామర్థ్యం దాటిపో తున్నదన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ టెండర్ గైడ్‌లైన్స్‌లో ఆసుపత్రులలో నమోదు అవుతున్న ఐపి ప్రకారం అందుకు అనుగుణంగా పారిశుద్ధ్య సిబ్బంది సంఖ్యను పెంచుకునే విధంగా వెసులుబాటు కల్పించిందన్నారు. పనిభారంతో కార్మి కులు తీవ్రమైన అనారోగ్యాల బారిన పడుతూ కార్మికుల కుటుంబాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయన్నారు. జిఒ నెంబర్ 60 ప్రకారం వేతనాలు పిఎఫ్ ఇఎస్ఐలు రావడం లేదని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. కార్మి కులను వేధింపులకు గురి చేయడం సరికాదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనలకు సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ అధ్యక్షులు బి.చెన్నయ్య, కార్మికులు యాదయ్య, వీరాంజనేయులు, రాఘవేందర్,రవి, అంజి, శ్రీను, అంజిలయ్య, అంజమ్మ, లక్ష్మ మ్మ,తదితరులు ఉన్నారు.

## విజిలెన్స్ బాధితుల సమస్యను పరిష్కరించండి

### యాజమాన్యం, ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

### ఎఐటియుసి కేంద్ర ఉపాధ్యక్షులు వంగ వెంకట్



ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్/పెద్దపల్లిప్రతినిధి సింగరేణిలో మారుపేర్లు, విజిలెన్స్ బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం గోలేటి నుండి కొత్తగూడెం వరకు కొనసాగుతున్న పాదయాత్రకు గుర్తింపు సంఘం ఎఐటియుసి మద్దతు తె లుపుతుందని, త్వరలో జరిగే సిఅండ్ఎండి లెవెల్ మీటింగ్‌లో ఎఐటియుసి డిమాండ్ చేస్తోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర ఉపాధ్యక్షులు వంగ వెంకట్ తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ఎదుట పాదయాత్ర ముగింపు సందర్భంగా జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అనేక ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం, యాజమాన్యం సమస్య పరిష్కారం కోసం చొరవ చూపకపోవడం విచారకరమని, ఉద్యోగాలు రాక, డబ్బులు, పెన్షన్లు రాక, బాధితుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.ఇంత వరకు వారి సమస్యను పరిష్కరించడంలో వైఫల్యం చెందారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు స్పందించి సింగరేణి కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మారుపేరు బాధితులకు, అదేవిధంగా విజిలెన్స్ బాధితులకు తక్షణమే సింగరేణిలో ఉద్యోగాలు ఇచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని సింగరేణి హెడ్‌ఆఫీస్‌లో ఉన్న అధికారులకు పాద యాత్ర లో పాల్గొన్న బాధితులతో కలిసి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి సీనియర్ నాయకులు డి.శేషయ్య,వీరాస్వామి, ఎస్‌వి రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శాఖ నూతన కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/ పాల్వంచ : పట్టణ పరిధిలోని బంజరాకాలనీ (కరకవాగు)లో భారత కమ్యునిస్టు పార్టీ (సిపిఐ) శాఖా మహాసభ గురువారం సా యంత్రం జరిగింది. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, పట్టణ నాయకులు నిమ్మల రాంబాబు, వైఎస్‌గిరి హాజరయ్యారు. బంజారాకాలనీ (కరకవాగు) నూతన శాఖ కార్యదర్శిగా బోడాభీమా నాయక్, సహాయ కార్యదర్శిగా బానోత్‌దేవా, మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులుగా అజ్మీర మంగమ్మ, బానోత్ కౌసల్య, శాఖ సభ్యులుగా బానోత్ స్వామి, శ్రీనివాస్, సునీత, బిక్కులాల్, సతీష్‌లను ఎన్నుకున్నారు.

## భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు రూ.1000కోట్లు కేటాయించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు డిమాండ్



ప్రజాపక్షం/బోనకల్ : భవననిర్మాణ కార్మికులకు ఉపయోగపడే సంక్షేమ బోర్డు కు బడ్జెట్‌లో రూ.1000కోట్లు కేటాయించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్య దర్శి తోట రామాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుడు సంక్షేమ బోర్డులో రూ.110లు చెల్లించి నమోదు చేసుకున్నారని, ఆ నగదులో రూ.1000 కోట్లు కాళేశ్వరం ప్రాజెక్టు తరలించారన్నారు. ఆ నిధులను తిరిగి మరల సంక్షేమ బోర్డులో జమచేయాలని ఎఐటియుసి పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో అనునిత్యం పోరాటాలు చేస్తున్నాయని, అందులో భాగంగానే మార్చి 1వ తేదీన ఖమ్మం నగరంలోని కొత్తగూడెం గ్రామంలో జరిగే తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) 4వ జిల్లా మహాసభలు జరగను న్నాయని వాటిని జయప్రదం చేయావల్సిందిగా భవన నిర్మాణ కార్మికులను కోరారు. ఈ సమావేశంలో ఎఐటియుసిజిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీ నారాయణ, జిల్లా నాయకులు యంగల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధితో ఎదగాలి



**ప్రజాపక్షం/పూడూర్ :** యువత స్వయం ఉపాధితో ఎదగాలని టిపిసిసి మెంబర్ డాక్టర్ రిత్విక్‌రెడ్డి అన్నారు. పూడూర్ మండల మండల పరిధిలోని మన్నెగూడలో శుక్రవారం కింగ్ కేఫ్‌ను ప్రారంభించి రిత్విక్‌రెడ్డి మాట్లాడుతూ యువత స్వయం ఉపాధితో ఎదగి ఇతరులకు అదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువనాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

## మత్స్యకారుల అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/దోమ :** దోమ మండల పరిధిలోని గుండాల్ గ్రామ మత్స్యకారుల సంఘం భవనాన్ని దోమ మండల పిఏసిఎస్ చైర్మన్ యాదవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, అంజిలయ్య, పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, రామేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## త్వరితగతిన డంపింగ్‌యార్డ్ పనులు

హైదరాబాద్ ఆర్‌డిఎంఎ శీనివాస్‌రావు



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దొమ్మర పోచంపల్లి సర్వేనెంబర్ 120 వద్ద గల డంపింగ్ యార్డ్ లో జరుగుతున్న బయోమైనింగ్ పనులను హైదరాబాద్ ఆర్‌డిఎంఎ జె.శ్రీనివాస్‌రావు పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సాగర్ మోటార్స్ కంపెనీ వారిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్, మున్సిపల్ ఇంజనీర్ బి.సురేందర్ నాయక్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, మున్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

## వర్గీకరణతో ఎస్‌సిలకు న్యాయం

సిఎం రేవంత్‌రెడ్డి, మందకృష్ణ చిత్రపటాలకు పాలభిషేకం



**ప్రజాపక్షం/దోమ :** మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ చిత్రపటాలకు పిఎసిఎస్ చైర్మన్ యాదవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల విజయకుమార్‌రెడ్డి అధ్వర్యంలో పాలభిషేకం చేశారు. అంతకుముందు భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రాహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి కులాలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పడం సంతోషకమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఎస్‌సి వర్గీకరణకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేయడంతో ఎస్సిలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరక్టర్ ప్రభాకార్‌రెడ్డి, బందయ్య, రాఘవేందర్‌రెడ్డి,అంతిరెడ్డి, రమేష్‌గౌడ్, శేఖర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓవర్‌హెడ్ ట్యాంకునుండి నీటిసరఫరా

హామీనెరవేర్చిన జలమండలి జనరల్ మేనేజర్



**ప్రజాపక్షం/చర్లపల్లి :** నాగారం పురపాలక సంఘ పరిధిలోని ఎస్వీ నగర్ రోడ్‌లో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు పరిసర కాలనీ వాసులకు శనివారం నుండి అందుబాటులోకి రానుంది. ప్రజావాణిలో గత సోమవారం మాజీ కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు చేయటంతో స్పందించిన జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి వారం రోజుల్లో వాటర్ ట్యాంకును ప్రారంభిస్తామని హామీ ఇచ్చి శుక్రవారం నీటిని విడుదల చేయటానికి ముందుగా ట్రయల్ రన్ చేసారు. శనివారం నుండి ఈ ఓవర్ హెడ్ ట్యాంకు నుండి ఎస్వీనగర్ కాలనీతో పాటు సమీప ప్రాంత వాసులకు క్రమం తప్పకుండా నిర్ణీత వేళల్లో నీటి సరఫరా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ట్రయల్ రన్ కార్యక్రమంలో ఎస్వీ నగర్ కాలనీ అధ్యక్షుడు ఎన్నిలా ప్రభాకరరెడ్డి, కొమిరెల్లి సుధాకర్‌రెడ్డి, కౌకుట్ల కృష్ణారెడ్డి, నర్సింహ, హరినాయక్, రాము, వాటర్ మెన్స్ కుమార్, కొండల్ గౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## లింగ వివక్ష ప్రదర్శించొద్దు

ఘనంగా బేటీ బచావో – బేటీ పడావో ఉత్సవాలు




**ప్రజాపక్షం/పరిగి :** వికారాబాద్ జిల్లాలోని మహిళా శిశుసంక్షేమ శాఖలోని మహిళా సాధికారత కేంద్ర అధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో అవగాహన సదస్సు శుక్రవారం పరిగి మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ సాధికారత బృందం సభ్యురాలు, జెండర్ స్పెషలిస్ట్ వరలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో తల్లిదండ్రులు లింగ వివక్ష కనబర్చవద్దన్నారు. అమ్మాయిని అబ్బాయిన ఇద్దరినీ సామానంగా చూడాలన్నారు. అమ్మాయిని, అబ్బాయని వ్యత్యాసంగా చూస్తే ఆ ప్రభావం పిల్లత జీవితం పైన పడుతుందని వివరించారు. ప్రతి ఇంట్లో తల్లిదండ్రులు కుమారినితో ఎలా ఉంటారో కూతురుతో కూడా అలానే ఉండాలన్నారు. అమ్మయిలకు బాల్యవివాహాహలు చేయరాదని తెలిపారు. లిటరసీ రాందాస్ మాట్లాడుతూ మళిళలు సమాజంలో జరుగుతున్న వివిధ రకాల అర్థిక పరమైన ఇబ్బందులను ముందే గుర్తించి సుకన్య సమృద్ధి యోజన అనే పథకాన్ని ఉపాయోగించుకోవాలన్నారు. ఈ పథకం పిల్లలకు చాలా ఉపయోగపడుతుందన్నారు, ఈ పథకంలో నెలకు రూ. 250 చెల్లించాలన్నారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం వడ్డి రేటును కూడా ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సిఎం నోట పంచాయతీ ఎన్నికల మాట

పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు

ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

సర్పంచుల పదవీ కాలం ముగిసి ఏడాది పూర్తి

జిపిల్లో కొనసాగుతున్న ప్రత్యేక అధికారుల పాలన




**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలోని స్థానిక సంస్థల ఎన్నికలు అశావహుల్లో ఉత్కంఠ రేవుతోంది. ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు, వికారాబాద్ జిల్లావ్యాప్తంగా 566 గ్రామ పంచాయతీలు ఉండగా మండలాల పునర్విభజన అనంతరం వాటి సంఖ్య 585కు చేరింది, ఇటీవల పక్క జిల్లాలో నారాయణపేట్, మహబూబ్‌నగర్ నుంచి కొన్ని జిపిలను కలపడంతో పంచాయతీల సంఖ్య మరింత పెరిగి 594 చేరింది. ప్రస్తుతం జిల్లాలో 5058 వార్డులు ఉన్నాయి. వికారాబాద్‌లో 21గ్రామ పంచాయతీలు, 182 వార్డులు, మోమిన్‌పేట్ 29గ్రామ పంచాయతీలు, 256 వార్డులు, ధారూర్ 34గ్రామ పంచాయతీలు, వార్డులు 286, బంట్వారం 12 గ్రామ పంచాయతీలు, 106 వార్డులు, మర్పల్లి 29గ్రామ పంచయతీలు, వార్డులు 264, కోట్‌పల్లి 18, వార్డులు 150, తాండూర్ 33 గ్రామ పంచాయతీలు, 290 వార్డులు, బషీరాబాద్ 39గ్రామ పంచాయతీలు, 312 వార్డులు, యాలాల్ 39 గ్రామ పంచాయతీలు, 318 పెద్దముల్ 38 గ్రామ పంచాయతీలు, 308 వార్డులు, కొడంగల్ 25 గ్రామ పంచాయతీలు, 222 వార్డులు, దౌల్తాబాద్ 34 గ్రామ పంచాయతీలు, 298వార్డులు, బొంరాస్‌పేట్ 35 గ్రామ పంచాయతీలు, 292 వార్డులు, దుద్యాల్ 19గ్రామ పంచాయతీలు, 158వార్డులు, పూడూర్ 32గ్రామ పంచాయతీలు, 282 వార్డులు, పరిగి 32 గ్రామ పంచాయతీలు, 268 వార్డులు, కుల్కచర్ల 33 గ్రామ పంచాయతీలు, 280 వార్డులు, చౌడపూర్ 24గ్రామ పంచాయతీలు, 202 వార్డులు, దోమ 36 గ్రామ పంచాయతీలు, 308 వార్డులు, నవాబుపేట్ 32 గ్రామపంచాయతీలు, 276 వార్డులు ఉన్నాయి. ఇప్పటికే ఎంపిటిసిలు, జడ్‌పిటిసిల పదవీ కాలం ముగిసింది. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలన సంవత్సరం నుంచి కొనసాగుతుంది. రెండు నెలల క్రితం జిపి ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేసిన అధికారులు ఇటీవల మండల, జిల్లా పరిషత్ ఎన్నికలపై దృష్టి సారించారు.

గురువారం హైదరాబాద్‌లో జరిగిన సిఎల్‌పి సమావేశంలో సిఎం చేసిన వ్యాఖ్యలు ఎన్నికల బరిలో నిలవాలనుకునే వారిలో ఆశలు రేపాయి. గ్రామ పంచాయతీల ఎన్నికలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేయటంతో ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని సంకేతాలు ఇచ్చినట్లుయింది. ఏ క్షణమైనా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం కనిపిస్తోంది. డిపిఒలు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం అదేశించింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది అదనంగా అవసరం అవుతాయని భావించి అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో అశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. కాగా వంద శాతం ఎస్‌టి జనాభా ఉన్న పంచాయతీలను వారికే రిజర్వు చేశారు.

## బడ్జెట్‌పై అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు

బిజెపి జిల్లా కార్యదర్శి జగన్



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులకు కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని బిజెపి జిల్లా కార్యదర్శి సారా జగన్ విమర్శించారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాకరానికి ముందడుగే ఈ బడ్జెట్ అని పేర్కొన్నారు. పన్ను మినహాయింపు, పరిశ్రమల అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం కిసాన్ క్రెడిట్ కార్డ్ లా ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు కల్పించనున్నారన్నారు. బడ్జెట్‌ను ప్రజలు స్వాగతిస్తుంటే మిగిలిన పార్టీలు విమర్శలు చేస్తున్నారు. ప్రతి రంగంలోనూ అభివృద్ధి చెందిన, ఉత్తమ భారతదేశాన్ని నిర్మించాలనే నరేంద్రమోడీ ప్రభుత్వ దార్శనికతకు ఈ బడ్జెట్ బ్లూప్రింట్ అని ఆయన అన్నారు. రైతులు, పేదలు, మధ్యతరగతి, మహిళలు, పిల్లల విద్య, పోషకాహారం, ఆరోగ్యంలో స్టార్టప్ లు, ఆవిష్కరణలు, పెట్టుబడుల వరకు ప్రతి రంగాన్ని, కేంద్ర బడ్జెట్ భారతీయుల ఆకాంక్షలను ఆర్థిక, దేశాభివృద్ధిని ప్రోత్సహించే బడ్జెట్ మధ్యతరగతి ప్రజలకు ఊరటనిచ్చేలా ఉందని సారా జగన్ పేర్కొన్నారు.

## యువతిని వంచించిన కానిస్టేబుల్ అరెస్ట్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఓ యువతిని సాయం చేస్తానంటూ మాయమాటలతో లొంగదీసుకొని గర్భం దాల్చిన అనంతరం అబార్షన్ చేయించి వంచించిన ఓ పోలీస్ కానిస్టేబుల్ కటకటాలపాలైన ఉదంతం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మేడ్చల్‌లోని ఇందిరా నగర్ ప్రాంతానికి చెందిన ఓ యువతి కొంత మందితో డబ్బుల విషయమై జరిగిన గొడవకు సంబంధించి గత ఏడాది మార్చి 21న తన తల్లితో కల్సి మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. ఆ సమయంలో పోలీస్ స్టేషన్‌లోనే క్రైం విభాగంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డి ఆ యువతితో మాటలు కలిపి తాను సమస్యను పరిష్కరిస్తానని చెప్పి, తనకు ఫోన్ చేయాలంటూ ఫోన్ నంబర్ ఆమెకు ఇచ్చాడు. అతడిని నమ్మిన యువతి మరుసటి రోజు ఫోన్ చేయగానే తనకు తెలిసిన న్యాయవాదితో మాట్లాడుదామని చెప్పి తన ఇంటికి రమ్మని పిలిచాడు. ఎలాగైనా సమస్యను పరిష్కరించుకోవచ్చన ఆశతో ఇంటికి వచ్చిన సదరు యువతితో తాను ఎలాగైనా తన పరపతితో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అవసరం లేకుండా పరిష్కరిస్తానంటూ నమ్మించాడు. తరచు ఆమెను ఇంటికి పిలిపించుకొంటూ ఆమెను లొంగదీసుకొని లైంగిక దాడులకు పాల్పడసాగాడు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య ఏర్పడ్డ వివాహేతర సంబంధంతో గత ఏడాది జూలై మాసంలో యువతి గర్భం దాల్చిన విషయం కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డికి తెల్పడటంతో బలవంతంగా అబార్షన్ చేయించాడు. గత ఏడాది ఆగస్టు 15న సుధాకర్‌రెడ్డికి ఆ యువతి ఫోన్ చేసిన సమయంలో ఓ మహిళ మాట్లాడి తాను భార్యనని చెప్పింది. దీంతో విస్తుపోయిన బాధిత యువతి తనతో వివాహం అయిన విషయాన్ని దాచి లొంగదీసుకొని వంచించాడని తెల్సుకొని సుధాకర్‌రెడ్డిని నిలదీసింది. తన విషయం కాస్తా భార్యకు తెలిసి ఇంట్లో గొడవలు తలెత్తటంతో బాధిత యువతిని తనకు మరోసారి ఫోన్ చేయవద్దని సుధాకర్‌రెడ్డి బెదిరించాడు. తరచు కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి యువతిని బెదిరిస్తూ వేధిస్తుండటంతో చివరికి తాను వంచనకు గురైన విషయాన్ని మేడ్చల్ ఇన్‌స్పెక్టర్‌కు తెలిపింది. ఈ వ్యవహారాన్ని సద్దుమణిగేందుకు గాను ఇనస్పెక్టర్ సత్యనారాయణ మేడ్చల్ నుంచి సైబరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ చేయించారు. తనకు పోలీస్ స్టేషన్ లో న్యాయం జరుగకపోవటంతో చివరికి సైబరాబాద్ కమిషనరేట్‌లో బాధిత యువతి తనను వంచించి లొంగదీసుకొన్న సుధాకర్‌రెడ్డిపై ఫిర్యాదు చేసింది. ఉన్నతాధికారుల జోక్యంతో ఎట్టకేలకు మేడ్చల్ పోలీసులు కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


## తరచూ వైద్యపరీక్షలతో ఆరోగ్య రక్షణ

జిల్లా కలెక్టరేట్‌లో ఉద్యోగులకు వైద్య శిబిరం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మహిళలు క్రమం తప్పకుండా తరచూ అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపించుకొంటూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం పనులతో సతమతమయ్యే మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందన్నారు. క్యాన్సర్ సంబంధిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు ముందస్తుగా గుర్తించటానికి వీలై అవసరమైన పక్షంలో సాధారణ చికిత్సల ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్, స్వతవ క్యాన్సర్ కేర్ ఆస్పత్రిల సహకారంతో క్యాన్సర్‌తో పాటు గైనకాలజీ, డెర్మటాలజీలాంటి పలు విభాగ వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొన్నారని డిఎంహెచ్‌ఓ డా.రఘునాథస్వామి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వివిధ ప్రభుత్వ ఉద్యోగులు వైద్య నిర్ధారణ పరీక్షలు జరిపించుకొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

## ఒయులో ఉద్రిక్తత



**హైదరాబాద్:** విద్యార్థుల ఆందోళనతో ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి భోజనం చేయకుండా విద్యార్థులు ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి వర్సిటీ పరిపాలనా భవనాన్ని ముట్టడించారు. పిజి సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. నెట్ పరీక్ష పూర్తయ్యే వరకు మినహాయింపు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ఋగ్వేదంలో ఆదిత్య 'ఘనపాటి'

సన్మానించిన కొడంగల్ బ్రహ్మణ సంఘం



**ప్రజాపక్షం/కొడంగల్ :** ఆధునిక కలియుగంలో ఉన్నత విద్యతో ఉద్యోగాలు సంపాదించే నేటి యువతకు ఆదిత్య ఘనపాటి ఆదర్శంగా నిలిచాడు. గత పది ఏళ్లుగా చదువుతో పాటు పలు ప్రాంతాల్లో వేద విద్య అభ్యసించారు. తాజాగా ఋగ్వేదంలోని 12 వేల పద్యాలను కంఠస్తంగా వల్లే వేయడంలో వేద పండితులను సైతం ఆకట్టుకున్నాడు. 4లక్షల నగదుతో పాటు బంగారు గండపేండేరం దరించాడు. దీంతో ఆదిత్య ఘన పాటి స్థానికుడు కావడంతో శుక్రవారం కొడంగల్ బ్రహ్మణ సంఘం ఆద్వర్యంలో ఘనంగా సన్మానించి గౌరవించారు. చిన్నవయస్సులో వేద విద్యను అత్యంత ఏకగ్రతతో పఠించడం పలు ఘనపాటిలను సైతం ఆకట్టుకోవడం హర్షనీయమని సంఘం సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో అక్కి శ్రీనివాసమూర్తి, దోండుబట్టు జోషి, విజయకిట్టుస్వామి, లక్ష్మి నారాయణజోషి, జయతీర్థచారి, దత్తుస్వామిలతో పాటు సంఘం సభ్యులు, ఆర్టిస్ట్ వెంకట్ పాల్గొన్నారు.

## రోడ్డుపై పారుతున్న మురుగునీరు

## ఇబ్బందులు పడుతున్న ప్రజలు



**ప్రజాపక్షం/అల్వాల్ :** అల్వాల్ పట్టణ కేంద్రంలోని పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రతిరోజు విధిగా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాల్సిన అధికారులు అలసత్వం వహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మచ్చ బొల్లారం డివిజన్ పంచశీల రోడ్ నెంబర్ 9 లో గత కొంతకాలం నుండి డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతుంది. దీంతో చుట్టుపక్కల నివసిస్తున్న వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు రోడ్లపై నిలుస్తుండడంతో పరిసరాలు దుర్గందబరితంగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం అయితే చాలు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. అధికారులు స్పందించి పూర్తిస్థాయి డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## ఘనంగా మహంకాళి ఆలయ వార్షికోత్సవం



**ప్రజాపక్షం/చర్లపల్లి :** రాంపల్లిలోని శ్రీ మహంకాళి దేవాలయంలో 12వ వార్షికోత్సవ కుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీ సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు రాంమూర్తి శర్మ, గణపురం రాంప్రసాద్ శర్మ, శ్యామ్ సుందర్ శర్మలచే మహాకాళి అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు, గోపూజ, ఆలయ ప్రదక్షిణ, యాగశాల ప్రవేశం, శ్రీ గణపతి పూజ, చండీహోమం, కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో దేవాలయ చైర్మన్ ఎలసాని భూమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నపై పోలీసులకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/అల్వాల్ :** రెడ్డి కులస్తులపై అనుచిత వాక్యాలు చేసిన ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెడ్డి సంఘ ఆధ్వర్యంలో అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీన్మార్ మల్లన్నపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అల్వాల్ రెడ్డి సంఘం నాయకులు గోవిందరెడ్డి, మాధవరెడ్డి, రామకృష్ణారెడ్డి, రామిరెడ్డి, సంజీవరెడ్డి, బలవంత రెడ్డి, రాజసింహారెడ్డి పాల్గొన్నారు.

# మహానగరి

## పకడ్బందీగా మహిళా సంఘ సభ్యుల వివరాలు

**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రతి మహిళా సంఘం సభ్యురాళ్ల వివరాలను పకడ్బందిగా లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని డిఆర్‌డిఏ డిపిఎం స్వర్ణలత సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో ని సమావేశపు మందిరంలో అన్ని గ్రామాల విఓఎలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఎం స్వర్ణలత మాట్లాడుతూ ప్రతి మహిళా సభ్యురాలి వివరాలతో పాటు సంఘం నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలను ఆన్‌లైన్‌లో నమోదులో భాగంగా లోకోయాప్‌లో నమోదు చేయాలని, దీనివల్ల మహిళా సంఘాల్లో పారదర్శకత పెరుగుతుందని, వివరాలు ఎప్పటికప్పుడు అందరికి అందుబాటులో ఉంటాయని వివరించారు.

## 12న సిఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడి

**ప్రజాపక్షం/ ఖైరతాబాద్:** మున్నూరు కాపులకు ఇచ్చిన హామీల అమలులో జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 12న సిఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడించనున్నట్టు మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గే శ్రీనివాస్ పటేల్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మాట్లాడుతూ మున్నూరుకాపులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.5వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని, రాష్ట్రమంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని, బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్నూరుకాపు సంఘాల ప్రతినిధులు బత్తుల రాములు, అమరం శ్యామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## బీహార్ నుండి షాద్‌నగర్‌కు గంజాయి సరఫరా

### పోలీసులు నిందితుడి నుండి 268గ్రాములు స్వాధీనం

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. గురువారం రాత్రి సుమారు పదిగంటల సమయంలో ఎస్ఒటి పోలీసులు, షాద్‌నగర్ పోలీసులు సంయుక్తంగా వచ్చిన సమాచారం మేరకు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకొని 268గ్రాములు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సిఐ విజయ్‌కుమార్ తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలోని హాజీపల్లి రోడ్డులో బిహార్ రాష్ట్రం పహాడిపూర్ గ్రామానికి చెందిన శిబు ఆలం (23) అనే యువకుడు ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల వద్ద ఓ పరిశ్రమలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నారు. బిహార్ రాష్ట్రానికి చెందిన కొంతమంది కార్మికులకు అక్కడి నుండి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తుండేవాడని తెలిపారు. బిహార్ రాష్ట్రం నుండి రైలుమార్గం ద్వారా షాద్‌నగర్ ప్రాంతానికి తీసుకువచ్చి కార్మికులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని వివరించారు. హాజీపల్లి రోడ్డులో పట్టుకుని అతని వద్ద నుండి 268గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## నాలా పనులు ప్రారంభించాలని వినతి

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** హస్తినాపురం డివిజన్‌లోని ఎపిఎస్‌సిబి కాలనీ నుండి బైరామాలగూడ చెరువు వరకు ఎస్‌ఎన్‌డిపి నిధులతో మంజూరైన నాలా పనులు త్వరగా ప్రారంభించాలని ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను వారి కార్యాలయంలో హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాత నాయక్ మాట్లాడుతూ వరద ప్రభావంతో కొన్ని కాలనీలు చాలావరకు వర్షాలకు ముంపుకు గురైతుందని, వాటిని పరిష్కారంకోసం నాలా పనులు త్వరగా పనులు ప్రారంభించి పనులు పూర్తి చేయాలని కార్పొరేటర్ కమిషనర్‌కు వినతి పత్రంలో కోరారు. అదేవిధంగా కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు త్వరలోనే పనులు ప్రారంభం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపినట్లు కార్పొరేటర్ సుజాత నాయక్ తెలిపారు.



## సినీ నిర్మాత రమేశ్‌బాబు మోసాలపై న్యాయ పోరాటం

### ఫైనాన్షియర్ సదానంద్ వెల్లడి

**ప్రజాపక్షం/ ఖైరతాబాద్:** కొమురంపులి, ఖలేజా' చిత్రాల నిర్మాత శింగనమల రమేశ్‌బాబు మోసాలు, బెదిరింపులు, అక్రమాస్తుల నిగ్గు తేల్చేందుకు న్యాయ పోరాటం చేస్తామని ఆ చిత్రాలకు పెట్టుబడి పెట్టిన ఫైనాన్షియర్ సదానంద్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తమ పెట్టుబడితో 'కొమురంపులి, ఖలేజా' సినిమాలు తీసి, తమ డబ్బులు తిరిగి ఇవ్వకుండా రమేశ్‌బాబు మోసం చేశారని చెప్పారు. ఈ రెండు సినిమాలతో నష్టపోయానని రమేశ్‌బాబు పేర్కొనడం పచ్చి అబద్ధమన్నారు. సుమారు రూ.300 కోట్ల డబ్బులు తనతోపాటు బాధితులకు ఇవ్వాల్సి ఉన్నదని వివరించారు. అప్పట్లో రమేశ్‌బాబుపై పెట్టిన కేసును నాంపల్లి క్రిమినల్ కోర్టు ఈ ఏడాది జనవరి 31 కొట్టివేసిందని తెలిపారు. ప్రస్తుతం దానిపై సిఐడితోపాటు హైకోర్టులో అప్పీల్‌కు వెళ్తున్నట్టు చెప్పారు. త్వరలోనేసిఎం రేవంత్‌రెడ్డిని, తమిళనాడు సిఎం స్టాలిన్‌ను బాధితులతో కలిసి రమేశ్‌బాబు అక్రమాలను వివరిస్తామని సదానంద్ తెలిపారు.



## ప్రపంచ పుస్తక ప్రదర్శనలో 'విడోస్ ఆఫ్ విదర్భ' పుస్తకం



**ప్రజాపక్షం/ ఖైరతాబాద్:** వ్యవసాయ రైతుల ఆత్మహత్యలు, గ్రామీణ మహిళా వ్యవసాయకారులపై రాసిన 'విడోస్ ఆఫ్ విదర్భ' పుస్తకం శుక్రవారం న్యూఢిల్లీ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని ప్రపంచ పుస్తక ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ రచించిన 'విడోస్ ఆఫ్ విదర్భ' పుస్తకాన్ని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ ప్రెస్ ప్రచురించింది. రైతుల ఆత్మహత్యల కుటుంబాల్లో మహిళా వ్యవసాయకారుల జీవితాన్ని అర్థం చేసుకునే విధానం చాలా ముఖ్యమని నీలిమ పేర్కొన్నారు. నా పుస్తకం రచనలు వ్యవసాయ ఆత్మహత్యలు చేసుకొన్న రైతుల భార్యలచే సమీక్షించినట్టు తెలిపారు.

## ఔట్ సోర్సింగ్ కార్మికుల కనీస వేతనం పెంచాలి

### తెలంగాణ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.రత్నం డిమాండ్

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** రాష్ట్రంలో మున్సిపల్‌లో ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్‌గా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనం 26వేల ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రత్నం రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శుక్రవారం హయత్ నగర్ సర్కిల్‌లోని హుడా సాయి నగర్ కమ్యూనిటీ హాల్‌లో కార్మికుల సర్వసభ్య సమావేశానికి ఎల్‌బి నగర్ కార్మికుల విభాగం అధ్యక్షులు బోయపల్లి రాములు గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్.రత్నం, ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి వారు మాట్లాడుతూ మున్సిపల్‌లో పనిచేస్తున్న వారికి ప్రతి సంవత్సరం కార్మికులకు అవసరమైన కిట్లు, సేఫ్టీ గ్లౌజు లు, నూనె సబ్బులు, షూ ఇతర వస్తువులు అందించాలని ప్రభుత్వాన్ని సూచించారు. మున్సిపల్‌లో పని చేస్తున్న కార్మికులు విధు ల్లో ప్రాణాలు కోల్పోయి న కార్మికులకు బీమా వసతి కల్పించి, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు.

అదేవిధంగా వేల సంఖ్యలో కార్మికులు తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని, పనిభారం పెరుగుతున్న నేపథ్యంలో వయస్సు అధిక మై ఉద్యోగం కోల్పోయిన కార్మికుల స్థానం లో వారి కుటుంబ సభ్యులను నియమించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. నగరంలో పెరుగుతున్న అపార్మెంటు, నూతన కాలనీల నేపథ్యంలో జనాభా అవసరాలకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్దమవుతామని హెచ్చారించారు.

ఈ కార్యక్రమంలో బాతరాజు నరసింహ, రమావత్ సక్రు నాయక్, పేజారి శ్రీను, నాగరాజు, చెంది వెంకట్, అంకన్న తదితరులు పాల్గొన్నారు.




## ఆగని హైడ్రా దూకుడు..

### ఏకంగా ఎయిర్ పోర్టు దగ్గరే.. హోర్డింగ్‌లు కూల్చివేత

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/గండిపేట్:** గత కొద్ది రోజులుగా దూకుడు తగ్గించిన హైడ్రా మళ్లీ రంగంలోకి దిగిం ది. తాజాగా శుక్రవారం ఉదయం రంగారెడ్డి జిల్లా శంషా బాద్ ఎయిర్ పోర్ట్ రోడ్డులో అక్రమంగా నిర్మించిన అడ్వర్టైజ్మెంట్స్ హోర్డింగ్ టవర్స్, అక్రమ హోర్డింగ్‌లను అధికారులు కూల్చివేయడానికి శ్రీకారం చుట్టారు.

ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను కట్టకుండా అక్రమంగా నిర్మించిన ప్రకటన హోర్డింగ్ పాయింట్స్, అక్రమ హోర్డింగ్‌లను అధికారులు కూల్చివేశారు. శంషాబాద్ మున్సిపాలిటీ అధికారుల ఫిర్యాదుతో హైడ్రా చర్యలకు దిగింది. అదే విధంగా శంషాబాద్‌లోని జాతీయ రహదారి పైనున్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ ప్రాంతంలోని హోర్డింగ్లను తొలగించడానికిహైడ్రా సిబ్బందితో సహా ఇక్కడికి వచ్చి పరిశీలించారు. కాగా గత కొద్ది రోజులుగా దూకుడు తగ్గించిన హైడ్రా తిరిగి రంగంలోకి దిగడం జరిగింది. రెండు రోజుల క్రితం శంషాబాద్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు, సర్వీస్ రోడ్డు పక్కన ప్రహరీ గోడలను హైడ్రా అధికారులు కూల్చివేశారు.




## జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాటం

### ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** జాతీయ విద్య విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ అన్నారు. ఈ సందర్భంగా పవన్ చౌహాన్ మాట్లాడు తూ హైదరాబాద్‌లో ఫిబ్రవరి 9,10వ తేదీల్లో జాతీయ సమావేశాలను నిర్వహించడం జరుగుతుందని, వీటిని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్య విధానం రద్దు చేసేందు కు ప్రతి ఒక్కరు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యార్థులపై మతతత్వ భవజాలాన్ని రుద్దడానికి ప్రయత్నిస్తుందని, విద్య కాషాయికరణ, ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. అంబేద్కర్, భగత్‌సింగ్, పెరియార్ మహనీయుల జీవిత చరిత్ర ను పాఠ్యపుస్తకాల నుండి తొలిగిస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు బడ్జెట్‌లో విద్య రంగానికి 15శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో, సంక్షేమ హాస్టల్స్‌లో వరు స ఫుడ్‌పాయిజన్ ఘటనలు జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శులు శివకుమార్, ఆకాష్ నాయక్, అమీర్, కార్తీక్‌లు పాల్గొన్నారు.




## స్థానిక సంస్థల ఎన్నికలలో జెండా ఎగరేద్దాం:ఉప్పల

**ప్రజాపక్షం/తలకొండపల్లి:** ఆరు గ్యారంటీల హామీ లతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలు ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తెలిపారు.కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రములో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అధ్యక్షతన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వేంకటేశ్ మాట్లాడుతూ...ఈ నెల 13న ఆమనగల్ పట్టణంలో జరిగే రైతు దీక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ గారు వస్తున్న సందర్భంగా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా పాలన పేరుతో ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను, రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టే విధంగా ఏర్పాటు చేయనున్న రైతు దీక్షను పెద్ద మొత్తంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజలు పార్టీ పిలుపు మేరకు ఫిబ్రవరి 13వ తేదీన ఉదయం 11 గంట ల వరకు ఆమనగల్ పట్టణానికి తరలిరావాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ పిలుపునివ్వడం జరిగింది. వచ్చే స్థానిక ఎన్నికల్లో గ్రామ గ్రామాన అభ్యర్థులుగా నిలబడే ప్రతి వ్యక్తి ఒక కేసీఆర్ అనీ ఆయనలా ప్రభంజనం సృష్టించి కల్వకుర్తి గడ్డపై స్థానిక సంస్థ ఎన్నికలలో బిఆర్ఎస్ జెండా ఎగరేవేయాలనీ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు.

అనంతరం స్థానిక టిఆర్ఎస్ సీనియర్ నాయకులు లలిత జోతయ్య జన్మదిన సందర్భంగా ఆయనతో కేక్ కట్ చేసి సన్మానించారు.

## అధికారులతో కుమ్మక్కై చెరువులు చెర

### టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఆరోపణ

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్:** గత బిఆర్ఎస్ పాలనలో ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో ఎంఎల్ఏ అనుచరులు అధికారులతో కుమ్మక్కై చెరువులు కుంటలు అసైన్డ్ స్థలాలు, పార్కులు కబ్జా చేశారని టిపిసిసి ప్రచాక కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఆరోపించారు. అంతేకాకుండా అక్రమ నిర్మాణాలను, అనుమతులు లేకుండా సెల్లార్లతో భారీ నిర్మాణాలను ప్రోత్సహించారని ఆయన విమర్శించారు. అధికారులు ఇప్పటికీ ఒక ప్రభుత్వ నేతల మాటలే వింటూ అక్రమాలను ప్రోత్సహిస్తున్నారని, అలాంటి వారిపై కఠినంగా చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. శుక్రవారం చంపాపేట్, వనస్థలిపురం, బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో పలు అభివృద్ధికి సంబంధించిన పనులను ఆయన వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ నిర్మాణాలతో సెల్లార్ల గుంతలు తీసి సామాన్యుల ప్రాణాలను తీస్తున్నారని, ఎందుకు ఎల్‌బి నగర్‌లో రెండు రోజుల కింద జరిగిన సెల్లార్ గోడ కూలి ముగ్గురు మరణించిన ఘటనే నిదర్శనం అన్నారు. అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను హెచ్చరించారు.

చంపాపేట డివిజన్‌లోని ఉదయ్ నగర్ కాలనీలో వరద నీటి నాలా పనులు అసంపూర్తిగా ఉండడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నామని మధుయాష్కీ కాలనీ వాసులు తెలుపగా నేరుగా కాలనీ వాసులతో కలిసి పరిశీలించి ఆయన ఎస్‌ఎన్‌డిపి డిఇతో మాట్లాడి వెంటనే ప్రతిపాదనలు సిద్ధంచేసి నాలా నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలం వరకు సమస్య లేకుండా చూడాలని సూచించారు. ఆ ప్రాంతంలో ఖాళీ స్థలం అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని,,, గంజాయి దర్గా తీసుకుంటూ ఆకతాయిలు కాలనీ వాసులను బెదిరిస్తున్నారని పేర్కొనగా.. వెంటనే సరూర్ నగర్ ఇన్స్పెక్టర్‌తో మాట్లాడి పెట్రోలింగ్ గస్తీని పెంచి ఆకతాయిలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

**వనస్థలిపురం డివిజన్‌లో...**వనస్థలిపురంలో పార్కు అభివృద్ధికి, సీసీ రోడ్డు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు ఇప్పించాలని కాలనీ వాసులు కోరారు. త్వరలోనే కాలనీలో పర్యాటించి పార్క్ పనులు ప్రారంభమవుతావని, డ్రైనేజీ, రోడ్లన్నీ పూర్తి చేయిస్తామని ఆయన పేర్కొన్నారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలని కోరగా గత ప్రభుత్వంలో మాజీమంత్రి కెటిఆర్ స్థానిక ఎంఎల్ఏ ప్రభుత్వం నగరం అంతా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని గొప్పలు చెప్పారని, కానీ ఇప్పుడు ఎక్కడ కెమెరా లేవని కాలనీ వాసులు ఫిర్యాదు చేస్తున్నారన్నారు.వనస్థలిపురం డివిజన్ అభివృద్ధి కోసం 8కోట్లు నిధులతో పనులు చేపడుతున్నామని త్వరలోనే మంత్రితో పనులు ప్రారంభిస్తామన్నారు.

**ఎన్జీవోస్ కాలనీలో గ్రంథాలయ పరిశీలన**

వనస్థలిపురంలోని శాఖా గ్రంథాలయాన్ని మధుయాష్కీ సందర్శించారు. ఇప్పటికే రూ.1.50కోట్ల నిధులు మంజూరు అయినప్పటికీ కొందరు పనులు ప్రారంభించకుండా అడ్డుకుంటున్నారని స్థానికులు పేర్కొన్నారు. స్పందించిన మధుయాష్కీ గౌడ్ త్వరలోనే మంత్రి శ్రీధర్ బాబుతో శంకుస్థాపన చేయిస్తామని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా శాఖా గ్రంథాలయం, ఎన్జీవోస్ కాలనీ సంక్షేమ సంఘం, రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు అందరూ కలిసి.. ఎక్కడెక్కడ భవనాలు నిర్మించాలో ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వారు తీసుకునే నిర్ణయంతో ఆయా భవనాలను డిజైన్ చేసి.. నిధులు మంజూరు చేయిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్, డివిజన్ అధ్యక్షులు కుట్ల నర్సింహ యాదవ్, శ్రీపాల్‌రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, బుడ్డా సత్యనారాయణ, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, సాయి రాంరెడ్డి, సామా మహేశ్వర్‌రెడ్డి, సురేందర్, కిరణ్, సాయి నికేష్, కేతావత్ రమేష్ నాయక్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




# 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్‌దే

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించి బిసిలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామం లో ఎస్సీ వర్గీకరణ, బిసి కుల గణనకు శాసనసభలో ఆమోదం పొందిన నేపథ్యం లో నిర్వహించిన సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. షాద్‌నగర్ నుండి నాగులపల్లి మీదుగా ఈదులపల్లి వరకు నాలుగు కిలోమీటర్లు రూ.1.70కోట్లు, నాగులపల్లి నుండి రాసుమళ్ళగూడ వరకు కిలో మీటర్ బిటి రోడ్డు నిర్మాణానికి రూ.60లక్షలు భూమి పూజ చేశారు. గ్రామంలో ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి నేటివరకు రాజకీయ పార్టీలు ఎస్సీలను, బిసీలను ఓటు బ్యాంకుగానే పరిగణించా యే తప్పా వారి అభ్యున్నతి కోసం ఏ మాత్రం కృషి చేయలేదని సూచించారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని గత 30ఏళ్ళు గా మంద కృష్ణమాదిగ పోరాటాలు చేస్తుం టే అప్పటి ప్రభుత్వాలు నాన్చుడు దోరణి అవలంభించాయే తప్పా చేయలేదని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టిన నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి, ఇచ్చిన మాటకు కట్టుబడి ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. తెలంగాణ శాసన సభలో ఏకగ్రీ వ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపించడం జరిగిందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ చేస్తే నే వెనుకబడిన మాదిగలు రిజర్వేషన్లు పొంది ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో ముందు కు వచ్చే అవకాశాలు ఉన్నాయని సూచించారు. దళితుల అలుపెరగని పోరాటాలకు దిక్సూచిగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ అమలుకు అమోదం తెలిపారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వడంతోపాటు ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చామని గుర్తు చేశారు. ఎస్సీ కాలనీల అభివృద్ధి కోసం సబ్‌ప్లాన్ ద్వారా పెద్ద ఎత్తున నిధు లు కేటాయించినట్లు వివరించారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి సీట్లు ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం బిసిల ను ఓటు బ్యాంకు గానే వినియోగించారే తప్పా ఆర్థిక, రాజకీయంగా ఏనాడు ముందుకు తీసుకువెళ్ళలేదని స్పష్టం చేశారు. దేశంలోని బడుగు బలహీన వర్గాలకు సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ రంగాల్లో అవకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని వివరించారు. దేశంలో అనేక మంది బిసీలను, ఎస్సీలను ప్రధాన మంత్రి నుండి మొదలుకొని ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలను చేసిన ఘనత కాంగ్రెస్‌దే అన్న విషయాన్ని ప్రజలందరు గమనించాలని సూచించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క నేతకైనా ఉన్నతమైన స్థానం కల్పించారో చెప్పాలని డిమాం డ్ చేశారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కల్పించాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని, ఆ దిశగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నేతలు రఘు నాయ క్, మహ్మద్ ఇబ్రహీం, అరుందతి, రాజు, యాదయ్య, బీరప్ప, లింగా రెడ్డి గూడ అశోక్‌లు పాల్గొన్నారు.



**చరిత్రాత్మక నిర్ణయాలు**

కొందుర్గులో : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు, కులగణన చారిత్రాత్మక నిర్ణయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేసినందుకు సంబరాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని తహాశీల్దార్ కార్యాలయం నుంచి ముఖ్య చౌరస్థాలోని అంబేద్కర్ విగ్రహం వరకు డప్పుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే డప్పు కొట్టి దరువు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన ఒక గంటలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసన సభలో ప్రవేశపెట్టారని, రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు రాష్ట్రంలో కులగణన చేయడం జరిగిందని, ఈ విషయంలో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడం జరుగుతుందని, కుల గణనపై బీఆర్ఎస్ పార్టీ అబద్దాలు చెబుతుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు కోరుకున్న ప్రభుత్వం తమదని, ప్రజా పాలనలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్‌ను అందజేయడం జరుగుతుందని,అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుందని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయడం జరుగుతుందని వివరించారు. గతంలో ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజలందరికి ఇండ్లను, రేషన్ కార్డులు అందజేయడం జరిగిందని, తమ ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని వివరించారు.అనంతరం దళిత నాయకులు, బీసి నాయకులు ప్రజలకు స్వీట్లను పంపిణి చేశారు.

కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బోరిగే నరేందర్, కాడిగళ్ల మహేందర్, బి యాదయ్య, జి ప్రవీణ్, బి పెంటయ్య, బి మాణయ్య, జి జంగయ్య, డి శ్రీను, కొమ్ము కృష్ణ, సిద్దు, మండల పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, నర్సింహ్మారెడ్డి, గోవర్థన్‌గౌడ్, జిబి కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## ఇంగ్లండ్‌తో రెండో వన్డే కోహ్లీ ఇన్.. జైస్వాల్ ఔట్!



ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ముంగిట ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధ మైంది. ఆదివారం కటక్ వేదికగా జరిగే రెండో వన్డేలో ఇంగ్లండ్‌తో అమీ తుమీ తేల్చుకోనుంది. గురువారం నాగ్‌పూర్ వేదికగా జరిగిన తొలి వన్డేలో సమష్టిగా రాణించిన టీమిండియా 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించిన విషయం తెలిసిందే. రెండో వన్డేలోనూ ఇదే జోరును కొనసాగించి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో టీమిం డియా ఉంది.

**కోహ్లీ రీఎంట్రీ..:** తొలి వన్డేలో సరైన కాంబినేషన్‌తో బరిలోకి దిగి విజయాన్నందుకున్న టీమిండియా.. రెండో మ్యాచ్‌కు తుది జట్టులో స్వల్ప మార్పులు చేసే అవకాశం ఉంది. మోకాలి నొప్పితో చివరి నిమిషంలో తొలి వన్డేకు దూరమైన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. కటక్ వన్డేతో రీఎంట్రీ ఇచ్చే ఛాన్స్ ఉంది. ఒకవేళ అతను అందుబాటులోకి వస్తే యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌పై వేటు పడనుంది. కోహ్లీ స్థానంలో జట్టులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ అద్భుతమైన బ్యాటింగ్‌తో హాఫ్ సెంచరీ నమోదు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరోసారి నంబర్ 4లో తన విలువ ఏంటో తెలియజేశాడు.

**జైస్వాల్‌పై వేటు..:** ప్రస్తుతం అతన్ని తప్పించలేని పరిస్థితి నెలకొంది. కాబట్టి కోహ్లీని ఆడించాలంటే జైస్వాల్‌పై వేటు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడు రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనింగ్ చేస్తారు. విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చవద్దని భావిస్తే రెండో వన్డేలోనూ కోహ్లీ బెంచ్‌కు పరిమితమయ్యే అవకాశాలు ఉన్నాయి. మిగతా లైనప్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. వికెట్ కీపర్‌గా కేఎల్ రాహులే కొనసాగనున్నాడు. లెఫ్ట్ రైట్ కాంబినేషన్ కోసం అక్షర్ పటేల్‌ను అప్‌ది ఆర్డర్ ఆడించనున్నారు.

## టీమిండియా వన్డే కెప్టెన్సీ ఎవరికి ?



ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియాకు సానుకూల ఫలితాలు రాకపోతే జట్టులో భారీగా మార్పులు ఉంటాయని తెలిసింది. పైగా రోహిత్ శర్మ తర్వాత టీమిండియా టెస్ట్, వన్డే కెప్టెన్ ఎవరన్న విషయంపై ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలువురు పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే రోహిత్ వన్డేలకు గుడ్ బై చెప్పాక.. వైస్ కెప్టెన్ గా ఉన్న గిల్ కే సారథ్య బాధ్యతలు అప్పగిస్తారని అం తా అనుకుంటున్నారు. కానీ ఇప్పుడు తాజాగా అందిన సమాచారం ప్రకా రం హార్దిక్‌ను వన్డేలకు కెప్టెన్‌గా నియమిస్తారని తెలిసింది. ఛాంపియన్స్ ట్రోఫీలో అతడు మంచిగా రాణిస్తే సారథ్య బాధ్యతలు ఇవ్వొచ్చని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. 'హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ హార్దిక్ పాండ్యను వైస్ కెప్టెన్‌గా నియమించాలని అనుకున్నారు. కానీ.. రోహిత్ శర్మ, అజిత్ అగార్కర్ మాత్రం శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేశారు. అయితే టీ20ల్లో సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్‌గా ఉన్నప్పటికీ.. అతడి ఫామ్ ఇబ్బంది కరంగా మారింది. కాబట్టి టీ20 కెప్టెన్సీని హార్దిక్ కు ఇచ్చే అవకాశం ఉంది. అయితే ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ప్రదర్శన, ఫలితం పైనే కెప్టెన్సీ ఎవరికీ అప్పగించాలనేది ఆధారపడి ఉంటుంది. రోహిత్ శర్మ ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించొచ్చు. కాబట్టి ఛాంపియన్స్ ట్రోఫీలో హార్దిక్ మంచి ప్రదర్శన చేస్తే వన్డే కెప్టెన్సీని అయినా హార్దిక్ కు ఇవ్వొచ్చు. ఎలాగో గిల్ డిప్యూటీగా ఉంటాడు. పైగా హార్దిక్‌కు అన్యాయం జరిగిందనే భావన.. బీసీసీఐలోని పలువురి సభ్యులకు ఉంది. అందుకే పాండ్యకు వన్డే బాధ్యతలు ఇస్తారు.' అని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

## జాతీయ క్రీడల్లో తెలుగు అథ్లెట్ల జోరు..



### ఆంధ్రజట్టుకు పసిడి పతకం

ఉత్తరాఖండ్ వేదికగా ప్రతిష్టాత్మక 38వ జాతీయ క్రీడలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రీడల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అథ్లెట్లు మంచి ప్రదర్శన చేస్తున్నారు. తమ అద్భుత ప్రదర్శనలతో పతకాలను ఖాతాలో వేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఈ క్రీడల్లో ఆంధ్ర, తెలంగాణ, ఖాతాల్లో మరిన్ని పతకాలు వచ్చి చేరాయి. ఆంధ్రప్రదేశ్ బీచ్ వాలీబాల్ టీమ్ గోల్డ్ మెడల్ ను సొంతం చేసుకుంది.ఈ తుది పోరులో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కె.మణికంఠ రాజు, ఎల్.దివ్యసాయి ద్వయం.. 2523, 2119 తేడాతో తమిళనాడు జోడీపై విజయాన్ని అందుకుంది. తద్వారా పసిడి పతకాన్ని ముద్దాడింది. ఇక బాక్సింగ్ 91 ప్లస్ కిలోల విభాగంలో తెలంగాణకు చెందిన బాక్సర్ అబ్దుల్ జావేద్ కాంస్యం పతకాన్ని గెలుచుకున్నాడు.

**ఆర్చరీలో విజేతలుగా దీపిక, జుయెల్**

ఈ జాతీయ క్రీడల్లో ఆర్చరీ విభాగంలో సీనియర్ దీపిక కుమారి, 18 ఏళ్ల జుయెల్ సర్కార్ విజయం సాధించారు. మహిళల రికర్వ్ సింగిల్స్ ఫైనల్ లో దీపిక 64 తేడాతో అంకిత (బిహార్)పై పోరాడి గెలిచింది. అయితే పురుషుల రికర్వ్ సింగిల్స్‌లో స్టార్ ఆర్చర్ తరుణ్ దీప్ రాయ్‌కు మాత్రం నిరాశే ఎదురైంది. సెమీ ఫైనల్లో తరుణ్ 26 తేడాతో 18 ఏళ్ల జుయెల్‌పై పరాజయం పొందాడు. అయినప్పటికీ అతడు బ్రాంజ్ మెడల్ ను సంపాదించుకున్నాడు. కంచు పోరులో ఇంద్ర చంద్‌ను తరుణ్ దీప్ 64 తేడాతో ఓడించి కాంస్య పతకాన్ని అందుకున్నాడు. ఇక రికర్వ్ టీమ్ విభాగంలో ఝార్ఖండ జట్టు విజేతగా నిలిచింది. దీపిక, అంకిత భాకత్, కోమలిక, తమన్నాతో కూడిన మహిళల జట్టు 06 తేడాతో మహారాష్ట్ర జట్టును ఓడించింది.

# రీల్

## లైలా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు మెగాస్టార్



ప్రస్తుతం మన టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా భారీ సినిమా విశ్వంభర చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం కొనసాగుతుండగా మరో పక్క మన టాలీవుడ్ నుంచి పలు సినిమాలు థియేటర్స్ లో అలరించేందుకు వస్తున్నాయి. మరి ఇలా లేటెస్ట్ గా మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటిస్తున్న సినిమా లైలా కూడా ఇపుడు వస్తుంది. ఈ వాలెంటైన్స్ డే కానుకగా మేకర్స్ ఈ చిత్రాన్ని తీసుకొస్తుండగా ఈ సినిమా కోసం ఇపుడు మెగాస్టార్ చిరంజీవిని మేకర్స్ తీసుకొస్తున్నారు. లాస్ట్ టైం జీబ్రా ప్రీ రిలీజ్ కి వచ్చిన మెగాస్టార్ ఇపుడు లైలా కోసం రానున్నట్లు విశ్వక్ తెలిపాడు. చిరంజీవిని కలిసి ఆహ్వానించిన పిక్స్ ఇపుడు వైరల్ గా మారాయి. తనతో పాటుగా నిర్మాత సాహు గారపాటి కూడా కలిసి చిరుని ఆహ్వానించారు. దీనితో ఈ ఫోటో మూమెంట్ వైరల్ గా మారింది. ఇక ఈ ఈవెంట్ డేట్ ఇతర వివరాలు తెలియాల్సి ఉంది.

## కుంభమేళాలో 'అఖండ' మాస్ క్రేజ్



నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా డాకు మహారాజ్ తో తన కెరీర్లో మరో సాలిడ్ హిట్ ని అందుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రం హిట్ కి ముందు బాలయ్య 2.0 కి పునాది వేసిన సెన్సేషనల్ హిట్ చిత్రం అఖండ అని చెప్పాలి. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కించిన ఈ భారీ సినిమా బాలయ్యకి నెక్స్ట్ లెవెల్ కంబ్యాక్ ఇవ్వడమే కాకుండా అక్కడ నుంచి వరుస హిట్స్ తో బాలయ్య ఫామ్ లోకి వచ్చేలా చేసింది. ఇక ఇపుడు దీనికి సీక్వెల్ అఖండ 2 తాండవంగా రాబోతుండగా దీనిపై భారీ హైప్ నెలకొంది. అయితే ఆ పార్ట్ 2 షూటింగ్ ని ఈ ఏడాది జరిగిన మహా కుంభమేళాలో స్టార్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇలా నిజమైన కుంభమేళాలో స్టార్ట్ అయ్యిన ఈ సినిమాపై లేటెస్ట్ పార్ట్ 1 మాస్ క్రేజ్ కనిపిస్తుంది. అక్కడ అఖండ బాలయ్య పెయింటింగ్ తో కూడిన వెస్ట్ బెంగాల్ బస్సులు దర్శనం ఇచ్చాయి. దీనితో ఇవి సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మరి పార్ట్ 1 కి హిందీ ఆడియెన్స్ నుంచి సాలిడ్ రెస్పాన్స్ వచ్చింది. పార్ట్ 2 కూడా నార్త్ ఆడియెన్స్ లో ఓ రేంజ్ లో వర్క్ అవుతుంది అని మేకర్స్ భావిస్తున్నారు.





## యుఎస్ లో తండేల్ రెస్పాన్స్ అదుర్స్

లేటెస్ట్‌గా మన టాలీవుడ్ నుంచి రిలీజ్ కి వచ్చిన లేటెస్ట్ సినిమా తండేల్ కోసం తెలిసిందే. యంగ్ హీరో నాగ చైతన్య హీరోగా సాయి పల్లవి హీరోయిన్ గా దర్శకుడు చందూ మొండేటి తెరకెక్కించిన ఈ సినిమా మంచి అంచనాల నడుమ రిలీజ్ అయ్యింది. అయితే మన దగ్గర మాత్రమే కాకుండా యూఎస్ మార్కెట్ లో కూడా సాలిడ్ ఓపెనింగ్స్ తో తండేల్ ఇపుడు అదరగొడుతుంది. మరి యూఎస్ లో ఈ సినిమా ప్రీమియర్స్ తోనే 2 లక్షలకి పైగా గ్రాస్ ని అందుకున్నట్టుగా డిస్ట్రిబ్యూటర్స్ చెబుతున్నారు. దీనితో తండేల్ రెస్పాన్స్ అదిరింది అని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రంని నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కించగా దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. అలాగే బన్నీ వారు నిర్మాణం వహించగా దిగ్గజ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో ఈ చిత్రం పాన్ ఇండియా భాషల్లో రిలీజ్ కి వచ్చింది.

## టెలివిజన్ ప్రీమియర్‌కు సిద్ధమైన వేట్టయన్




కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా మంజు వారియర్ హీరోయిన్ గా అలాగే మన టాలీవుడ్ వెర్స టైల్ నటుడు రానా దగ్గుబాటి విలన్ రోల్ లో దర్శ కుడు టి జె జ్ఞానవేల్ తెరకెక్కించిన చిత్రమే వేట్టయన్. మరి గత ఏడాది దసరా కానుకగా వచ్చిన ఈ సినిమా యావరేజ్ గా మాత్రమే నిలిచింది. తెలుగులో కూడా పర్వాలేదు అనే రేంజ్ లోనే ఆడిన ఈ సినిమా ఇపుడు ఫైనల్ గా తెలుగు టెలివిజన్ వరల్డ్ ప్రీమియర్ గా టెలికాస్ట్ అయ్యేందుకు సిద్ధం అయ్యింది. మరి ఈ సినిమాని జెమినీ టీవీ వారు సొంతం చేసుకోగా ఈ ఫిబ్రవరి 16న సాయంత్రం 6 గంటలకి టెలికాస్ట్ కి సిద్ధం అయ్యింది. మరి ఇటీవల తమిళ నాట టెలికాస్ట్ అయ్యిన ఈ సినిమా భారీ రెస్పాన్స్ ని అందుకుంది. మరి మన తెలుగులో ఈ సినిమా ఎలాంటి రెస్పాన్స్ అందుకుంటుంది అనేది చూడాలి. ఇక ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందించగా ఫాహాద్ ఫాజిల్, రితిక సింగ్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.

## ఎస్‌సి వర్గీకరణతో కులాలు ఏకం

### ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాల మాదిగలను ఎబిసిలుగా వర్గీకరించి మూడు గ్రూప్ లలో కుదించడం ద్వారా భావ స్వరూప్యతా, సంప్రదాయాలు కలగాల్సిన కులాలను ప్రభుత్వం ఒక్కటి చేసిందని తెలిపారు.ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ తెలిపారు. సుప్రీం కోర్టు అదేశాల మేరకు షెడ్యూల్ ఉప కులాలను జస్టిస్ షామిమ్ అక్తర్ ఏకసభ కమిషన్ వేసి నివేదిక ఆధారంగా మూడు గ్రూపులుగా ప్రభుత్వం వర్గీకరించిందన్నారు.శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ చేసిన జస్టిస్ షామిమ్ అక్తర్ ,ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ ఉప సంఘానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలన్నారు. 2011 ప్రభుత్వ అధికారిక జనాభా లెక్కల ప్రకారం ఆధారంగా రిజర్వేషన్లను కేటాయించడం జరిగిందని ఆయన వెల్లడించారు. జస్టిస్ షామిమ్ అక్తర్ ఏకసభ కమిషన్ సిపార్సుల ప్రకారం మొత్తం 59 షెడ్యూల్ ఉప కులాలను 3 గ్రూప్‌లుగా విభజించి ఉందులో గ్రూప్1కు 1శాతం. గ్రూప్ 2కు 9శాతం, గ్రూప్ 3కు 5శాతం రిజర్వేషన్లు ఖరారు చేసిందన్నారు. ఇందులో అత్యంత వెనకబడినట్లు గుర్తించిన (జనాభా 3.288 శాతం ) ఉన్న గ్రూఫ్ 1కు 1 శాతం రిజర్వేషన్, కొంత మెరుగైనస్థితిలో ఉన్న 18 ఉప కులాలు (జనాభా 62.74 శాతం) ఉన్న గ్రూప్ –2కు 9శాతం రిజర్వేషన్లు ఈ రెండు గ్రూప్‌లకంటే మరింత మెరుగైన స్థితిలో ఉన్న 26 ఉప కులాలు (జనాభా 33.963శాతం) ఉన్న గ్రూప్– 3కి 5శాతం రిజర్వేషన్ కల్పించినట్లు ఆయన వెల్లడించారు. గ్రూప్‌కు కేటాయించిన 9 శాతం మొత్తం మాదిగాలకే కాదని, అదేవిధంగా గ్రూప్ 3కి ఇచ్చిన 5 శాతం మొత్తం మాలలకే కాదని గుర్తించుకోవాలని సూచించారు. 35 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్నా సమస్యను పరిష్కరించిన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రిదామోదర రాజ నరసింహా ఎలా దోషులు అవుతారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బతికి ఉన్నంత కాలం ఏ కులాలు వారు అధైర్య పడాల్సిన అవసరం లేదు.




## గ్రామీణ జెఎన్‌టియుహెచ్ విద్యార్థులకు 'ఆన్‌లైన్ తరగతులు'

### ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామీణ ప్రాంతాల్లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జెఎన్‌టియుహెచ్) అనుబంధ కళాశాల విద్యార్థులకు 15 శాతం నుంచి 20 శాతం వరకు ప్రధాన క్యాంపస్ విద్యార్థులతో సమానమైన నాణ్యమైన విద్యను అందించేందుకు వీలుగా ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్,జెఎన్‌టియుహెచ్ ఉపకులపతి ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని జెఎన్‌టియుహెచ్ యుసిఇఎస్‌టి ప్రిన్సిపాల్ కార్యాలయ కమిటీహాల్‌లో ఆయన శుక్రవారం 'ఆన్‌లైన్ తరగతులను' ప్రారంభించారు. జెఎన్‌టియుహెచ్ రెక్టర్ డాక్టర్ కె.విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు,విశ్వవిద్యాలయ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జెఎన్‌టియుహెచ్ యుసిఇఎస్‌టి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.వి.నరసింహారెడ్డి సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ కళాశాలల్లో అధ్యాపకుల కొరత సమస్యను పరిష్కరించడంత పాటు విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యాను అందించేందుకు ఆన్‌లైన్ తరగతులు ఎంతో దోహదపడుతాయని వివరించారు. ప్రస్తుతానికి జెఎన్‌టియుహెచ్‌సిరిసిల్ల, జెఎన్‌టియుహెచ్‌వనపర్తిలో ఆన్‌లైన్ తరగతులను నిర్వహించి,రాబోయే నెలల్లో మరిన్ని కళాశాలలో ఆన్‌లైన్ తరగులను విస్తరిస్తాని చెప్పారు. కాగా కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన డాక్టర్ ఇ.హేమలత, రెండో సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు 'ఆపరేటింగ్ సిస్టమ్స్' అనే అంశంపై తొలి ఆన్‌లైన్ తరగతులను నిర్వహించారు.










## ప్రధాని నోరు విప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

అంటూ విద్యార్థులకు సంకెళ్లు వేస్తూ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడటం సరైనది కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ లో బీసీ కులగణన, ఎస్సి వర్గీకరణ అమలు కోసం తీర్మానం పెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ కులగణన సరిగ్గా జరగలేదని, సర్వే నిష్పక్షపాతంగా దాపరికం ఉండకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ జనాభా ఎంత ఉంటే అంత రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ వర్గీకరణ అనేక పోరాటాలు చేస్తే సాధించిన వర్గీకరణ బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేటట్టు చూడాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే దిశగా పనిచేయాలని కోరారు . రాష్ట్రంలో భూ భూ పోరాటాలు ఇళ్ల స్థలాల కోసం 8 ఏళ్లుగా సిపిఐ పార్టీ నర్సంపేటలో కొనసాగించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు లేని పేద ప్రజలు గుడిసెలు వేసుకున్న ప్రతి కుటుంబానికి ఇంటి స్థలాల పట్టాలి ఇచ్చి ఇండ్లు కట్టించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పేద ప్రజలకు ఇండ్ల స్థలాల పట్టాలిచ్చి ఆదుకోవాలని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం లో మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ హామీ లాగా రాష్ట్ర ప్రభుత్వ హామీ మిగిలిపోవద్దని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు . మధ్యాహ్న భోజన కార్మికులు , గ్రామపంచాయతీ సిబ్బంది, ఔట్సోర్సింగ్ , లాంటి వారికి బకాయిపడిన వేతనాలు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .

**ఉమ్మడి వరంగల్ అభివృద్ధిపై నిర్లక్ష్యం వీడాలి : తక్కలపల్లి**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి నిర్లక్ష్యం చేస్తూ రెండో రాజధాని చేస్తామంటూ కాలయాపన చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు విమర్శ చేశారు . ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి చేసేందుకు గిరిజన విశ్వవిద్యాలయం, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. రెండో రాజధాని వరంగల్ అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఏమి ఒరగబెట్టిందని వరంగల్ అభివృద్ధి కావాలంటే ప్రణాళిక సిద్ధం చేసి విడుదల చేయాలన్నారు . వరంగల్ జిల్లా అభివృద్ధి చెందాలంటే ప్రాజెక్టులు పరిశ్రమలు రావాలని లేకుంటే సిపిఐ పార్టీ భవిష్యత్తులో ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి కోసం పోరాటం చేస్తుందని తెలిపారు.

**చంద్రమౌళి కాలనీ సందర్శించిన చాడ వెంకట్ రెడ్డి**

నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డులో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గత ఎనిమిది ఏళ్ల క్రితం గుడిసెలు వేసుకున్న గుడిసె వాసులకు ప్రభుత్వం వెంటనే మౌలిక వసతులు కల్పించి ఆదుకోవాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు . శుక్రవారం మాదన్నపేట రోడ్డులో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్న చంద్రమౌళి కాలనీని రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కలిసి సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి తో గుడిసేవాసులు తాగునీటికి, విద్యుత్ సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని మొరపెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాల పట్టాల తో పాటు ఇల్లు నిర్మించుకుని బాధ్యత తీసుకోవాలని చాడ వెంకట్ రెడ్డికి వినతి పత్రం సీఎం రేవంత్ రెడ్డికి అందేలా చూడాలని అందించారు. ఈ సందర్భంగా గుడిసె వాసులను ఉద్దేశించి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అనేక భూ పోరాటాలు ఇంటి స్థలాల కోసం పేదల పక్షాన కొట్లాడి ఇళ్ల స్థలాలు సాధించిన ఘనత సిపిఐ పార్టీకే దక్కిందని అన్నారు . ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్కె బాషుమియా, పనస ప్రసాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంపెల్లి మునిశ్వర్ అక్క పెల్లి రమేష్, దండు లక్ష్మన్, నర్సంపేట మండల కార్యదర్శి గడ్డం యాకయ్య, జిల్లా సమితి సభ్యులు పాలక కవిత, అయితే యాకుబ్ , మియాపురం గోవర్ధన్, ఎండి అక్బర్ పాషా, జన్ను రవి, చింతకింది కుమారస్వామి, బానోతు వీరు నాయక్, గడ్డం నాగరాజు, పిట్టల సతీష్, వడ్ల కొండ స్వామి, మమత, శైలజ, గుంటి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

శాసనసభ ముందు ప్రవేశపెట్టారు. ప్రకృతి ప్రకోపంతో విధ్వంసమైన వయనాడ్ పునర్‌నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.750 కోట్లు కేటాయించారు. అలాగే ఢిల్లీ, ముంబై తరహాలో హైదరాబాద్ నగరంలో కేరళ హౌస్ నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించారు. ఇటీవల కాలంలో కేరళ రాష్ట్రాన్ని ప్రభావితం చేసిన ఆర్థిక అడ్డంకులను గుర్తించడం జరిగిందని ఆర్థికశాఖమంత్రి నొక్కిచెప్పినప్పటికీ భూమిపన్ను, ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్ ట్యాక్స్, రశీదులను పెంచడానికి కోర్టు ఫీజులు సహా ఆదాయమార్గాలను పెంచే చర్యలను బడ్జెట్ వివరిస్తుంది. ఇది 2025–2026 సంవత్సరంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రం ప్రతిపాదిత వ్యయం కంటే దాదాపు రూ.27,000 కోట్లకు తక్కువగా ఉంది.కేరళ మౌలికవసతులు పెట్టుబడి నిధి బోర్డ్ (కెఐఐఎఫ్‌బి)ను ఆదాయాన్ని ఆర్జించే సంస్థగా నిలబెట్టడానికి రూ.87,000కోట్లకు పైగా గెలుచుకున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టల కోసం తీసుకున్న రుణాల కారణంగా అప్పుల భారం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్లు, ట్యాక్స్ వాటా కేటాయింపులలో పెద్దయెత్తున ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ ఈ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు, రుణభారం వంటి సూచీలను గణనీయంగా తగ్గించగలిగిందని కెఎన్.బాలగోపాల్ చెప్పారు. 'అనవసర ఖర్చులను నివారించడం, ఇతర ఖర్చులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మేం మా స్వంత పన్ను ఆదాయాన్ని పెంచుకోవడాన్ని కొనసాగిస్తున్నాం. 2020–21ఆర్థిక సంవత్సరం చివరినాటికి రూ.47,660కోట్లుగా ఉన్న సొంత పన్ను ఆదాయాన్ని 2024–25 ఆర్థిక సంవత్సరం చివరినాటికి రూ.81,000 కోట్లకు పెంచు కోగలుగుతాం. 4ఏళ్లలో ఇది 70శాతానికి పెరిగింది. కేరళ రాష్ట్రానికి చెందిన మొత్తం సొంత ఆదాయాన్ని రూ.54,000 కోట్ల నుంచి రూ.1,03, 240కోట్లకు పెంచుకోగలిగాం' అని ఆర్థికశాఖమంత్రి కెఎన్.బాల గోపాల్ శాసన సభకు తెలిపారు.ప్రభుత్వం సగటు వార్షిక వ్యయాన్ని కూడా 40శాతానికి పెంచామని, ఆ పెరుగుదల సమాజంలోని వివిధ రంగాలను ప్రభావితం చేసిందని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.30,370 కోట్ల నుంచి రూ.32,500 కోట్లకు 2025–26 సంవత్సరంలో పెంచిన ప్రభుత్వ ప్రణాళికా వ్యయం వివరాలను ఆయన అందజేశారు. ఆరోగ్య రంగానికి రూ.10,431.73కోట్ల మొత్తాన్ని, గ్రామీణ అభివృద్ధి రంగానికి రూ.7,098.74కోట్ల మొత్తం, పిడబ్ల్యుడి కింద రోడ్లు, వంతెనల కోసం రూ.3,061కోట్లు కేటాయించినట్లు బాలగోపాల్ చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే దాదాపు అన్ని రంగాలకు కేటాయించే మొత్తా లలో పెంపుదల ఉందని మంత్రి చెప్పారు. కేంద్ర ప్రభు త్వం నుంచి రాష్ట్రానికి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ వార్షిక ప్రణాళికలను పెంచడం జరిగిందని ఆర్థికశాఖ మంత్రి బాలగోపాల్ సభకు వివరించారు. రాష్ట్రానికి ప్రభుత్వ మౌలిక సదుపాయాల అభివృద్ధిని ప్రకటించిన బాలగోపాల్ దక్షిణ కేరళకు షిప్‌యార్డును ప్రతిపాదించారు.ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం కోరుతుందని, షిప్‌యార్డ్ ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం తీసుకుంటందని భావించినప్పుడు అవసరమైన బాధ్యతలను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని మంత్రి బాలగోపాల్ స్పష్టం చేశారు.2025–2026 ఆర్థిక సంవత్సరంలో తిరువనంతపురం మెట్రోరైలు ప్రాథమిక కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని, తిరువనంతపురంకోజికోడ్ మెట్రో రైల్ వ్యవస్థల అమలును లక్ష్యంగా పెట్టుకున్నామని, కొచ్చి మెట్రో అభివృద్ధి చెందుతుందని ఆర్థికశాఖ మంత్రి బాలగోపాల్ శాసనసభకు వివరించారు. ప్రభుత్వ అంతిమ లక్ష్యం విజింజమ్ కేవలం ట్రాన్షిప్‌మెంట్ హబ్‌గానే కాకుండా సింగపూర్‌లోని రోటర్‌డామ్, దుబాయ్ రేవుల నుంచి ఎగుమతిదిగుమతుల ప్రధానరేవు (ఇఎక్స్ఐఎంఎగ్జిమ్) స్ఫూర్తితో తీర్చిదిద్దుతామన్నారు..విజింజంకొల్లాంపునలూరు గ్రోత్ ట్రయాంగిల్ (వికెపిజిటి) కీలకమైన రవాణ కారిడార్‌లుగాబలోపేతం చేయాలన్న లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. అంతేకాకుండా మల్టీ మోడల్ పార్కుల అభివృద్ధి, మ్యానుఫాక్చరింగ్ హబ్స్, స్టోరేజీ సదుపాయాలు, ప్రాసెసింగ్ యూనిటు, అసెంబ్లింగ్ యూనిట్లు, లాజిస్టిక్స్ సెంటర్ల కేంద్రాల అభివృద్ధిని గ్రోత్ కారిడార్ పొడవునా సులభతరం చేస్తామని ఆర్థికశాఖమంత్రి తెలియజేశారు.సర్వీస్ పెన్షన్ల రివిజన్ ఏరియర్ల కోసం రూ.600కోట్ల చివరి ఇన్‌స్టాల్‌మెంట్ మొత్తాన్ని ఈ నెలలో చెల్లిస్తామన్నారు. సామాజిక భద్రతా పెన్షన్ ఏరియర్లకు సంబంధించిన మిగతా మూడు ఇన్‌స్టాల్‌మెంట్స్‌ను 2025–2026ఆర్థిక సంవత్సరంలోనే చెల్లించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రణాళికా వ్యయంలో రూ.27,000కోట్లకు పైగా లోటును భర్తీచేసేందుకు మరిన్ని నిధులను సమీకరించనున్నట్లు తెలియజేశారు. ల్యాండ్ ట్యాక్స్ రేట్లను 50శాతానికి పెంచాలని, 15ఏళ్లకు పైగా ఓల్డ్ ప్రైవేట్ వాహనాలపై రోడ్డు ట్యాక్స్‌ను 50శాతం పైగా పెంచాలని, కోర్టు ఫీజులను సవరించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. ఈ ప్రతిపాదనల మూలంగా ప్రభుత్వానికి రూ.335కోట్ల అదనపు ఆదాయం లభిస్తుందన్న అంచనా వేస్తున్నట్లు ఆర్థికమంత్రి సభకు వివరించారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com